# జనబలం

ప్రజలే ప్రభువులు

మే 2024 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-



## ఈ ఎన్నికలు మామూలు పోటీ కాదు.. దేశ భవిష్యత్తు కోసం పోరాటం

**కేరళ వాదన- భారత ఆర్థిక స్థిరత్వం**

**నీళ్లు, నీళ్లు, ఎటు చూసినా నీళ్లు!**

**ఆర్థర్ కాటన్- ప్రజాధనం వినియోగం**

**ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామిక పార్టీలు**




## ఇండియా - ది రోడ్ టు రినైజాన్స్: ఎ విజన్ అండ్ ఎజెండా



ఐక్యరాజ్యసమితి మాజీ అధికారి, రిటైర్డ్ ఐఏఎస్ భీమేశ్వర్ చల్లా (సీబీ రావు) రాసిన 'ఇండియా - ది రోడ్ టు రినైజాన్స్: ఎ విజన్ అండ్ ఎజెండా' పుస్తకావిష్కరణ హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి)లో జరిగింది. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, యూనియన్ హెూం శాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, టైమ్స్ ఫోరం సంపాదకుడు రామ్ మనోహర్‌రెడ్డి, ఆస్కి డీన్ ప్రొఫెసర్ సుబోధ్ కుందముతన్ తదితరులు పాల్గొన్నారు.



# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

మే
2024

సంపుటి 25 సంచిక 05

**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**




## లోపలి పేజీలలో..

➥ ఈ ఎన్నికలు మామూలు పోటీ కాదు.. దేశ భవిష్యత్తు కోసం పోరాటం — 5
➥ జేపీతో ఏపీ ఎన్నికల ఎక్స్‌క్లూజివ్ — 7
➥ అప్పు చేసి సంక్షేమం వల్ల యువత ఉపాధికి గండి — 9
➥ నీళ్లు, నీళ్లు, ఎటుచూసినా నీళ్లు! — 13
➥ ఐలయ్య అభాండాలకు లోక్‌సత్తా సమాధానం — 20
➥ దేశం ఆర్థికంగా ఎదగాలి, అందుకు మనమేం చేయాలి? — 30
➥ సర్ ఆర్థర్ కాటన్ నుంచి జేపీ దాకా — 33

కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక,
హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# గోబెల్స్ ను మించిపోతున్న అర్ధ సత్యాలు-అసత్యాలు

దేశవ్యాప్తంగా 18 వ లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే మూడు విడతల పోలింగ్ పూర్తి అయింది. పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. ఈ ఎన్నికల ప్రచార సరళిని గమనిస్తే దేశవ్యాప్తంగా జరుగుతున్న ఐపీఎల్ 20-20 క్రికెట్ మ్యాచ్‌లు గుర్తొస్తున్నాయి. విషాదం ఏమిటంటే ఈ పార్లమెంట్ ఎన్నికలను ప్రజలు క్రికెట్ మ్యాచ్‌గా మాత్రమే చూస్తున్నారు.

ద్వాపరయుగంలో మహాభారతంలో ఆనాడు జరిగిన కురుక్షేత్ర యుద్ధంలో ద్రోణాచార్యుడిని చంపాలంటే "అశ్వద్ధామ హతో హత" మొదట పెద్దగా అని తర్వాత "నరో కుంజరో" అని ఎవరికి వినపడకుండా అని ధర్మరాజు స్వయంగా అబద్ధాలు ఆడవలసి వచ్చింది. ధర్మం పలికినట్లు కాదు పలకనట్లు కాదు. ఆనాటి యుద్ధనీతి అది. అయితే ఈనాడు ఆనాటి యుద్ధనీతిలో పాటించిన ధర్మం, అధర్మం అనే పదాల మధ్య ఉన్న సన్నటి గీతలు కూడా చెరిగిపోయాయి. ప్రస్తుతం ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలి, దానికి ఎంతకైనా తెగించాలి అన్న ఆలోచన తప్పితే ప్రజాస్వామ్యంలో ఇది సరైనది కాదు అని ఇంగిత జ్ఞానం రాజకీయ పార్టీలకు, నాయకులకు కొరవడింది.

ప్రస్తుత ఎన్నికల రణ క్షేత్రంలో కులాలు, మతాలు, భాష, ప్రాంతం కుటుంబం వీటన్నిటి మధ్య చిచ్చుపెట్టే విభజన రాజకీయాలు దారుణంగా విజృంభించాయి. అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, కుక్కపిల్ల, కాదేది కవితకు అనర్హం అని మహాకవి శ్రీశ్రీ అన్నట్లు గెలుపుకు ఎన్ని అబద్ధాలు అయినా ఆడవచ్చని, వ్యక్తిగత విమర్శలు, వ్యక్తిత్వ హననాలు చేయవచ్చని నేటి నాయకులు అంటున్నారు. అందుకే ఫలానా వాళ్లు వస్తే రిజర్వేషన్లు తీసేస్తారని, ఫలానా వాళ్లు వస్తే కేవలం ఒక వర్గానికే మేలు చేస్తారని, ఫలానా చట్టం వల్ల ప్రజలకు అపార నష్టం కలుగుతుందని ప్రజలను నమ్మించ ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి సమస్యకు కేవలం రాజకీయ పరిష్కారం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదనే భావనను ప్రజల్లో విస్తరింప చేస్తున్నారు. ఇందులో భాగం గానే అనేక విధానాల మీద ఎదుటివారిని విమర్శించడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఇక దేశంలో చట్టము,రాజ్యము ఉండవు అనేంతగా ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారు.

నేటి రాజకీయాలు ఎలా తయారయ్యాయి అంటే తమ విజయాలకు ఎవరు అడ్డం వచ్చినా వారిని తొక్కుకుంటూ పోతామనే ధోరణి ప్రబలింది. అందుకే ప్రతి పార్టీ గెలుపు గుర్రాలను తమ అభ్యర్థులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తోంది. గెలుపు గుర్రాలు అంటే అర్థబలం, అంగబలం తో పాటు అబద్ధాల బలం కూడా ఉండాలి. దానికి తగ్గట్టుగానే ప్రజలు కూడా ఎవరు గెలిచినా తమకు లాభము నష్టము లేదు అని భావిస్తున్నారు. కనుక కులానికో, మతానికో, భాషకో, ప్రాంతానికో లోబడుతూ చివరికి చచ్చినోడికి వచ్చిందే కట్నం అంటూ డబ్బు, మద్యం ఇంకా ఇతర తాయిలాలు తీసుకొని ఓటు వేస్తున్నారు. విధానాల ప్రాతిపదికపై కాకుండా ఎదుటివారిని ఓడించడానికి ఏం చేయాలి అనే అంశం చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. ఫలానా వాడు ఓడాలంటే ఎదుటివాడు ప్రత్యామ్నాయం కాకపోయినా సరే ఫలానా వాడికి ఓటు వేయాలనే ధోరణి ఓటర్లలో ప్రబలింది. ఆ ఆలోచన ఫలితంగా సకారాత్మక ధోరణి నుండి నకారాత్మక ధోరణితోనే ఓట్లు పడుతున్నాయి. వాళ్ళ కంటే వీళ్ళు, వీళ్ళకంటే వాళ్ళు నయం అని ప్రజలు భావించి ప్రతిసారి ప్రభుత్వాలను మారుస్తున్నారు. దేశంలో, రాష్ట్రాలలో పార్టీలను ప్రభుత్వాలను మార్చడంలో మనమే దిట్ట. "ఏ రాయి అయితే తల పగలగొట్టుకోవడానికి" అనే ధోరణి ప్రబలిన తర్వాత ఓటర్ల నిర్లిప్తత మరింత ఎక్కువైంది. అందుకే ప్రతి ఎన్నికకు డబ్బు, మద్యం ప్రభావం ప్రతిసారి పెరుగుతుంది.

పండితులే ఈనాటి రాజకీయాల గురించి రాజకీయం అంటే "రాక్షసంగా జనానికి కీడు చేసే యంత్రాంగం"గా అభివర్ణిస్తున్నారు. రాజకీయాల గురించి ఈ అభిప్రాయం సరైనది కాదు. ప్రజల నిరాశా, నిస్పృహలను మాత్రమే వెల్లడిస్తుంది. జన రాజకీయం కాస్తా ధన రాజకీయంగా మారి సామాన్యుడు వార్డ్ మెంబర్ నుంచి పార్లమెంట్ మెంబర్ వరకు పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. దానివల్ల ఈ రాజకీయాలలో సామాన్య పౌరులు అభ్యర్థులుగా పాలు పంచుకోలేక కేవలం ఓటర్లుగా మిగిలిపోతున్నారు. కొన్నిసార్లు ఓటర్లుగా కూడా తమ వంతు పాత్ర నిర్వహించడం లేదు. అసలు ఓటు వేయకుండానే ఉండిపోతున్నారు. చీకటిని తిడుతూ కూర్చుంటున్నారు. చిరు దీపం వెలిగించే ప్రయత్నం చేయడం లేదు.

140 కోట్లు జనాభా ఉన్న మన దేశంలో ఇప్పటికీ మూడు వ్యవస్థలు సరిగ్గా పని చేస్తున్నాయి. అందులో మొదటిది ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కల సేకరణ .రెండవది ప్రజలకు ఇమ్యూనైజేషన్ టీకాలు వేసే ప్రక్రియ, మూడవది ప్రపంచ దేశాలలో అత్యంత పెద్దదైన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల తర్వాత అధికార మార్పిడి కూడా సజావుగా జరుగుతుంది. ఈ విషయాన్ని గమనిస్తే ఎన్నికలలో ఎన్ని అవకతవకలు ఉన్నా కూడా అంతిమంగా ప్రజాస్వామ్యమే గెలుస్తుందనే నమ్మకమే పునాదిగా ముందుకు వెళితే మనం తప్పక విజయం సాధిస్తాము. అప్పుడు ఎన్నికలలో పార్టీలో నాయకులో కాదు, ప్రజలే గెలుస్తారు. ప్రజలే గెలవాలి కూడా!!!.

- బండారు రామ్మోహనరావు

## ఈ ఎన్నికలు మామూలు పోటీ కాదు..

# దేశ భవిష్యత్తు కోసం పోరాటం

ఈ వేళ దేశం సంధియుగంలో ఉంది. ఒక నిరుపేద దేశంలో తాత్కాలికమైన తాయిలాలతో ప్రజలను మభ్యపెట్టటమా? మన బిడ్డల భవిష్యత్తు కోసం బలమైన పునాదులు వేసి, ఆత్మగౌరవాన్ని పెంచి వారి కాళ్ల మీద వాళ్లను నిలబెట్టే, వాళ్ల ఆదాయాన్ని పెంచే ఏర్పాటు చేయటమా? అందుకే ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు మామూలు పోటీ కాదు. ఇది కులాల పోరాటం కాదు, మతాల పోరాటం కాదు, ప్రాంతాల పోరాటం కాదు. ఈ దేశ భవిష్యత్తు కోసం, దేశ ఆత్మ కోసం జరుగుతున్న పోరాటం. నేను చిత్తశుద్ధితో గుండె లోతుల్లో నుంచి ఈ మాట చెబుతున్నాను. ఈ దేశ ప్రజలు, ఓటర్లు తమ మంచేమిటో తాము గుర్తెరగాలి" అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఎంపీగా, యూనియన్ మంత్రిగా రాష్ట్రానికి, జీహెచ్ఎంసీకి తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో 'ప్రజలకు నివేదిక' పేరుతో కిషన్ రెడ్డి పుస్తకం రూపొందించారు. అందులోని వివరాలతో హైదరాబాద్‌లో ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రజలకు నివేదిక కార్యక్రమం మన ప్రజాస్వామ్యంలో ఉన్న బలాన్ని చూపెడుతుందని జేపీ అన్నారు. "చాలామంది ఈ దేశంలో ప్రజాస్వామ్యం లేదు, నాశనమైందని అతిశయోక్తులు చెబుతున్నారు. లోపాలున్నాయి. లోపాలులేని ప్రజాస్వామ్యం ప్రపంచంలో ఎక్కడా లేదు. అమెరికాతో సహా. కానీ బలమైన ప్రజాస్వామ్యం, నిజమైన ప్రజాస్వామ్యం, తలెత్తుకుని గర్వంగా నిలిచే ప్రజాస్వామ్యం మనకు ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. మనం ఇచ్చిన ఓటుతో మిత్రులు బాధ్యత తీసుకుంటారు. మనమిచ్చిన పన్నుల డబ్బులతో ఈ దేశంలో పిల్లల భవిష్యత్తును కాపాడటం కోసం నిర్ణయాలు చేస్తారు. అది చాలా సమగ్రంగా, కూలంకషంగా కిషన్‌రెడ్డిగారు మనముందుంచారు. ఇంకా ఈ దేశంలో ప్రజాస్వామ్యం లేదు అని మాట్లాడేవాళ్లు దేశం లోపల, దేశం బయట వివిధ కారణాలుండొచ్చు వాళ్ల మనసుల్లో, కాస్త సమ్యక్ దృక్పథంతో ఆలోచించండి. బుద్ధుడు చెప్పిందదే.



పర్‌స్పెక్టివ్. అది లేకుండా వెర్రిచేష్టలు చేస్తే మన సమాజాన్ని మనం అవమానపరిచినవాళ్లమవుతాం" అన్నారు.

తాను కిషన్‌రెడ్డి మిత్రుడిగానే కాకుండా, ఆయన నియోజకవర్గం సికింద్రాబాద్ ఓటరుగా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యానని జేపీ తెలిపారు. ఏ విషయమైనా చిరునవ్వుతో, విసుగు అనుకోకుండా, శ్రమ అనుకోకుండా , జాతీయ స్థాయిలో మంత్రిగా ఉన్నాననే భావం లేకుండా, ఎంత వీలుంటే అంత పదిమందికీ సాయం చేద్దామనే తపనను కిషన్ రెడ్డి ప్రదర్శించారని, తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధితోపాటు జాతీయ స్థాయి ప్రభుత్వ నిర్వహణ బాధ్యతలో దేశ ఉన్నతి కోసం ఏం ప్రయత్నాలు చేశారు, చేస్తున్నారు అనే విషయాల్ని ప్రజలు ముందుంచటం అభినందనీయమన్నారు.

ప్రజలు విచక్షణతో ఓటును ఉపయోగించుకుంటారని, తమ మంచిని తాము తెలుసుకుంటారని, తమ కోసం తాము ఓటు వేసుకుంటారని ఆశిస్తున్నట్లు జేపీ తెలిపారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమతూకం చేసి, దీర్ఘకాలిక

అభివృద్ధి కోసం, సంపద పెంచటం కోసం, ఉపాధి కల్పన కోసం, అణగారిన వర్గాలు, ఏ తల్లి గర్భాన పుట్టానన్న తేడా లేకుండా ఎదిగే అవకాశాల కోసం పనిచేసే ప్రభుత్వం కావాలా, తాత్కాలికమైన తాయిలాలతో ప్రజల్లో ఆత్మన్యూనతని పెంచి, నిస్సహాయుల్ని చేసి, మన అసహాయతని అవకాశంగా తీసుకుని, ఓట్లు పొందే రాజకీయం కావాలా? ఆలోచించి మనం సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు.




"మహాత్మాగాంధీ చెప్పారు – ఒక పని చేయాలా, చేయొద్దా అని ప్రజాజీవితంలో ఉన్నవాళ్లకి ఎప్పుడైనా సందేహం వస్తే, మారుమూల పూరి గుడిసెలో ఉన్న సామాన్యుడి గూర్చి ఒక్క క్షణం ఆలోచించండి.

ఆలోచించండి అని, అదే పనిగా సాయం చెయ్యి అనలా గాంధీ గారు. సామాన్యుడికి సాయం చెయ్యాలి తప్పనిసరిగా అవసరమైనప్పుడు. కానీ నువ్వు చేసే పని వల్ల అతను తన కాళ్ల మీద తాను నిలబడతాడా? అతడికి తన జీవితం మీద పట్టువస్తుందా? Will it give a measure of control over his life and destiny? అతని ఆత్మవిశ్వాసం పెరుగుతుందా? అంటే, అతని సంపాదన శక్తి పెరుగుతుందా? అలా పెంచేట్లయితే నువ్వు చేసేది చేయదగ్గపని. లేకపోతే, నిరర్థకమైన పని అని గాంధీ గారు అన్నారు. ఈవేళ జరుగుతున్న ఎన్నికలు నిరర్థకమైన పనులకు, చేయదగ్గ పనులకు పోరాటం. వ్యక్తులు శాశ్వతం కాదు. ప్రభుత్వం శాశ్వతంగానీ, ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదు. కానీ ఎలాంటి పునాదులు వేస్తారు ఈ దేశ భవిష్యత్తుకి అన్నది అత్యంత కీలకమైనది. ఈ నిర్ణయాన్ని విచక్షణతో ప్రజలంతా చేస్తారని, అదే విధంగా ఈ దేశంలో మంచి ప్రభుత్వాన్ని, మన పిల్లల భవిష్యత్తుకి పునాదులు వేసే ప్రభుత్వాన్ని ఎంచుకుంటామని మనసారా ఆశిస్తున్నాను. ఈ మొత్తం ప్రజంటేషన్‌లో నాకు బాధ కలిగించిందేమంటే, రాజకీయాలు ఎన్నయినా ఉండొచ్చు, కానీ దేశం ఒకటే. రాష్ట్రం వేరు, జాతీయ స్థాయి వేరు, రాష్ట్రం నా జాగీరు, జిల్లా నా జాగీరు, ఇది చాలా హేయమైన ఆలోచన. నేనెప్పుడూ అధికార వికేంద్రీకరణ కోసం పోరాడేవాడిని. రాష్ట్రాల హక్కుల కోసం పోరాడేవాడిని. కానీ రాష్ట్రాల హక్కుల కోసం పోరాడటమంటే దేశాన్ని బేఖాతరు చేయటం కాదు. దేశాన్ని విచ్ఛిన్నం చేయటం కాదు. దేశమంతా ఒక్కటే. ఈ సమన్వయం ఇక నుంచైనా వస్తుందని పాలకులకి, పార్టీలకి, ఈ అహంకారాన్ని త్యజించి మనసు పెట్టి దేశ ఐక్యత కోసం, దేశ ఉన్నతి కోసం పనిచేస్తారని ఆశిస్తున్నాను" అని జేపీ పేర్కొన్నారు.

కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఛైర్మన్ నరసింహారెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత హనుమంతరావు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా మద్దతుతో ఎన్డీయేకి బలం చేకూరింది

రాష్ట్రంలో ప్రజాసమస్యలు పరిష్కారం కావాలంటే తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఎన్డీయే కూటమిని గెలిపించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజ్ఞప్తి చేశారు. లోకేష్, నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, అదితి గజపతిరాజు, అయ్యన్న పాత్రుడు, వెలగపూడి రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, గణబాబు సహా వివిధ నియోజకవర్గాలలో ఎన్డీయే అభ్యర్థులను కలిసి ప్రచార తీరును అడిగి తెలుసుకున్నారు. జేపీ మద్దతుతో ఎన్డీయేకి బలం చేకూరిందని వారంతా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పెద్దఎత్తున తమ ఓటు హక్కును వినియోగించుకుని కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఏపీలో జరుగుతున్న పాలన, అభివృద్ధి తీరు, తాగు, సాగునీటి ప్రాజెక్టుల్ని గాలికొదిలేయటం, విద్వేష రాజకీయాలు మొదలైనవన్నీ బేరీజు వేసి కూటమికి జేపీ మద్దతు ప్రకటించారన్నారు. సంక్షేమ పథకాలకు బటన్ నొక్కటం తప్ప అభివృద్ధే లేకపోవటం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయన్నారు. సంక్షేమం మాత్రమే చాలదని, అభివృద్ధి కూడా కావాలని ఎన్డీయేకి ఓటు వేయటం ద్వారా ఏపీ ప్రజలు దేశ రాజకీయానికి చాటిచెప్పాలన్నారు.

# జేపీతో ఏపీ ఎన్నికల ఎక్స్‌క్లూజివ్

**ఏపీలో ప్రస్తుత 2024 ఎన్నికల్లో 15.44 లక్షల మంది మొదటిసారి ఓటర్లున్నారు. వీరిలో 3.6 లక్షల మంది 18-19 ఏళ్ల వయసువారు. చాలాచోట్ల కులం, వర్గం, ఫ్యాక్షన్ వంటి భావోద్రేకపూరిత వాతావరణం నెలకొని ఉంది. నాయకులు, పార్టీల పట్ల గుడ్డి ఆరాధనతోనో, ఇంట్లో వాళ్లు ఎప్పటి నుంచో వేస్తున్నారనే ఆనవాయితీతోనో, ఇతరుల ప్రభావంతోనో ఆలోచన లేకుండా ఓటు వేసే పరిస్థితి ఉంది. ఇలాంటి నేపథ్యంలో కొత్త ఓటర్లకి మీరిచ్చే సూచనలేమిటి?**

**జేపీ:** ప్రభుత్వం ఎందుకుందో ప్రతి ఓటరూ, ముఖ్యంగా యువత, ముందు అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం, పరిపాలన లక్ష్యం మొత్తం సమాజం అవసరాలను, డిమాండ్లను తీర్చటం. విద్య, వివాహం, కెరీర్ వంటివి వ్యక్తిగత అంశాలు. కానీ చట్టబద్ధపాలన, మౌలిక వసతులు, ఆరోగ్యం వంటివి అందరికీ సంబంధించిన అంశాలు. ఇవి వ్యక్తులు సొంతంగా చేసుకునేవి కావు. ఈ ఉమ్మడి అవసరాల్లో ప్రభుత్వ జోక్యం అవసరం. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, మనం పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బుతోనే ప్రభుత్వ వ్యవస్థ పనిచేస్తుందని ముందుగా యువత గుర్తించాలి. మొదటిసారి ఓటు వేస్తున్నవారు తాత్కాలిక తాయిలాల పథకాలు, ఇతరత్రా బయటి ప్రభావాలతో పక్కదోవ పట్టకుండా వివేచనతో కూడిన నిర్ణయం, హేతుబద్ధ చర్చ, ఆలోచనతో తమ హక్కును వినియోగించుకోవాలి.

**సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఓటర్లపై పెద్దఎత్తున ప్రభావం చూపుతున్నాయి. కొన్నిసార్లు చెడుగా, ప్రమాదకరంగా. ఇలాంటి పరిస్థితుల్లో తమ ఓటును సద్వినియోగం చేసుకునేలా తటస్థ ఓటర్లలో ఆలోచనాశక్తిని పెంచటమెలా?**

**జేపీ:**మీడియా నుంచి బాధ్యతాయుత ప్రవర్తనను ఆశించటం సహేతుకమేగానీ, రాజకీయ పారదర్శకత కోసం పూర్తిగా మీడియా మీదే ఆధారపడటం సరి కాదు. ప్రభుత్వం తాను నిర్వర్తించాల్సిన బాధ్యతల్ని, చేయాల్సిన పనుల్ని సక్రమంగా, సమర్థంగా చేస్తోందో లేదో నిఘా పెట్టాల్సిన బాధ్యత యువత సహా ప్రజల మీద ఉంది. ప్రతి నగరంలో, పట్టణం, గ్రామంలో ఈ రకమైన అప్రమత్తత ప్రజల్లో ఉండాలి. పాలనాంశాలపై అవగాహన పెంచుకుని, తమ జీవితాలు,



భవిష్యత్తుపై దీర్ఘకాలిక ప్రభావం చూపే సరైన విధానాలను ఎంపిక చేసుకోవాలి. తమకున్న స్వేచ్ఛను ఇందుకోసం సద్వినియోగం గావించుకోవాలి. సమాచారం రకరకాల మార్గాల నుంచి వస్తుంటుంది. వీటిల్లో ఏది నిజం, ఏది చట్టవ్యతిరేకం నిగ్గుతేల్చుకునే సామర్థ్యం, గ్రహింపు ఓటర్లకు ఉండాలి.

**లోక్‌సత్తా 2014 ఎన్నికల్లో పోటీచేసినా బీజేపీకి మద్దతిచ్చింది. కానీ ఈవేళ పరిస్థితి వేరు. 2024 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఎన్డీయే కూటమికి జేపీ మద్దతు ప్రకటిస్తే ప్రజలు ఎందుకు ఆలోచించాలి? అభివృద్ధి, సంక్షేమం కలసికట్టుగా సాగాలి, రెంటి మధ్యా సమతూకం ఉండాలి, ఈవేళ దేశానికి ఇది ఎంతో కీలకం అని మీరు చెబుతున్నారు. ఈ మంత్రాన్ని మీరు మద్దతిస్తున్న ఎన్డీయే కూటమి పాటించి తీరుతుందా? వారి తరపున ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మీరు భరోసా ఇస్తారా?**

**జేపీ:**మేం 2014లో ఎన్డీయేకి మద్దతివ్వటానికి గుజరాత్‌లో నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి, దేశానికి ఆయన ఇచ్చిన నినాదం, ఆ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మితిమీరిన సంక్షేమం పథకాల వైపు మొగ్గుచూపటం, ఓటర్లను ఆకర్షించటానికి ఇష్టారాజ్యం నిధుల దుర్వినియోగం

కారణాలు. 2024 ఎన్నికల సమ యానికి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయింపులు, ఆర్థిక క్రమశిక్షణ, నిధుల దుబారా కట్టడి, భారత్‌లో పెట్టుబడులు మొదలైనవి గణనీయ స్థాయిలో పెరిగాయి. మిగిలిన రాజకీయ పార్టీల్లో ఆ ఆలోచన కొరవడింది. ఈవేళ దేశానికి నిజంగా ఉన్న అవసరం, అవకాశాలేంటి అని విశ్లేషించి ఒక నిర్మాణాత్మక ఎజెండాను ప్రతిపక్షాలు మాట మాత్రం కూడా ప్రస్తావిం చటం లేదు.

బండి కదలటానికి రెండు చక్రాలు ఎంత అవసరమో దేశం ముందుకెళ్లటానికి కూడా సంక్షేమం, అభివృద్ధి రెండూ అవసరం. అవి పరస్పర ప్రోత్సాహకాలు. నిరంతర అభి వృద్ధికి చోదకశక్తులు. చక్రాల్లో ఒకటి కొద్దికాలంపాటైనా సరే సమతుల్యతను కోల్పోతే, బండి వేగం అస్తవ్యస్తమై ప్రగతి అగమ్యమవుతుంది. ఈ సూత్రం దేశానికి, రాష్ట్రాలకు సమా నంగా వర్తిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పెట్టు బడుల వాతావరణం దారుణంగా ఉంది. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఏపీకి గత ముఖ్యమంత్రిగా తన పదవీ కాలంలో చంద్రబాబు చేసిన పనుల్ని, ప్రయత్నాల్ని చూస్తే నమ్మకం కలిగిస్తున్నారు. అందువల్లే బీజేపీ – టీడీపీ – జన సేన కూటమికి ప్రస్తుతం రాష్ట్రంలో మద్దతు ప్రకటించాం. కూటమి అధికారంలోకి వస్తే, రాష్ట్రం లోని పోలవరం వంటి పెండింగ్ ప్రాజెక్టుల్ని వేగంగా, సమర్థంగా పూర్తి చేస్తుందని, అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా తీర్చిదిద్దుతుందని, వంద చిన్న పట్టణాలను గ్రామాల మధ్య స్వయంసమృద్ధ ఆర్థిక కేంద్రా లుగా అభివృద్ధి చేస్తుందని అంచనా వేస్తున్నాను. గత నాలుగేళ్ల పాలనను చూస్తే ప్రస్తుత ఏపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రగతిని ఏమాత్రం పట్టించుకునే ఉద్దేశం ఉన్నట్లు కని పించటం లేదు. అభివృద్ధి చేయకపోగా పెట్టుబడులకు ముందుకొచ్చినవాళ్లని వేధించటం, అప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై బురద జల్లటం వంటి చర్యలకు పాల్పడుతోంది.

**ప్రధాన పార్టీల అభ్యర్థులు దక్షిణాది రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.50-100 కోట్లు ఖర్చు పెడు తున్నారు. అధికారం డబ్బుకి, డబ్బు మళ్లీ అధికారానికి దారి తీస్తుంటే ఇదో విషవలయమని మీరో ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ వలయాన్ని ఛేదించటమెలా?**

జేపీ: యువతకు నా సలహా ఒక్కటే – ప్రజలకు సేవ చేయాలన్నదే రాజకీయ నాయకుల లక్ష్యం కావచ్చు, కానీ ఎన్నికల ప్రచారంలో అంతంత డబ్బు ఖర్చు చేయటం వెనక వారి నిజమైన ఉద్దేశమేంటో గుర్తించండి. గెలుపు కోసం వెంపర్లాట, తగ్గేదేలే అంటూ ఎన్నికల్లో కోట్లాది రూపాయల్ని ఖర్చు చేయటం వల్ల అన్యాయం, దోపిడీ అనివార్యమవుతాయి. అలాంటి పరిస్థితిలో అభివృద్ధికి,




సంక్షేమానికి సరైన భరోసా ఉండదు.

**తెలుగు రాష్ట్రాల్లో విద్యారంగం పరిస్థితి ఏమిటి?**

జేపీ: సామాజిక ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నా, ఏ కులం, తెగ, లేదా మతం వారైనా, ఒక కుటుంబం తలరాతను మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉంది. జాతీయ అచీవ్‌మెంట్ సర్వే ప్రకారం, పాసయ్యే విద్యార్థుల సంఖ్య 90 నుండి 96% ఉంటే, వారి తరగతి స్థాయి విద్యాప్రమాణాలు మాత్రం నాసిరకంగా ఉన్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో విద్యపై తెలంగాణ ప్రభుత్వం ఏడాదికి రూ.80,000 దాకా ఖర్చు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఖర్చు రూ.90,000 దాకా ఉంది. కానీ విద్యార్థుల చదువుల ప్రమాణాలు మాత్రం పరమ అధ్వాన్నంగా ఉన్నాయి. గతంతో పోలిస్తే, పాఠ శాలల్లో భవనాలు, టాయిలెట్లు, ఇతరత్రా మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడ్డాయనటంలో సందేహం లేదు. అదేవిధంగా, దక్షిణాది రాష్ట్రాల్లో స్కూళ్లలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతున్నా ఏటా జరుగుతున్న టీచర్ల ఎంపిక ప్రక్రియ వల్ల పిల్లల్లో నేర్చుకునే, ఆకళింపు చేసుకునే, సొంతంగా వ్యవహరించే సామర్థ్యాలేవీ పెరగటం లేదు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం.

**2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు రాష్ట్రానికే కాకుండా దేశానికి ఏ రకంగా నిర్ణయాత్మక ఎన్నికలు?**

జేపీ: ఆర్థికాభివృద్ధి, ప్రగతి ఇప్పుడు రాష్ట్రానికి, దేశానికి అత్యంత కీలకమైనవి. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం అభివృద్ధి రేటును 7-8% మేర పెంచాలి. ఇందుకోసం మౌలిక వసతులు, ఆర్థిక క్రమశిక్షణ, అభివృద్ధి, పెట్టుబడులకు ప్రోత్సాహం, ఆదాయాలు పెరగటం కోసం స్పష్టమైన ఎజెండాను అమలు చేయాలి. వచ్చే 25 ఏళ్లపాటు ఆర్థికంగా మనం ఎదగాలంటే, ఈ అవకాశాన్ని సద్వినియోగం గావించుకోవాలంటే మన దేశంలోకి ఎక్కువ డబ్బు రావాలి, దేశం నుంచి తక్కువ వెళ్లాలి. మనం ఆ సవాళ్లని తుపానుల్ని నిర్భయంగా ఎదుర్కొంటామా, అరకొర చర్యలతో రాజకీయ డ్రామాలనే కొనసాగిస్తామా? మీరు వేసే ఓటు మీ రాష్ట్రానికి, దేశానికి వెళ్తుంది తప్ప రాజకీయ పార్టీలకి కాదు! ★

# అప్పు చేసి సంక్షేమం వల్ల యువత ఉపాధికి గండి

రాష్ట్రాల రుణాలు పెరిగితే భవిష్యత్ తరాలపై భారం పడుతుందని, ఆ అప్పులు చెల్లించాల్సింది మన పిల్లలు, ఆ తర్వాతి తరాలేనని ప్రముఖ ఆర్థికవేత్త, 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' ఎడిటర్ ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్ హెచ్చరించారు. 'అభివృద్ధితో సంక్షేమం – సుపరిపాలనకు సవాళ్లు' అనే అంశంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'పథకాల అమలుకు అదనపు బడ్జెట్ కావాలి. గ్యారంటీలు సహా వివిధ రూపాల్లో రుణాలు తెచ్చుకోవాలి. దీంతో రాష్ట్ర అప్పులు పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.14 లక్షల కోట్లు ఉంటే ఆ రుణాలకు వడ్డీ రూపంలోనే అధికమొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా ఇతర కార్యక్రమాలు అమలు చేయలేరు. అభివృద్ధి అంటే ప్రజల జీవన ప్రమాణాలను పెంచటమే. పెట్టుబడి వ్యయంపై రూ.1 ఖర్చు పెడితే రూ.3 రాబడి వస్తుంది. రెవెన్యూ వ్యయంలో దీన్ని సాధించలేం. వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో జరిగిన జాతీయ రహదారుల నిర్మాణమే దీనికి ఉదాహరణ. సూరత్, శ్రీకాకుళం జిల్లాల్లో చేసిన అధ్య యనాల్లో జాతీయ రహదారుల పక్కన నిర్వహించే వ్యాపారాల్లో 100% వృద్ధి నమోదైనట్లు వెల్లడైంది. ఉద్యోగ కల్పనకు పెట్టుబడి వ్యయం ముఖ్యం. పేదరికం తొలగించాలంటే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పన అత్యవసరం.

**ఏపీలో 30% నిరుద్యోగిత**

దేశంలో 15–29 ఏళ్ల వయసున్నవారిలో 27% నిరుద్యోగులే. సెకండరీ విద్య, ఆపై చదివినవారిలో 18% నిరుద్యోగులున్నారు. పట్టభద్రులు, ఆపై చదివినవారిలో 28% మందికి ఉద్యోగాల్లేవు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 30% వరకు ఉంది. నిరుద్యోగుల్లో 83% మంది యువతే. వారికి నైపుణ్యం లేకపోవటమే దీనికి కారణం. ఫార్మల్ స్కిల్స్ కలిగినవారు భారతదేశంలో 4% మాత్రమే. ఈ సంఖ్య యూకేలో 50%, దక్షిణ కొరియాలో 96% గా ఉంది. దేశంలో 16% మందికి సరైన పోషకాలతో కూడిన ఆహారం అందటం లేదు. 35% మంది పిల్లల్లో పోషకాహారలోపం ఉంది. ఆంధ్రప్రదేశ్ కూడా ఈ జాబితాలో ఉంది. 35% మంది పిల్లలు పోషకాహారలోపంతో ఉంటే మన దేశం విశ్వగురు అవటం ఎలా సాధ్యమవుతుంది? అని మహేంద్రదేవ్ ప్రశ్నించారు.

'రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ.2 లక్షల రుణభారం ఉంది. భవిష్యత్తులో ఇది మరింత పెరిగి రూ.3 లక్షలు అవుతుంది. అంటే భవిష్యత్తులో మన పిల్లలకు అవసరమైన నిధుల్ని కూడా ఇప్పుడే తీసుకుంటున్నాం' అని సీఎఫ్‌డీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. 'నగదు బదిలీ (డీబీటీ) అనేది ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే అమలు కావటం లేదు. వంటగ్యాస్, పీఎం కిసాన్, ఎరువుల రాయితీ తదితర నగదు బదిలీ పథకాలెన్నింటినో యూనియన్ ప్రభుత్వం అమలు చేస్తోంది. అయినా మోదీకి ఓటేస్తేనే పథకాలు అమలు చేస్తామని వారు చెప్పటం లేదు' అన్నారు. నాయకుల మధ్య ఎన్నికలప్పుడు మాత్రమే పోటీతత్వం ఉండాలని.. గెలిచాక కక్షపూరిత ధోరణులు ప్రదర్శిం చకూడదని సీఎఫ్‌డీ ఉపాధ్యక్షుడు, మాజీ సీఎస్ ఎల్‌వీ సుబ్రమణ్యం పేర్కొన్నారు. సమాజానికి అభివృద్ధి, సంక్షేమం చాలా అవసరమని రాజనీతి శాస్త్ర నిపుణుడు చిన్నయసూరి అన్నారు. పథకాలంటూ ప్రభుత్వాధినేతలు పంపిణీ చేస్తున్నదంతా ప్రజల సొమ్మేనన్నారు. ★

## సంక్షేమం, అభివృద్ధి రెండూ అవసరమే

'నేను ముఖ్యమంత్రిని కాబట్టి చట్టాలు ఇష్టారాజ్యం చేస్తా, కేసులు పెట్టేస్తాం, జైలులో పెట్టేస్తాం అంటే కుదరదు, ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా పాలించాలి. ప్రభుత్వానికి ఉన్న బాధ్యతలు గుర్తెరగాలి' అని ఆర్థిక నిపుణుడు, ఏపీ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పి.వి రమేష్ అన్నారు. 'సంక్షేమం, అభివృద్ధి వేర్వేరు కాదు.. ఒక్కటే. రెండూ అవసరమే. డబ్బు పంచటం సులభం. అందుకు బటన్ నొక్కితే సరిపోతుంది. దానికి ఇంటర్నెట్ ఉంటే చాలు. అదొక్కటే పాలన కాదు. ప్రజలకు అవసరమైన సమగ్ర సేవలు అందించటమే ప్రభుత్వ పాలన.ఏ గణాంకాలు చూసినా రాష్ట్రం ముందుకెళ్తున్నట్లు అనిపించటం లేదు. రివర్స్ ఇంజిన్‌తో వేగంగా రాంగ్ రూట్‌లోవెళ్తున్నామేమోనన్న అనుమానం కలుగుతోంది. దానికి బాధ్యత రాజకీయ నాయకులు, ప్రభుత్వాన్ని పరిపాలించేవాళ్లదే. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులది కూడా. ఎన్నికలు అయిదేళ్లకు ఒకసారి వచ్చే పండుగ కాదు. 500 ఏళ్లకు అవసరమైన పునాది ఇప్పుడు పడుతుంది. ఇవి చాలా కీలకమైన ఎన్నికలు. త్వరలో నాలుగో పారిశ్రామిక విప్లవం రాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబో టిక్స్‌లతో ప్రపంచమే మారిపోబోతోంది. వాటిని అంది పుచ్చుకోగల నాయకత్వం కావాలి. ఆ నైపుణ్యాలు యువతకు నేర్పించగలగాలి. నాణ్యమైన విద్య, వైద్యం ప్రజలకు అందాలి. బోగస్ హామీల్ని నమ్మకుండా ప్రజాస్వామ్య హక్కుల్ని కాపాడే నాయకత్వాన్ని ఎన్నుకోవాలి' అని విజ్ఞప్తి చేశారు.

# మూడు రాష్ట్రాలు - ఓటరుకి పాఠాలు


-ఏ. అన్నపూర్ణ

తెలంగాణకి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డికి ఇప్పుడు అభినందనలు చెబితే ఎబ్బెట్టుగా ఉంటుందిగానీ, ఆయన ప్రమాణస్వీకారం నుంచి వాయిదా వేసిన కొన్ని మాటలు చెప్పి విషయంలోకి వెళ్దాం. కాలేజీ రాజకీయాలలో ప్రవేశించిన నాటి నుంచి చురుగ్గా వ్యవహరించే రేవంత్ వాగ్ధాటి మనలో చాలామందికి తెలుసు. మాటల్లో స్పష్టత, చెప్పే విషయంలో పరిజ్ఞానం, సమస్యల పట్ల అవగాహన, ప్రజలకు చేరువ కాగల ప్రజ్ఞ అతడి స్వంతం. అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన నాయకుడు. కష్టపడే తత్వం ఈరోజు అతడిని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టింది. కాంగ్రెస్ పార్టీ అతడిని తెలంగాణకి అధ్యక్షుడిని చేసిన రోజు ప్రజల వద్దకు వెళ్లి తన లక్ష్యాన్ని స్పష్టంగా చెప్పి పార్టీ పట్ల విశ్వాసం పెంచేరీతిలో ప్రచారం చేశారు. తమ రాజకీయ అవసరం కోసమైనా స్థానిక నాయకత్వాన్ని గుర్తించినందుకు, రేవంత్ పనిచేసే విధానం అందరినీ కలుపుకుపోయిన తత్వం గ్రహించి ప్రోత్సహించినందుకు రాహుల్‌ని కూడా ఇక్కడ అభినందించాలి.

పదవీ బాధ్యతలు చేపట్టాక రేవంత్ ప్రకటించిన అంశాలు కొన్ని ఆమోదకరంగా ఉన్నాయి. కాంగ్రెస్‌లో తోటివారే ఏడాదిలో గొడవలు పెట్టి దింపేస్తారని, కేసీఆర్ ముందు నిలబడలేడని, పరిపాలన అంత సులువు కాదని కొందరు మాట్లాడినా, ఏమాత్రం చిత్తశుద్ధితో కృషి చేసినా ప్రజలు సానుకూలంగా స్పందిస్తారని, పొరపాట్లను దిద్దుకునేందుకు సమయం ఇస్తారని మరోమారు రుజువైంది.

అదేవిధంగా, ముఖ్యమంత్రి అయిన వెంటనే తీసుకున్న కొన్ని నిర్ణయాల విషయంలో రేవంత్ తొందరపాటు లేకుండా వ్యవహరించాలి. ఉదాహరణకు, 33 జిల్లాల ఏర్పాటును తిరగదోడటం. కేసీఆర్ ఇష్టం వచ్చినట్లు కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారనే ఆరోపణలున్నాయి. వీటితోపాటు కొన్ని రెవెన్యూ డివిజన్లు, మండలాలను పునర్విభజిస్తామని, ఇందుకోసం కమిషన్ వేస్తామని రేవంత్ ప్రకటించారు. ఏవో కొన్ని చిన్న చిన్న లోపాలు తప్ప మొత్తమ్మీద జిల్లాల ఏర్పాటు ప్రక్రియ హేతుబద్ధంగానే ఉందని, తిరగదోడటం సరికాదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి ముఖ్యమంత్రి ఈ నిర్ణయంపై పునస్సమీక్షించుకోవాలి.

అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా సముచితంగా కనిపించటం లేదు. కిక్కిరిసిన బస్సుల్లో వృద్ధులేగాదు, అన్ని వర్గాలవారూ చాలా ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలకు మరిన్ని బస్సులు వేసి ఉంటే బాగుండేది. ప్రయోజనమా, నష్టమా బేరీజు వేసుకుని హామీని



హేతుబద్ధీకరించేందుకు ఇంకా ఎక్కువ సమయం ఆగాల్సిన పనిలేదేమో!

అదేవిధంగా, లోక్‌సభ ఎన్నికల సమయం రాగానే అసెంబ్లీ పోల్స్ సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన తాత్కాలిక పథకాల గురించి ముఖ్యమంత్రి ఎక్కువగా మాట్లాడుతున్నారు. పంద్రాగస్టులోగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఓ ఎన్నికల సభలో ప్రకటించారు. ఎండాకాలం, ఎన్నికల కాలంలో అతి ధోరణుల్ని కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. కానీ ఎన్నికలయ్యాక పరిస్థితి ఆలోచించండి. వాటి అమలు సాధ్యమా? కాబట్టి జేపీ సూచించినట్లు, హామీలపై ఆర్థిక నిపుణుల కమిటీ వేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఆచరణసాధ్యమైనవి అమలుచేయటం మంచిది. భయపడకుండా మాట్లాడే వ్యక్తిగా రేవంత్‌కి పేరుంది. నేను జానారెడ్డిని కాదు, రేవంత్‌రెడ్డిని అని ఆయనే బహిరంగంగా ప్రకటించారు. పైగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేశారు. కాబట్టి ఆర్థిక పరిమితుల్ని వివరిస్తూ ఏయే హామీల్ని ఎంతమేర అమలు చేయగలరో ప్రజల ముందు రేవంత్ నిర్దిష్టంగా ప్రకటించటం అవసరం. ఎన్నికలయ్యాక ఈ దిశగా చర్యలు తీసుకుంటారని, పార్టీలో, బయట కేంద్రీకృత పోకడలు లేకుండా సమష్టి తత్వంతో వ్యవహరిస్తూ రాబోయే రోజుల్లో అతడు ముఖ్యమంత్రిగా తెలంగాణకు మంచి చేస్తారని ఆశిద్దాం.

ఇక ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురించి.

అవినీతికి వ్యతిరేకంగా ఆమ్‌ఆద్మీ పేరుతో పార్టీని పెట్టిన కేజ్రీవాల్ మీద ఎన్నో అంచనాలు, ఆశలు నీరుగారిపోవడం విషాదకరం. ఢిల్లీలో పాఠశాలలను బాగుచేసి అభివృద్ధి చేయడం, ప్రజల వద్దకు వైద్యం పేరుతో మొహల్లా క్లినిక్స్ అందుబాటులోకి తేవడం మంచిపనిగా చెప్పుకున్నాం. కానీ ఇటీవల విస్తుపోయే స్కాములు బయటపడ్డాయి. కేసీఆర్ కుమార్తె కవితతో కుమ్మక్కయి లిక్కర్ స్కామ్‌కు పాల్పడ్డారంటూ కేజ్రీవాల్‌పై పెద్దఎత్తున ఆరోపణలొచ్చాయి. కవిత అరెస్టయ్యాక, కేజ్రీవాల్ కూడా జైలుకెళ్లారు. పదవిలో ఉన్న ముఖ్యమంత్రి జైలుకెళ్లటం దేశ చరిత్రలో మొదటిసారి. ఎన్నికల సమయంలో ఈ అరెస్టు కరెక్టేనా, ఇందులో రాజకీయ జోక్యం ఉందా అనే అంశాల గురించి మన దేశంలో చట్టబద్ధపాలన ఉన్న పరిస్థితుల్లో, ఈ పరిస్థితిని మారుస్తామని ఆప్ సహా ఏ ప్రతిపక్షపార్టీ కూడా ప్రకటించని వాతావరణంలో మరీ ఎక్కువ మల్లగుల్లాలు పడటం అనవసరం. ఈ కేసులో నిజానిజాలు త్వరగా బయటపడాలని కోరుకుందాం. మద్యం కుంభకోణంలో తీసుకున్న ముడుపుల్ని గోవా ఎన్నికల్లో కేజ్రీవాల్ ఉపయోగించారని ఈడీ చెబుతోంది. మన ప్రజాస్వామ్యంలోని అసలు లోపాల్ని గుర్తించకుండా, వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయకుండా ఉన్న వ్యవస్థలోనే కొనసాగుదామనుకుంటే, కొంతకాలమయ్యాక ఎవరికైనా ఇదే పరిస్థితి వస్తుందేమో!

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా.జేపీ ఆనాడే స్పష్టంగా చెప్పారు, అన్నా హజారే ఉద్యమం తీరు సరిఅయినది కాదు అని! హజారేతో కలసి పనిచేస్తూ పార్టీ రాజకీయాల్లో చేరబోనంటూ ఆ ఉద్యమ సమయంలో ప్రజలను మభ్యపెట్టి, ఆ తర్వాత ఉద్యమ నేపథ్యాన్ని రాజకీయ పార్టీ ఏర్పాటుకు ఉపయోగించుకుని పదవికి బాటలు వేసుకున్న కేజ్రీవాల్‌కి ఏమైనా భావజాలం ఉందా, మన దేశ రాజకీయ పరిస్థితులకి అది పరిష్కారమవుతుందా, అధికాదాయం కలిగిన, నగర రాజ్యం లాంటి రాష్ట్రం కాబట్టి ఢిల్లీకి, చుట్టుపక్కల ప్రాంతాలకు మాత్రమే ఆప్ పరిమితమవుతుందా, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల మధ్య సమన్వయంతో దేశం మొత్తంలో మార్పుకి ఆప్‌ను చోదకశక్తిగా ఎలా వినియోగించుకోవచ్చు మొదలైన ప్రశ్నలను చర్చించకుండా కొందరు కేజ్రీవాల్ రాజకీయాన్ని గుడ్డిగా నమ్మారు. ఈరోజు పరిస్థితి ఇదీ.

ఇక కొన్ని రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. నేను పుట్టి పెరిగిన "అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్" ఇప్పుడు అనాథగా కనిపిస్తోంది. కొన్ని కారణాలుగా నేను ఆంధ్రకు వెళ్లి చాలాకాలమైంది. కానీ అక్కడ ఉండే బంధువులు, స్నేహితులు సంగతులు చెబుతుంటే చాలా ఆవేదన కలుగుతోంది. పచ్చని చేలు, అరటి, కొబ్బరి, మామిడి తోటలు, ఎన్నో రకాల కూరగాయలు, ఫల వృక్షాలతో సుందరంగా వుండే తీరప్రాంత రాష్ట్రం ఏపీ. కృష్ణా, గోదావరి నదులు సస్యశ్యామలం చేశాయి. ఇప్పుడు రాజధాని లేదు. రోడ్లు లేవు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, మెట్టభూములకు నీరందించే సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు, పరిపాలనా లోపాలు చాలా ఉన్నాయి.... అని చెప్పేరు. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో విద్వేషాలు, కుల, వర్గ నినాదాలు, ఉన్మాద ప్రవర్తనలు చూస్తుంటే బాధేస్తోంది.

హైదరాబాద్‌లో చాకలి వృత్తిలో, అపార్ట్‌మెంట్ వాచ్‌మన్లు, ఇంటిపని, కూలీ వంటి పనుల్లో ఎందరో ఆంధ్రా ప్రజలు ఉన్నారు. వీరిలో కొందరు చట్టానికి వ్యతిరేకంగా తెలంగాణ, ఆంధ్ర రెండు చోట్లా ఓటు వేయడం, ఉచితాలను తీసుకోవడం చేస్తున్నారు (ఎన్నికల కమిషన్లకి ఈ విషయం తెలియదా, లేదా తెలిసీ ఊరుకున్నారా నాకు తెలియదు కానీ, ఆంధ్రా వెడుతున్నవాళ్లే ఈ విషయం మాకు చెప్పేరు). అంతేకాదు తక్కువ పెన్షన్ తీసుకునేవారు కక్కుర్తిపడి భార్య పేరున కుటీర పరిశ్రమ కోసం ఇచ్చే నెలకు 15 వేల రూపాయలు తీసుకోవడం జరుగుతోంది. అంటే ఎంత డబ్బు దుర్వినియోగం అవుతోందో చూడండి. భార్య, భర్త రిటైరైతే వారికి ఇంటద్దె లేదు. నెలకు 30 వేలు పింఛన్ చాలదా? ఫ్రీగా వస్తోంది అంటే, అది మన పన్నుల డబ్బు, ఆ డబ్బును భవిష్యత్తు కోసం పెట్టుబడిగా ఉపయోగించకపోతే మన పిల్లలే నష్టపోతారు అన్న ఇంగితజ్ఞానం లేకుండా ఎగబడుతున్నారు. వారిని ఈ స్థితికి తెచ్చింది ప్రభుత్వమే కదా!

పార్టీల హామీలు నమ్మటానికి, ప్రభుత్వాల నుంచి తీసుకోడానికి సిగ్గు లేదా అని అడగొద్దు. ఇచ్చేవారుంటే.. పుచ్చుకునేవారు ఉంటారు అన్నీ వదిలేసి. ఇంతకు ముందు పేదలు మాత్రమే తీసుకునేవారు, ఇప్పుడు తీసుకునేవారు అన్ని వర్గాలవారూ.

కాస్త అటూఇటుగా ఒకే తరహా దుష్పరిపాలన, నల్లడబ్బు రాజకీయం రెండు తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్నప్పటికీ ఏపీ పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. కుల రాజకీయాలు, విద్వేష రాజకీయాలు ఏపీ అభివృద్ధికి శాపంగా మారాయి.

ప్రజలు కూడా మారాలి. ఇప్పటికి మా కడుపు నిండితే చాలు అనే ధోరణి మానుకోవాలి. బిడ్డల భవిత గురించి ఆలోచించాలి.

ఈ అంశంపై డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే చాలా స్పష్టతనిచ్చారు.

"ఈవేళ దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ రాజకీయ పోరాటం దేవతలు, రాక్షసుల మధ్య కాదు. అందరూ అధికార కేంద్రీకరణ చేస్తున్నారు, అందరూ డబ్బులు పంచి పెడుతున్నారు. ఈ పార్టీ, ఆ పార్టీ తేడా లేదు. అందరివల్లా పొరపాట్లు జరుగుతున్నాయి. కానీ ఒకే ఒక్క మౌలికమైన తేడా. ఆర్థిక భవిష్యత్తు.

మిగతావన్నీ కాలక్రమేణా మారేందుకు సిద్ధపడ్డా కూడా, ఆర్థిక భవిష్యత్తును కాపాడేటువంటి రాజకీయ శక్తులేమిటి? పొదుపరితనాన్ని పాటించి ప్రజలకు అత్యంత మేలు చేసేవాళ్లెవరు? మన కాళ్ల మీద మనల్ని నిలబెట్టేవాళ్లెవరు? పెట్టుబడులు పెంచే వాళ్లెవరు? పారిశ్రామికీకరణ జరపబోయే వాళ్లెవరు? ఆ రకంగా చూస్తే ఇవాళున్న పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీ మోదీ నాయకత్వంలో, ఎన్‌డీయే కూటమి భాగస్వాములు, అలాగే చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ, అలాగే జనసేన పవన్ కళ్యాణ్ నాయకత్వంలో. ఈ మూడు పార్టీలూ కూడా ఒకపక్కన సంక్షేమం అందరు సామాన్యులకి అందించటం, దాంతో తృప్తి పడకుండా దీర్ఘకాల భవిష్యత్తుని కాపాడాలి, ఆర్థికాభివృద్ధిని పెంచాలి, పెట్టుబడులు పెంచాలి, మౌలిక సదుపాయాలు కావాలి, కొంతైనా చట్టబద్ధపాలన తీసుకురావాలి. పూర్తిగా బడితె ఉన్నవాడిదే బర్రె, సింహాసనం మీద కూర్చున్నవాడు ఏం చేసినా చెల్లు తుంది అన్న పద్ధతి పోవాలి అన్నదానికి కట్టుబడి ఉన్నాయి. వారి ఆలోచనను ఆహ్వానిస్తున్నాం, వారికి మద్దతు ప్రక టిస్తున్నాం. ఈ కారణాలుగా రాష్ట్రంలో అందరినీ ఆలోచించి ఎన్‌డీయే కూటమికి మద్దతివ్వాల్సిందిగా కోరుతున్నాం.

దయచేసి తెలుగు ప్రజలంతా మనసు పెట్టి ఆలోచించండి, మీ కుటుంబాలు, మన పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించండి. మన కులము, మన వర్గము, మన ఊళ్లో ఉన్న ఫ్యాక్షన్ దీని చుట్టూ మన ఆలోచనలు తిరిగితే, సంకుచితమైపోతే సమాజం అల్లకల్లోలమైపోతుంది, నష్టపోయేది పేదలు. అత్యధికంగా డబ్బున్నవాడు ఎట్లాగొట్లా తట్టుకుంటాడు, పెట్టుబడులు రాకపోయినా ఇంకో రాష్ట్రానికి పోతాడు, అవకాశాలు లేకపోయినా పిల్లల్ని ఇంకో దేశానికి పంపించుకుంటాడు. నష్టపోయేది చివరకు పేదలు. ఏ పేదల పేర్లు చెప్తున్నామో, ఆ పేదల పొట్ట కొడుతున్నాం, ఆ పేదల పిల్లలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నాం. అందుకనే మళ్లీ ఇంకొక్కసారి, సమాజంలో పుట్టుకతో అసమానతలకి గురైన వర్గాలు, కేవలం ఫలానా కుటుంబంలో పుట్టిన పాపానికి అవకాశాలు లేక అలమటిస్తున్న యువతను నేను కోరుతున్నాను. ఒక్కసారి కళ్లు మూసుకుని ఆలోచించండి. యధాస్థితి కొనసాగినట్లయితే నా జీవితం పదేళ్ల తర్వాత

**అత్యధికంగా డబ్బున్నవాడు ఎట్లాగొట్లా తట్టు కుంటాడు, పెట్టుబడులు రాకపోయినా ఇంకో రాష్ట్రానికి పోతాడు, అవకాశాలు లేకపోయినా పిల్లల్ని ఇంకో దేశానికి పంపించుకుంటాడు. నష్ట పోయేది చివరకు పేదలు. ఏ పేదల పేర్లు చెప్తున్నామో, ఆ పేదల పొట్ట కొడుతున్నాం, ఆ పేదల పిల్లలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నాం.**

ఎట్టా ఉంటుంది, ఆలోచించుకోండి. ఇరవయ్యేళ్ల తర్వాత ఎట్లా ఉంటుంది మీరే ఆలోచించుకోండి. ఇదే కావాల్నా? కాదు అన్నట్లయితే ఏం కావాలి? ఫలానాది కావాలి అంటే, దానికి ఉన్నంతలో ఉన్నటువంటి, ఇవాళ రాజకీయ శక్తుల్లో ఏ పద్ధతి అయితే మీకు సరిగ్గా ఉంటుంది? అద్భుతమేమీ లేదు. ఇది దేవతలు, రాక్షసుల మధ్య పోరాటమేమీ కాదు. నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను, కానీ ఉన్నంతలో. ఎందుకంటే ఈ మనుషులే గదా, మనుషులు ఎక్కడి నుంచో రావటం లేదు గదా, పోటీ చేసేవాళ్లు వాళ్లే, రాజకీయంలో పాల్గొనేవాళ్లు వీళ్లే, గ్రామాల్లో నాయకత్వం ఇచ్చేవాళ్లూ వీళ్లే, కాబట్టి అక్కడ పెద్ద అద్భు తమైన మార్పు వస్తుందనుకోవద్దు. కానీ ఏ పంథా చూపెడు తున్నాం? ఈ దారా? ఆ దారా? దాన్ని బట్టి భవి ష్యత్తు నిర్ణయమవుతుంది. ఆ నిర్ణయానికి కీలక ఘట్టం ఇది.

మీ గురించి, మీ కుటుంబాన్ని గురించి ఆలోచించండి. మీ కులం మీకు కూడు పెట్టదు. మీ కుటుంబం కావాలి, మీ పిల్లల భవిష్యత్తు కావాలి. మీ ఆదాయాలు కావాలి, మీకు అవకాశాలు కావాలి. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నవి నిర్ణయాత్మక ఎన్నికలు. వచ్చే పాతికేళ్లపాటు దేశం ముందున్న ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని అందుకునేలా ఓటు వేయండి" అని ప్రజలకు జేపీ విజ్ఞప్తి చేశారు.

కాబట్టి, తాత్కాలిక ఆకర్షణలకు లోను కావొద్దు. మిగతా విషయాల సంగతి ఎలా ఉన్నా, సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సమతూకం పాటించేవారికి, భవిష్యత్తును పరి రక్షించే వారికి పట్టం కట్టాలి. ఇప్పుడు ఆయుధం మీ చేతుల్లోనే ఉంది. తేల్చుకోవలసింది ఆంధ్రా ప్రజలే. ప్రలోభాలకు లోబ డక ఆలోచించి ఓటు వేయండి. రాజకీయం ఎలా ఉందో, పాలన ఎలా సాగుతోందో రోజూ చూస్తున్నారు. కోపంతోనో, నిరాశతోనో కాకుండా నింపాదిగా ఆలోచించి ఓటు హక్కు వినియోగించుకోండి. ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని వదులు కోవద్దు. భవిష్యత్తు పరిరక్షణ బాధ్యతను విస్మరించవద్దు, ఆల్ ది బెస్ట్!

# నీళ్లు, నీళ్లు, ఎటుచూసినా నీళ్లు!

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**



మన కార్మికులందరికీ మంచి ఆదాయాలున్న ఉపాధిని అందించటం భారతదేశం ఎదుర్కొంటున్న పెనుసవాలు. దేశంలో పనిచేసేవారి సంఖ్య ఈవేళ 52.4 కోట్లు. చైనా తర్వాతి స్థానం మనదే. చైనా జనాభా వయసు మీరుతోంది కాబట్టి, రాబోయే రోజుల్లో ప్రపంచంలో అతి ఎక్కువ మంది కార్మికులు మన దేశంలోనే ఉంటారు. జనాభాలో పనిచేసేవారి వాటా ఎంత ఎక్కువ ఉంటే, దేశానికి ఆర్థికాభివృద్ధి సామర్థ్యం అంత ఎక్కువ ఉంటుంది. ఎంత ఎక్కువ మంది పనిచేస్తుంటే దేశ ప్రజల అవసరాలకు, విదేశీ ఎగుమతులకు అంత ఎక్కువ సరకుల్ని, సేవల్ని ఉత్పత్తి చేస్తారు. కార్మికులు డబ్బు సంపాదిస్తున్నకొద్దీ, వస్తువులు, సేవలకు మరింత డిమాండ్ సృష్టిస్తారు. పెట్టుబడులు, ఉద్యోగాలు, ఉత్పత్తికి ప్రోత్సాహకమవుతారు. ఇదంతా ఓ వలయంలా నిరంతర సానుకూల అభివృద్ధికి దారితీస్తుంది. అందుకే పనిచేసే జనాభా ఎక్కువమంది ఉండటాన్ని 'డెమోగ్రాఫిక్ డివిడెండ్'గా ఆర్థికవేత్తలు పేర్కొంటారు.


జనాభాపరంగా అందివచ్చిన ఆర్థిక అవకాశం నుండి లాభం పొందటానికి మూడు మౌలిక షరతుల్ని నెరవేర్చాలి. మొదటిది, కార్మికులకు ఉత్పాదకతను పెంచుకునే నైపుణ్యాలు ఉండాలి; రెండోది, సురక్షిత వాతావరణం కల్పించటానికి, వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం తన పని సవ్యంగా చేయాలి, చట్టబద్ధపాలన అందించాలి.

ఆధునిక ఆర్థిక వ్యవస్థకు తగిన పటిష్ఠ మౌలిక వసతుల్ని నిర్మించాలి. ఉత్పాదకతను పెంచేందుకు ప్రజలందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని, నైపుణ్యాల్ని మెరుగు పరచేందుకు నాణ్యమైన విద్యను అందించాలి. మూడోది, పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి, ఆర్థికాభివృద్ధికి సానుకూల వాతావరణాన్ని ఏర్పరచాలి. ఇందుకోసం ఆర్థిక స్వేచ్ఛను, అర్థవంతమైన, సులభంగా అమలు చేయగల నియంత్రణ, పన్నులు, ఇతర ప్రోత్సాహకాలు, వాణిజ్య విధానాలను అమలు చేయాలి. దశాబ్దాల తరబడి ప్రభుత్వాల వైఫల్యం వల్ల, ప్రజలకు ఆదాయాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చే ఉపాధి అవకాశాల్ని మనం సృష్టించలేకపోయాం. ఈవేళ కూడా 80% కి పైగా కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారు. వారికి నెలవారీ జీతాలుండవు, ఉత్పాదకత తక్కువ, జీవన భద్రత అంతంత మాత్రం. అభివృద్ధి, ఉపాధి కల్పన మన మంత్రాలు కావాలి. మన విద్య పెరుగుతున్న ఆధునిక ఆర్థిక వ్యవస్థకు సరిపోదు.

మన పిల్లల్లో చాలామంది పైతరగతులకు వెళ్లకుండానే స్కూలు చదువులు ఆపేస్తుంటారు. పాఠశాల చదువు పూర్తి చేసి, ఆ తర్వాత కాలేజీకి వెళ్లిన పిల్లల్లో కూడా పనికొచ్చే నైపుణ్యాలు కొరవడుతున్నాయి. మనం ఒక విచిత్రమైన వైరుధ్యంలో ఉన్నాం. యువతలో చాలామంది మంచి ఆదాయం వచ్చే ఉపాధి దొరకాలని ఆరాటపడుతుండగా, పలు సంస్థలు తమకు సరైన నైపుణ్యమున్న యువత దొరకటం లేదని గగ్గోలు పెడుతున్నాయి. కోలెరిడ్జి పద్యం గుర్తొస్తోంది. Ancient Mariner లో ఆయన ఇలా ఆక్రోశించారు: "నీళ్లు, నీళ్లు, ఎటుచూసినా నీళ్లు. తాగటానికి మాత్రం ఒక్క చుక్క లేదు". మనం ఉపయోగించుకోలేని డెమోగ్రాఫిక్ డివిడెండ్‌కి ఈ వాక్యాలు అతికినట్లు వర్తిస్తాయి. అరకొర నైపుణ్యాలు, విద్య కారణంగా మన కార్మికుల సగటు ఉత్పత్తి తక్కువగా ఉంటోంది, ఈ తక్కువ ఉత్పాదకత మన అభివృద్ధికి అవరోధంగా మారుతోంది, ఆదాయాల్ని పరిమితం చేస్తోంది. తక్కువ వృద్ధి తక్కువ ఉద్యోగాలను మాత్రమే సృష్టించగలదు. తక్కువ ఆదాయాలు తక్కువ డిమాండ్‌కు మాత్రమే ఉద్దీపన కాగలవు. క్రమంగా మనం పేదరికాన్ని నిరంతరం కొనసాగించే విషవలయంలోకి జారిపోతాం.

భారత్‌లో ప్రభుత్వాలు తమ బాధ్యత సవ్యంగా నిర్వర్తించటం

లేదు. అందువల్లే అభివృద్ధి కుంటుపడుతోంది. మంచి ఉద్యోగాల సృష్టి పెద్దసంఖ్యలో జరగటం లేదు. ఇటీవల కొన్నేళ్లుగా మౌలిక వసతులు మెరగవుతున్నాయి. మూలధన వ్యయంలో యూనియన్ ప్రభుత్వం రికార్డు స్థాయి పెట్టుబడి పెడుతోంది. 2023–24లో జాతీయ స్థాయి మౌలిక వసతులకు బడ్జెట్ ద్వారా ప్రత్యక్షంగా 10 ట్రిలియన్ రూపాయలు కేటాయించారు. ఆస్తులు సృష్టికి రాష్ట్రాలకు రూ. 3.70 ట్రిలియన్లు మూలధన రుణంగా మంజూరు చేశారు. కానీ చాలా రాష్ట్రాల్లో జీతాలు, పెన్షన్లు, వడ్డీల వంటి తప్పనిసరి ఖర్చులు, పోటాపోటీగా విస్తరిస్తున్న వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాలతో వ్యయం అదుపు తప్పుతోంది. దీంతో, మౌలిక వసతుల మీద పెట్టుబడికి అవసరమైన డబ్బు ఉండటం లేదు.




కొత్త పెట్టుబడులను ప్రోత్సహించటానికి యూనియన్ ప్రభుత్వం, కొన్ని క్రియాశీల రాష్ట్రాలు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. పరిపాలన చాలావరకు రాష్ట్రాల్లో ఉంటుంది. రాష్ట్రాలు మెరుగ్గా పనిచేసిన చోటల్లా పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి, ఉద్యోగాలను సృష్టిస్తు న్నాయి, వృద్ధిని వేగవంతం చేస్తున్నాయి. కానీ మితిమీరిన నియంత్రణ, అసంబద్ధ విధానాలు, విశృంఖల అవినీతి పెట్టుబడులను, అభివృద్ధిని కుంగదీస్తాయి.

మన కార్మిక చట్టాలు, విధానాలు కార్మికులకు రక్షణ ముసుగులో ఉపాధి కల్పనను నీరుగార్చాయి. మన నియంత్రణల్లో చాలామేర సమాజాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించటానికి బదులు, లంచాలు గుంజటానికి, వ్యాపారాలను వేధించటానికి వనరుగా మారాయి. కాలం చెల్లిన విధానాలు, ప్రభుత్వ నియంత్రణ, గుత్తాధిపత్యం రాజ్యమేలిన గతకాలపు వారసత్వంగా మోస్తున్న ఆలోచనా విధానం మనకు అవరోధాలవుతున్నాయి.

నిజమైన పోటీని, వినియోగదారుల ఎంపిక స్వేచ్ఛని, అభివృద్ధిని అణగదొక్కుతున్నాయి. యువతకు ప్రభుత్వం ఉద్యోగాల నిస్తుందనే భ్రమను రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వం చేయాల్సిన నిజమైన పని, వ్యక్తులు చేయలేని సమాజం ఉమ్మడి అవసరాలను తీర్చటం. ఉమ్మడి వస్తువులు, సేవలను అందించటానికి ప్రజల తీర్పు ద్వారా ప్రభుత్వాలు ఎన్నికవుతాయి. ఆ బాధ్యతను నెరవేర్చటం మేరకు ప్రభుత్వం ఉద్యోగులను నియమించుకోవటం అవసరం. అంతవరకు మాత్రమే. మన పన్ను–జీడీపీ నిష్పత్తి 18%కి కాస్త ఎక్కువ కాగా, మన ప్రభుత్వాలు సుమారు 3.2% ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ప్రభు త్వాలు మరింత మెరుగ్గా శిక్షణనివ్వాలి, ఎక్కువమందిని నియమించుకోవాలి, చట్టబద్ధపాలన, ఆరోగ్య సంరక్షణ వంటి సేవలను మరింత సమర్థంగా ప్రజలకు అందించాలి. విద్యలో, బడి ఈడు పిల్లల సంఖ్య తగ్గుతోంది. అత్యధిక రాష్ట్రాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా ఇంకా ఎక్కువ మంది ఉపాధ్యాయులను నియమించుకోవటం మూర్ఖత్వ మవుతుంది.

దానికి బదులు, విద్యార్థుల అవగాహన, నైపుణ్యాలు పెరగటం మీద మనం దృష్టి సారించాలి. మనకు ప్రభుత్వంలో చాలామంది గుమాస్తాలు, బంట్రో తులు, డ్రైవర్లు ఉన్నారు; వాళ్లలో అత్యధికులు పన్నుల డబ్బు నుంచి తీసుకుంటున్న జీతాలకు తగ్గ సేవలు అందించటం లేదు. వాళ్ల బాస్‌ల అవసరాలు, జీవనశైలి కోసం మాత్రమే ఉపయోగపడుతున్నారు. మనం ప్రభుత్వాన్ని పునర్నిర్మించాలి తప్ప గుడ్డిగా విస్తరించి దివాలా తీయించకూడదు.

ఒక దేశంగా మన శక్తిసామర్థ్యాలు మొత్తాన్నీ అభివృద్ధిని పెంచటం, నిజమైన ఉద్యోగాలను సృష్టించటం మీద కేంద్రీకరించాలి. విద్య, నైపుణ్యాలు, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, ఆరోగ్యం, ఆర్థిక ప్రగతి, ఉపాధిని సృష్టించటం మన లక్ష్యాలు కావాలి. అప్పుడు మాత్రమే పనిచేసే జనాభాపరంగా మనకున్న ఆర్థిక సానుకూలత పేదరికాన్ని అంతం చేయటానికి, అభివృద్ధిని పెంచటానికి తోడ్పడుతుంది. లేకుంటే, అక్కడక్కడా అభివృద్ధి వెలుగులు తప్ప, దేశం నిరంతర పేదరికం చీకట్లో చిక్కుకుపోయే ప్రమాదం ఉంది.

★★

# ఎన్నికలను మించి - భారతదేశ ఆర్థిక స్థిరత్వం

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



మన భారతీయులకు రాజకీయాలు, ఎన్నికలంటే ఎంతో ఇష్టం. ఎన్నికల్లో మన దేశంలో కనిపించేంత కోలాహలం, పండుగ వాతావరణం, ఉత్సాహం, ఆరాటం, వేడి బహుశా ప్రజాస్వామ్య ప్రపంచంలో మరెక్కడా కనిపించవేమో. ఇంతటి ధ్వని, వేడి మధ్య, సుప్రీంకోర్టులో ఒక పిటిషన్‌పై వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల్లో జరుగుతున్న చర్చ కంటే ఎంతో ప్రాధాన్యత గల అంశమది. రాష్ట్రాల రుణ పరిమితి నిబంధనపై ఆర్టికల్ 131 కింద కేరళ రాష్ట్రం భారత యూనియన్‌పై ఆ వ్యాజ్యం వేసింది. రాష్ట్రం తెచ్చుకునే నికర రుణాలపై జాతీయ స్థాయి ప్రభుత్వం పరిమితి విధించి చర్యలు తీసుకుంటోందని, ఇది ఆర్టికల్ 293 ప్రకారం యూనియన్ అధికారాల్ని ఉల్లంఘించటమేనని కేరళ వాదన. ద్రవ్య నిబంధనలను ఉల్లంఘించి రాష్ట్రం అప్పులు తెచ్చుకునేందుకు యూనియన్ విధిగా అనుమతిచ్చేలా కోర్టు ఆదేశం ఇవ్వాలని రాష్ట్రం కోరింది. పిటిషన్‌పై సుప్రీంకోర్టు విజ్ఞతతో స్పందించింది. రాష్ట్ర అభ్యర్థనను తోసిపుచ్చుతూ ఏప్రిల్ 1న ఆదేశం ఇచ్చింది. ఈ కేసులో రాజ్యాంగపరంగా ఉత్పన్నమయ్యే కీలక ప్రశ్నలను న్యాయమూర్తులు సూర్యకాంత్, కె.వి విశ్వనాథన్‌ల బెంచ్ అయిదుగురు జడ్జీల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది.

జాతీయస్థాయిలో ఏ కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పరిచినా, ద్రవ్య వ్యవస్థ ఆరోగ్యానికి, ఆర్థిక స్థిరత్వానికి, భారతదేశ పరపతికి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంది. రాబోయే తరాల, దేశ భవిష్యత్తు కేవలం ఎన్నికల తీర్పుల వల్ల నిర్ణయం కావు. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అప్పులు, ఖర్చు చేసే తీరు, భవిష్యత్తుపై వేసే భారాలు కూడా కీలకపాత్ర వహిస్తాయి. ఈ నేపథ్యంలో, పౌరులుగా, పన్ను చెల్లించేవారుగా సుప్రీంకోర్టు ముందున్న ఈ అత్యంత కీలకాంశాన్ని మనం కూడా పట్టించుకోవాలి. న్యాయకోవిదులు, ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల నిపుణులు, యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాలపై కోర్టులో వాదోపవాదాలు చేయనున్నాయి. కానీ ప్రజలుగా మన భవిష్యత్తు ప్రమాదంలో ఉంది. అందువల్ల, ఈ కీలక వాదనల్లో మనందరం భాగమవ్వాలి.

ఒక వ్యక్తి కావచ్చు, కుటుంబం, సంస్థ లేదా ప్రభుత్వం కావచ్చు, తమ ఆర్థిక వనరుల్ని జాగ్రత్తగా, వివేకంతో నిర్వహించుకోవాలి; లేకుంటే, దివాలా తీస్తాయి. ఆరోగ్యకరమైన ఆర్థిక నిర్వహణకు ప్రాతిపదిక నాలుగు అంశాలు. మొదటిది, మన రోజువారీ ఖర్చు, అది నెలవారీ జీతం కావచ్చు, మరోటి కావచ్చు, మన స్థిర ఆదాయం పరిధిలోపే ఉండాలి. వచ్చే ఆదాయం కంటే రోజువారీ ఖర్చుకి ఎక్కువ వ్యయం చేస్తే, అప్పు తెచ్చుకోవాల్సి ఉంటుంది. బాకీల భారం పెరుగుతూంటుంది. ఖర్చు పోగా మన ఆదాయంలో అదనంగా ఏమీ మిగలదు కాబట్టి, అప్పు తిరిగి చెల్లించటం మాట అలా ఉంచి, వడ్డీ కట్టటం కూడా సాధ్యం కాదు. అప్పుకి వడ్డీ కోసం మళ్లీ అప్పు చేయాల్సి ఉంటుంది. చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుంది. రోజువారీ బడ్జెట్ ఖర్చులో అటువంటి లోటు ఏర్పడితే (మనం ప్రభుత్వంలో రెవెన్యూ లోటు అని పిలుస్తాం) మనుగడ అసాధ్యమవుతుంది. మన పిల్లలు, వారసులకు తమ తల్లిదండ్రులు, పూర్వీకుల నుంచి కొండలా పేరుకుపోయిన అప్పులు వారసత్వంగా సంక్రమిస్తాయి. అదికూడా బాకీల్ని తీర్చటానికి ఎటువంటి ఆస్తుల్ని, ఆదాయాల్ని చూపకుండా. ఏ కుటుంబం, సంస్థా అటువంటి దుబారా ఖర్చుని తట్టుకుని నిలబడలేవు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతాయి.

రెండో అంశం, భవిష్యత్తుపై పెన్షన్ల చెల్లింపు వంటి భారాల్ని మోసితే, వాటికి కేటాయింపుల్ని ఇప్పుడే చేయాలి. లేకుంటే,




ఆదాయాన్ని పెంచటానికి ఉపయోగపడటంతోపాటు ఆ పెట్టుబడి అర్థవంతంగా, కచ్చితంగా ఖర్చుకు తగ్గ ఫలిత మిస్తుందని కూడా మనం నిర్ధారించుకోవాలి.

నాలుగోది, అప్పు తెచ్చిన డబ్బుని మనం ఆస్తుల నిర్మాణానికి, భవిష్యత్తు ఆదాయాల్ని పెంచేందుకు వినియోగించినా కూడా, ఆ అప్పుకి ఒక పరిమితి ఉంటుంది. ఆ పరిధి దాటి అప్పు మనకి మోయలేని భారమవుతుంది. తాహతుకు మించి అప్పు తెచ్చుకుంటే, మళ్లీ మనం అప్పుల ఊబిలో కూరుకుపోతాం. బయటపడటం కష్టమవుతుంది. అప్పులు తీర్చటానికి ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది, లేదా దివాలా తీయాల్సి వస్తుంది.

ఆదాయ మార్గంలేని భవిష్యత్తు వ్యయం పెరిగిపోతుంటుంది, సంస్థ ఖాయిలా పడుతుంది. కుటుంబాలు సాధారణంగా ఏం చేస్తుంటాయి? ప్రతి నెలా డబ్బును పొదుపు చేసి, భవిష్యత్తు వ్యయానికి భద్రపరచుకుంటాయి. ఆ తర్వాత, ఆస్తులు కొంటాం, లేదా భవిష్యత్తులో ఆదాయం కోసం వాటిని స్టాక్‌లలో, డిపాజిట్లలో పెట్టుబడి పెడతాం. కానీ, భారత్‌లో చాలా ప్రభుత్వాలు రోజువారీ ఖర్చులకు కూడా భారీగా అప్పులు చేస్తున్నాయి. అందుకు తగ్గ ఆస్తులు, భవిష్యత్తు ఆదాయం లేక అప్పు ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరిగిపోతోంది.

మూడోది, అప్పుల్ని పెట్టుబడులకు ఉపయోగించినంత మాత్రాన సరిపోదు. ఆస్తుల్ని పెంచటంపై చేసే వ్యయం సద్వినియోగమయ్యేలా ఉండాలి. ఖర్చుకు తగ్గ ఫలితం వచ్చేలా సరైన విశ్లేషణ చేయాలి. ఖర్చుల కంటే ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నాయని నిగ్గుతేల్చుకోవాలి. ఆస్తుల పేరుతో దారీతెన్నూలేని వంతెనల్ని నిర్మిస్తే, జనం నివాసానికి ఇష్టపడని పట్టణాల్ని నిర్మిస్తే, అప్పు తెచ్చిన డబ్బు వృధా అయినట్లు. తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టుకయిన అసంబద్ధ భారీ వ్యయంపై పెద్దఎత్తున వివాదం కొనసాగుతోంది. సాగునీరు అందించటానికి ఎకరాకి రూ.4-5 లక్షలు పెట్టుబడి వ్యయం చేశారు. నిర్వహణ, వగైరాల కోసం ప్రతి సంవత్సరం రూ.40-50,000 దాకా ఎకరాకి వెచ్చించాల్సి ఉంటుంది. పెట్టిన ఖర్చుతో పోలిస్తే, ఈ సాగునీటి ప్రాజెక్టు వల్ల రైతుకి నికరంగా పెరిగే ఆదాయం తక్కువ. అప్పుల డబ్బుని ఆ రకంగా ఖర్చు చేస్తే, అది 'పెట్టుబడుల' కోసమైనా సరే, చివరికి రాష్ట్రాన్ని దివాలా తీయిస్తాయి. కాబట్టి అప్పు చేసి తెచ్చిన డబ్బు ఆస్తుల నిర్మాణానికి, భవిష్యత్తు

ఈ సూత్రాలు - రోజువారీ ఖర్చుకు అప్పులు చేయకపోవటం; భవిష్యత్తుపై భారం వేసే పెన్షన్లు వంటి వాటికి ఇప్పుడే డబ్బు కేటాయించటం; ఖర్చుల కంటే ప్రయోజనాలు ఎక్కువ ఉన్నప్పుడు మాత్రమే పెట్టుబడి పెట్టటం; మీరు చెల్లించగలిగే సామర్థ్యానికి మించి భారీ అప్పు చేయకపోవటం - దేశాలు, రాజ్యాంగబద్ధ ప్రభుత్వాలకు కూడా వర్తిస్తాయి. అందుకే ఆర్థిక స్థిరత్వం, భారతదేశ పరపతి యూనియన్ ప్రభుత్వ బాధ్యతలని మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో విజ్ఞతతో ఆలోచించి నిర్ణయించారు. ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యతల పరిధిలో తాము సరైన విధానమని భావించిన రీతిలో ప్రజాధనాన్ని వినియోగించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. కానీ ఖజానా డబ్బును దుబారా చేయటం, ఇష్టారాజ్యం అప్పులు చేయటం రాష్ట్రాల హక్కుల్లో భాగం కాదు. ఎందుకంటే, ఏ రాష్ట్రం చర్యలైనా మొత్తం దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయి. ఆర్టికల్ 293, ఆర్టికల్ 360లను జాగ్రత్తగా, ఉద్దేశ పూర్వకంగా రాజ్యాంగంలో చేర్చారు. ఆర్థికంగా దేశం అవిభాజ్యమని, భారత్‌లోని ఏ ప్రాంత ఆర్థిక స్థిరత్వానికి ముప్పు ఏర్పడినా మొత్తం దేశ ఆర్థిక స్థిరత్వానికి, మన బిడ్డల భవిష్యత్తుకి ప్రమాదంగా పరిణమిస్తుందని స్పష్టమైన అవగాహనతో మన జాతి నిర్మాతలు వ్యవహరించారు. దీన్ని విస్మరించి ఎడాపెడా అప్పులు చేసి, అందుకు తగ్గ ఆస్తుల్ని సమకూర్చకుండా వచ్చేతరం మీద రుణభారాన్ని పెడితే, మన బిడ్డల భవిష్యత్తు అంధకారమవుతుంది; దేశం ప్రమాదంలో పడుతుంది. ★★

# ఆర్టికల్ 293 విషయంలో కేరళ వాదన తప్పు

|| సుమేధా కూరపర్తి ||

రాష్ట్ర ప్రభుత్వాల రుణాన్ని నియంత్రించే అధికారం జాతీయ స్థాయి ప్రభుత్వానికి లేదని, లేని అధికారంతో వ్యవహరించటం రాజ్యాంగ విరుద్ధమని కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. రాష్ట్రాల రుణాన్ని నియంత్రించడంలో యూనియన్ ప్రభుత్వం తీసుకున్న ఇతర నిర్ణయాలను కూడా కేరళ ప్రశ్నించింది. ఈ కేసు ఎన్నో సంక్లిష్టమైన ప్రశ్నలను లేవనెత్తినప్పటికీ, ఈ వ్యాసంలోని విశ్లేషణ రాష్ట్ర ప్రభుత్వాల రుణస్థాయిని నియంత్రించడానికి రాజ్యాంగ పరంగా యూనియన్ ప్రభుత్వానికి ఉన్న అధికారం ఏమిటి అనే ప్రశ్నకి పరిమితం చేద్దాం. సమస్యకు మూలమైన ఈ ప్రశ్నపై పూర్తి స్పష్టత అవసరం.

రాష్ట్రాల రుణాల గరిష్ట పరిమితిని నిర్ణయించటంలో జాతీయ స్థాయి ప్రభుత్వానికి ఎలాంటి పాత్రా లేదని కేరళ వాదిస్తోంది. నెట్ బారోయింగ్ సీలింగ్ (ఎన్‌బీసీ)ని నిర్ధారించడానికి యూనియన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. కేరళ వాదన మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంది. వాటిని ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

రాష్ట్ర ప్రభుత్వ రుణాలపై జాతీయ ప్రభుత్వం ఎలాంటి పర్యవేక్షణ చేసినా ఆర్థిక సమాఖ్య సూత్రాలను ఉల్లంఘించడమే అనేది కేరళ ప్రధాన వాదన. ఒక ప్రభుత్వం బడ్జెట్‌ను నిర్ధారించుకోవటం తన సార్వభౌమాధికారమని, ఆ అధికారాన్ని రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వాలకి, జాతీయ స్థాయి ప్రభుత్వానికి సమానంగా చేకూర్చిందని వాదిస్తోంది. దానర్థం, ప్రభుత్వం చేయాల్సిన మొత్తం వార్షిక వ్యయాన్ని, అందుకు అవసరమైన మొత్తం అప్పుని నిర్ధారించటంలో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని. రాష్ట్ర ప్రభుత్వ అధికారానికి ఉన్న ఒకేఒక పరిమితి రాష్ట్ర ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బీఎం) చట్టం అని, ఇందులో జాతీయ స్థాయి ప్రభుత్వానికి ఎటువంటి పాత్రా లేదని కేరళ వాదన (ఈ చట్టం ద్వారా నిర్దేశించబడిన పరిమితులను ఉల్లంఘించినందుకు ఎలాంటి చర్యలూ ఉండకపోవటం గమనార్హం).

రెండు, రాష్ట్ర ప్రభుత్వాలు సేకరించే అన్ని రుణాల్ని నియంత్రించే అధికారాన్ని ఆర్టికల్ 293 యూనియన్ ప్రభుత్వానికి ఇవ్వలేదని, ఆ అధికారం కేవలం జాతీయ స్థాయి ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాలకే వర్తిస్తుందని కేరళ అంటోంది. అప్పు తెచ్చే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టికల్ 293 ద్వారా పొందుతాయి. అప్పు చేసే అధికారం రాష్ట్రాలకు ఇవ్వటమే కాకుండా, ఆర్టికల్ 293 ఆ అధికారంపై కొన్ని పరిమితులను కూడా విధించింది. ఈ నిబంధన ప్రకారం, రాష్ట్ర ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం నిర్దేశించిన పరిమితుల్లో కన్సాలిడేటెడ్ ఫండ్ హామీపై




రుణం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం జాతీయ స్థాయి ప్రభుత్వానికి రుణపడి ఉన్నా, లేదా తన బకాయిలకు యూనియన్ ప్రభుత్వం గ్యారంటీ ఉన్నా, రాష్ట్రం రుణం తీసుకోవటానికి జాతీయ స్థాయి ప్రభుత్వ సమ్మతిని విధిగా తీసుకోవాలి.

మూడు, ప్రస్తుత రాష్ట్ర రుణభారంలో అత్యధిక వాటా మార్కెట్ నుండి తీసుకున్న అప్పులది కాగా జాతీయ స్థాయి ప్రభుత్వం వాటా గణనీయంగా తగ్గిపోతోందని, ఇలాంటప్పుడు నియంత్రణ కొనసాగటానికి ఎటువంటి కారణం లేదని కేరళ పేర్కొంటోంది. ఆర్థిక నిర్వహణలో రాష్ట్ర పనితీరు ఆధారంగా ఎంత రుణం ఇవ్వాలి, ఏ వడ్డీ రేటుకు ఇవ్వాలనేది మార్కెట్ శక్తులు నిర్ణయిస్తాయి కాబట్టి జాతీయ ప్రభుత్వ నిఘా అనవసరం అని వాదిస్తోంది. జాతీయ ప్రభుత్వం ఇచ్చే అప్పుపై ఆధారపడటం కొద్ది సంవత్సరాలుగా గణనీయంగా తగ్గి, ప్రస్తుతం రాష్ట్ర మొత్తం అప్పులో 3% కంటే తక్కువగా ఉందని పేర్కొంది. అందువల్ల, రాష్ట్ర మొత్తం రుణంపై జాతీయ స్థాయి ప్రభుత్వ నియంత్రణ సమంజసం కాదని కేరళ ప్రభుత్వ అభిప్రాయం.

సమాఖ్య వ్యవస్థలో ఒక రాష్ట్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా తన రాబడి, వ్యయాలను నిర్ణయించుకుని నిర్వహించగలగాలి అనే వాదన పూర్తిగా హేతుబద్ధమైనది. కానీ మనం అర్థం చేసుకోవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, రాజ్యాంగం ప్రకారం ఆర్థిక విషయాల్లో జాతీయ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు కావు. అంతిమంగా భారతదేశం మొత్తం ఒకే ఆర్థిక వ్యవస్థ. దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడే బాధ్యత జాతీయ ప్రభుత్వానిదే. అంతర్జాతీయ రుణ మార్కెట్లలో దేశ ఆర్థిక నిర్వహణపై విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత కూడా జాతీయ ప్రభుత్వంపై ఉంది. అందువల్ల, రాష్ట్ర ప్రభుత్వ రుణాలను నియంత్రించడంలో జాతీయ ప్రభుత్వానికి ఎలాంటి

పాత్ర లేదని, అసలు పర్యవేక్షణ అవసరమే లేదని కేరళ వాదించటం తప్పు.

ఆర్థిక విషయాల్లో జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధం కేవలం బడ్జెట్ నిర్ధారణ స్వేచ్ఛకి పరిమితం కాదు. ఇంకెన్నో కీలకమైన అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. రాజ్యాంగం ఏ అంచె ప్రభుత్వానికి ఎలాంటి అధికారాలను, బాధ్యతలను నిర్దేశించింది పరిశీలించటం అవసరం. రెండు అంచెలో ఉండే రాష్ట్ర ప్రభుత్వాలకు తమ బడ్జెట్‌ను నిర్ధారించుకునే అధికారం ఇచ్చినప్పటికీ, దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో దూరదృష్టితో కొన్ని క్లిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను సమగ్రంగా చూసినట్లయితే జాతీయ స్థాయి ప్రభుత్వానికి కొన్ని అదనపు బాధ్యతలను అప్పగించి, ఆర్థిక నిర్వహణలో రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కొంతమేరకు పరిమితం చేసినట్లు స్పష్టం అవుతుంది.

అసలు, జాతీయ ప్రభుత్వానికి పర్యవేక్షణ అధికారం అప్పగించే ఇటువంటి ఏర్పాటు ఎందుకు అవసరమైంది? దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడే బాధ్యత జాతీయ స్థాయి ప్రభుత్వానిదే ఎందుకు కావాలి? కె.ఎం మున్షి రాజ్యాంగసభలో నిర్ద్వంద్వంగా చెప్పినట్లు, భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒక్కటే. జాతీయ స్థాయి ప్రభుత్వ నిర్ణయాలే కాదు, ఆర్థిక నిర్వహణకు సంబంధించి ఒక రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల ప్రభావం కూడా దేశం మొత్తం మీద ఉంటుంది. సమాఖ్య వ్యవస్థలో దేశంలోని మొత్తం ప్రభుత్వ రుణ నియంత్రణ జాతీయ స్థాయిలోనే జరగాలి. ఎందుకంటే, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రతి రాష్ట్రానికి ఉన్న సొంత అవసరాలు, ఆకాంక్షలను సమర్థంగా సమతూకం గావించటం జాతీయ స్థాయిలోనే సాధ్యం. ఎటువంటి పర్యవేక్షణ లేకుండా అప్పులు తీసుకునే అధికారాన్ని రాష్ట్రాలకు వదిలేస్తే, జాతీయ ప్రయోజనాలను విస్మరించి ప్రతి రాష్ట్రం కేవలం తమ ప్రాంతీయ ప్రయోజనాలకు అనుగుణంగా విపరీత ధోరణులతో వ్యవహరించే ప్రమాదం ఉంది.

జాతీయ స్థాయి ప్రభుత్వం, ఇంకా రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక సంబంధాలు విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నాయి. రాష్ట్రాల మొత్తం ఆదాయంలో జాతీయ స్థాయి ప్రభుత్వం నుండి బదిలీ అయ్యే వాటా గణనీయమైనది. యూనియన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కొన్ని పన్నులను వసూలు చేసి ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా అన్ని రాష్ట్రాల మధ్య ఆ ఆదాయాన్ని పంచుతుంది. అంటే, ఒక రాష్ట్రం స్వయం ఉత్పత్తి నుంచి పొందే ఆదాయానికి మించి, జాతీయ స్థాయి ఉమ్మడి వనరు (కామన్ పూల్) నుండి గణనీయమైన ఆదాయాన్ని పొందుతుంది. ప్రతి రాష్ట్రానికి ఇది వర్తిస్తుంది. ఈ కామన్ పూల్ పరిధి ఎంత అనేది దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల ఆర్థిక పనితీరుపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, ఒక రాష్ట్ర అసమర్థ ఆర్థిక నిర్వహణ వల్ల ఆ రాష్ట్రంపై మాత్రమే కాకుండా దేశంలోని మిగిలిన ప్రాంతాలపై కూడా తీవ్రమైన పరిణామాలు ఉంటాయి.

అదేకాకుండా, ఒక రాష్ట్రం దివాలా తీయడానికి రాజ్యాంగం అనుమతించదు. అటువంటి పరిస్థితి ఏర్పడితే, ఆ రాష్ట్రంలోని ఆర్థిక నిర్ణయాలపై పూర్తి అధికారం తీసుకుని, సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకొచ్చే బాధ్యత జాతీయ స్థాయి ప్రభుత్వానిదని స్పష్టం చేస్తుంది (ఆర్థిక ఎమర్జెన్సీ, ఆర్టికల్ 360). అంటే, దివాలా అంచున ఉన్న రాష్ట్రాన్ని దేశంలోని మిగతా రాష్ట్రాలన్నీ కలిసి రక్షించాల్సి వస్తుంది. జాతీయ స్థాయి ప్రభుత్వంపై ఈ బాధ్యత ఉంది కాబట్టి, రాష్ట్రాల అధికారంపై పరిమితులు, అప్పు చెయ్యడానికి జాతీయ ప్రభుత్వ ముందస్తు అనుమతి అవసరం. ఇదేసమయంలో తన నిర్దిష్ట పరిధిలో విధానాల్ని, వ్యయాన్ని నిర్ధారించుకునే పూర్తిస్వేచ్ఛ ఒక రాష్ట్రానికి ఉంది.

ఆర్టికల్ 293 ప్రకారం జాతీయ స్థాయి ప్రభుత్వ అధికారం కేవలం యూనియన్ నుండి లేదా ప్రమేయంతో రాష్ట్రాలు తీసుకున్న అప్పులకే పరిమితం అనే వాదన ఆర్టికల్‌లో స్పష్టంగా వివరించిన షరతులకు విరుద్ధం. జాతీయ ప్రభుత్వ ముందస్తు అనుమతి అన్ని రకాల అప్పులకు వర్తిస్తుంది. రాష్ట్రాలు మార్కెట్ నుంచి తీసుకుంటున్న అప్పుల వెనుక కూడా దేశ సార్వభౌమాధికారం పాత్ర కీలకమైనది. ఈ ఇంప్లిసిట్ సావరిన్ గ్యారంటీ కారణంగా అన్ని రకాల అప్పులపై జాతీయ ప్రభుత్వ పర్యవేక్షణ మరింత కీలకం అవుతుంది.

రాజ్యాంగంలో రాష్ట్రాలు దివాలా తీయలేని విధంగా చేసుకున్న ఆర్థిక ఏర్పాట్ల సహజ పరిణామంగా రాష్ట్రాలు మార్కెట్ నుండి తీసుకున్న అప్పులకు జాతీయ స్థాయి ప్రభుత్వ గ్యారంటీ ఉంటుంది. అంటే, అప్పు చేస్తున్న రాష్ట్ర ఆర్థిక పనితీరుతో సంబంధం లేకుండా, ఎట్టిపరిస్థితుల్లో ఆ అప్పు తీరుస్తారు అనే ధీమా మార్కెట్‌కు కలుగుతుంది. గతంలో ఆర్‌బీఐ గవర్నర్లు కూడా ఈ ఇంప్లిసిట్ సావరిన్ గ్యారంటీ ప్రక్రియ గురించి ప్రస్తావించారు. కాబట్టి, మనలాంటి సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర రుణంపై పర్యవేక్షణ అవసరంలేదనటం సరికాదు. మన ఆర్థిక వ్యవస్థలో రాష్ట్రాలు పూర్తిగా మార్కెట్ క్రమశిక్షణకు లోబడే అవకాశం లేదు. అసమర్థ నిర్వహణ రుణ అందుబాటుపై లేదా వడ్డీ రేట్లపై ఎటువంటి ప్రభావం చూపించనప్పుడు, ఆర్థిక క్రమశిక్షణ పాటించటానికి రాష్ట్రాలకు ఒక ప్రోత్సాహకమే లేకుండా పోతుంది.

పర్యవేక్షణ చేసే కీలకమైన అధికారం జాతీయ స్థాయి ప్రభుత్వం చేతుల్లో ఉండటం సహజంగా పక్షపాత రాజకీయ ఆరోపణలకు దారితీస్తుంది. ఆ అధికారాన్ని న్యాయమైన, పారదర్శకమైన రీతిలో అమలు చేసేందుకు రాజకీయాలకు దూరంగా జవాబుదారీతనం కలిగిన ఒక స్వతంత్ర వ్యవస్థ అవసరం. ఈ ప్రక్రియపై ప్రజా విశ్వాసాన్ని, రాజకీయ పార్టీల విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితుల్లో కాపాడుకోవాలి. జాతీయ ప్రభుత్వం ముందు చూపుతో పారదర్శకత కోసం మరో వ్యవస్థ ఏర్పాటు చేయక పోయినా, సుప్రీంకోర్టు ఆ దిశగా ప్రభుత్వాన్ని ప్రోత్సహించవచ్చు. ఆర్థిక నిర్వహణ, ప్రజా రుణ నిర్వహణ ఎంతో కీలకమైన అంశాలు అయినప్పటికీ, ఇంతవరకు చర్చల్లో పెద్దగా పట్టించుకోలేదు. కానీ రాబోయే 10-20 సంవత్సరాలలో భారతదేశ ఆర్థిక ప్రగతి వేగంగా ఉండబోయే నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణ ప్రాముఖ్యత గణనీయం. ★★

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Vote Jugaad May 2024! జుగాడ్ 50:50 రాజనీతి

### Law of P R O H I B I T I O N

***25 నుండి 60 సం || వయస్సు యువత ఈ వ్యాసం చదువవద్దు !**

మన పొలిటికల్ పార్టీలు మనని 1) డబ్బు 2) మద్యం ద్వారా blackmail చేస్తూ మనపై పెత్తనం చేస్తున్నాయనీ, దేశంలో జరుగుతున్న పరిణామాలే అందుకు సాక్ష్యం అనీ, గత సంచికలో ప్రస్తావించాను. ఈ మండుటెండలలో "చల్లగా" ఢిల్లీ లిక్కర్ స్కాం మన హైదరాబాదుకి వ్యాపించింది. కృత్రిమ కొరతతో "బీరు" ధరలు విపరీతంగా పెరిగడంతో మద్యం అమ్మకాలు పెరిగాయి. Prohibition & Excise ఉద్యోగస్తులు వారిమత్తులో వారున్నారు. ప్రత్యేకంగా నేను ఏపార్టీనీ, ఎలెక్ట్రానిక్ మీడియాని కానీ, ప్రముఖ వార్తాపత్రికల యాజమాన్యాలని కానీ, న్యాయవ్యవస్థను కానీ విమర్శించడం లేదు. ఎందుకంటే, అందులో పనిచేస్తున్న ఓటర్లందరూ కూడా మన "భాయీ-బెహన్లే" కదా! For ex: మెరుగైన సమాజం కోసం కొన్ని ఛానల్స్

కర్షకులు, కార్మికులు, లాయర్లు, జడ్జీలు, ఇంజనీర్లు, ఆటోడ్రైవర్లు ,డాక్టర్లు, IAS లు - IPS లు, చాకలి,మంగలి, MLAలు, MPలు, మంత్రులు, ముఖ్యమంత్రులు, సినిమా కళాకారులు, ఆఖరికి నేటి ఆధునిక స్త్రీలతో సహా, గుడిలో పూజారినుండి స్మశానంలోని కాటికాపరి వరకు అందరిలోనూ కొందరు మద్యపానప్రియులు ఉన్నారని గ్రహించాలి. వీరిని సమిష్టిగా "తాగుబోతు" లని సంబోధిస్తూ వారి డబ్బుతో మద్యం వ్యాపారం చేయవద్దని పొలిటికల్ పార్టీలు నడుపుతున్న ఓటర్లకు నావిన్నపం. పొలిటికల్ పార్టీల లీడర్లూ, కార్యకర్తలూ మద్యపానం చేయని పుణ్యాత్ములా? వీళ్ళు కేవలం "పాలుతాగి" బ్రతుకుతున్నారా? అదే నిజమైతే, ఈ ఎన్నికల సమయంలో ఓటర్లకు మద్యం ఎందుకు ఉచితంగా ఇస్తున్నారో నాప్రశ్నకి RTI చట్టం క్రింద దయచేసి ఏ పార్టీ అధినాయకులయినా సమాధానం ఇవ్వండి.

ప్రతిపాదిత జుగాడ్ జాతీయ ఓటర్ల ద్విపక్షపార్టీ సుపరిపాలనకోసం, జాతీయ పార్టీల తో కలిసి cooperation based on trust అనే మౌలిక సిద్ధాంతం తో, "బీరు"ని "beverage" గా క్రోడీకరించి GST పరిధిలో కి తెచ్చి, జాతీయ మద్యంపాలిసీ చట్టం చేసి ఆచరణలో పెడుతుంది.

*Small Print: ఒకవేళ ప్రమాదవశాత్తూ చదివితే నమూనామార్పుకి సంఘటితంగా ఒకప్రయత్నం చేద్దాము ! రండి !ఇదే నావ్యక్తిగత ఆహ్వానం ! !

Let's understand how PROHIBITION effects Voters' LIBERTY by understanding their-respective meanings: [Prohibition = The prevention by law of the manufacture and selling alcohol especially in the US between 1920 and 1933 [Liberty = The 'state of being free' within society from oppressive restrictions imposed by authority on one's way of life, behaviour, or political views]

Contact: Jugaad Parthasarathy (9866416798) (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:

(Advt)

# ఐలయ్య అభాండాలకు లోక్‌సత్తా సమాధానం

**'నూతన విద్యావిప్లవం వర్థిల్లాలంటే...' శీర్షికతో ఏప్రిల్ 3న 'సాక్షి' దినపత్రికలో రాసిన వ్యాసంలో ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెపర్డ్ లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌పై పలు అసత్య ఆరోపణలు చేశారు. సమ్యక్ దృష్టి, నిష్పాక్షిక పరిశీలన, హేతుబద్ధ విశ్లేషణలేని వ్యాఖ్యలతో బురద జల్లారు. ఆంధ్రప్రదేశ్ 2024 ఎలక్షన్లు తాత్కాలిక పథకాల సంక్షేమమే పరిపాలన అనే పంథాకి - సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా అవసరమనే పంథాకి మధ్య పోరాటంగా, నిర్ణయాత్మక ఎన్నికలుగా పేర్కొంటూ, సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సమతూకం పాటించే బీజేపీ, తెలుగుదేశం, జనసేన (ఎన్‌డీయే) కూటమికి జేపీ మద్దతు ప్రకటించటంతో ఐలయ్య ఈ వ్యాసం రాశారు. రాజకీయంగా అర్థంలేని విమర్శలను చేసేవారికి సమాధానం ఇవ్వనక్కర్లేదు. కానీ వివక్షను ఎదుర్కొంటూ, కష్టం నుంచి ఎదిగి, ఆ బాధ ఇంకెవరికీ లేకుండా చేయాలనే సంకల్పంతో తన వంతు ప్రయత్నం చేస్తున్న ఐలయ్య లాంటి వ్యక్తి చేసిన విమర్శ కాబట్టి ఆయన వ్యాసంలోని అంశాలు అవాస్తవాలైనా సమాధానం ఇవ్వాల్సి వస్తోంది.**

అణగారిన, అవకాశాలు అందుకోలేని ప్రజల ఆదాయం పెరిగేలా, వారి బిడ్డలు మరింత అభివృద్ధి సాధించేలా, ఎవరితోనైనా పోటీపడగలిగేలా ఆర్థికాభివృద్ధిని, ఉపాధి అవకాశాలను అందించకుండా వారు నిరంతరం పరాధీనులుగా, తాత్కాలిక పథకాలను పుచ్చుకునే చేతులుగా మిగిలిపోయేలా, వారితోపాటు వారి పిల్లలు కూడా పేదలుగా కొనసాగేలా కేవలం సంక్షేమ పథకాల బటన్ నొక్కటమే పరిపాలనగా చేయటం వల్ల జగన్ ప్రభుత్వాన్ని జేపీ వ్యతిరేకించారు.

మన దేశంలో ప్రభుత్వాలు ఎన్ని తప్పులు చేసినా కొన్ని మంచిపనులు చేయటం, అంతర్జాతీయంగా చైనా భయం వల్ల మద్దతు పెరగటం మొదలైన కారణాల వల్ల వచ్చే 25 ఏళ్లలో ఆర్థికంగా ఎదిగేందుకు ఒక గొప్ప అవకాశం కనిపిస్తోంది. ఈ అవకాశాన్ని జారవిడిచేలా వ్యవహరించటం వల్లే జగన్ ప్రభుత్వాన్ని జేపీ వ్యతిరేకించారు. ఆంధ్రప్రదేశ్‌లో గత అయిదేళ్లలో పెట్టుబడులతోపాటు పోలవరం ప్రాజెక్టు వంటి కీలకమైన పనులు కూడా ఆగిపోయాయి. పెట్టుబడి పెట్టి ఉపాధి ఇస్తాననేవాళ్లని నేరస్తుల్లా చూడటం, చట్టబద్ధపాలనను మరీ దిగజార్చి ప్రత్యర్థి రాజకీయ పార్టీల నేతలు, విమర్శలు చేసేవారి మీద దాడులకు దిగటం వంటి



చర్యల వల్ల అభివృద్ధికి కావలసిన పరిస్థితులు మరీ క్షీణించాయి. రోజువారీ ఖర్చులు, జీతభత్యాలు, వడ్డీలు వంటి వాటికే అప్పు చేయటం, ఆ అప్పులతోనే సంక్షేమ పథకాలకు బటన్ నొక్కటం వల్ల రాష్ట్ర స్థూల ఆదాయంలో అప్పుల వాటా 50 శాతం దాకా చేరింది. ఇది 20 శాతం దాటకూడదు.

ఇదేమీ దేవతలు, రాక్షసుల మధ్య పోరాటం కాదని, ఎన్నికల్లో డబ్బు ఖర్చు, చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ - స్థానిక ప్రభుత్వాల సాధికారత మొదలైన మౌలిక విషయాల్లో రాష్ట్రంలో, దేశంలో అన్ని పార్టీల తీరూ ఒకేలా ఉన్నా ఆర్థికాభివృద్ధి అనేక ఒకే ఒక్క తేడా వల్ల జేపీ ఎన్‌డీయేకి మద్దతిచ్చారు. ఆర్థికాభివృద్ధే లేకుంటే, చట్టబద్ధపాలన మరీ దిగజారితే ఇక ప్రజాస్వామ్యం, ప్రజల సాధికారత బూటకాలు. విషయాన్ని కాస్త లోతుగా, సమ్యక్ దృక్పథంతో పరిశీలించకుండా ఐలయ్య గారు జేపీ మీద అనుచిత విమర్శలు చేశారు.

వాస్తవాల్ని తెలియచేస్తూ అంశాలవారీగా ఐలయ్య గారి విమర్శలకు కొన్ని సమాధానాలు:

**ఐలయ్య: లోక్‌సత్తా అనే ఒక ఎన్‌జీవో పెట్టి తర్వాత రాజకీయ పార్టీ రూపం దాల్చారు. లోక్‌సత్తా అంటే ఇంగ్లీష్‌లో 'గ్లోబల్ పవర్' అని అర్థం.**

**వాస్తవం - సమాధానం:** లోక్‌సత్తా అంటే అర్థం గ్లోబల్ పవర్ కాదు. లోక్‌సత్తా అంటే 'పీపుల్ పవర్' అని అర్థం. రాజ్యాంగ ప్రజాస్వామ్యం ప్రజలకు హామీ ఇచ్చిన సాధికారతను వారికి అందించేందుకు, ఆ సాధికారతను వారు ఎప్పుడూ కోల్పోకుండా స్వయందిద్దుబాటు, పౌరుల నిరంతర జాగురూక భాగస్వామ్యం ఉండే వ్యవస్థల్ని నిర్మించేందుకే లోక్‌సత్తా ఆవిర్భవించింది. అందుకే లోక్‌సత్తా స్లోగన్ 'ప్రజలే ప్రభువులు'.

ప్రజలకు, అధికారానికి మధ్య అడ్డుగోడలు ఉండకూడదని, పరిపాలనకు కేంద్రబిందువు ప్రజలే కావాలని, పౌరుల చుట్టూనే పాలన ఉండాలని ప్రజల సాధికారతే లక్ష్యంగా లోక్‌సత్తా అని పేరు పెట్టారు.

**ఐలయ్య: లోక్‌సత్తా పార్టీకి ఎన్నడూ దిగిపోని ఏకో ముఖ (అంటే పార్టీలో మరో ముఖమే కనపడదు) అధ్యక్షుడిగా జేపీ ఉన్నాడు.**

**వాస్తవం – సమాధానం:** వచ్చిన ప్రతి రూపాయి విరాళానికి రసీదు ఇవ్వటం, చెక్ రూపంలో తీసుకోవటంతోపాటు స్వతంత్ర భారతదేశ చరిత్రలో సంస్థాగత పదవులకు రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించిన తొలి రాజకీయ పార్టీగా లోక్‌సత్తాను జేపీ నిర్మించారు. 2006లో పార్టీ ఆవిర్భవించాక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసి 2008లో ఎన్నికలు నిర్వహించారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్ష పదవికి జేపీ, డి.వి..వి.ఎస్ వర్మ, ఆకుల మహారాణి మధ్య పోటీ జరిగింది. ఎన్నికల అథారిటీ ఛైర్మన్‌గా రిటైర్డ్ పోలీసు ఉన్నతాధికారి వీరేపల్లి రామచంద్రయ్య వ్యవహరించారు. ఆ ఎన్నికల్లో జేపీ గెలిచారు. ఆ తర్వాత నిర్వహించిన ఎన్నికల్లో అసలు జేపీ పోటీ చేయలేదు. కటారి శ్రీనివాసరావు పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, ఎన్నికల సంఘం కమిషనర్ కాకి మాధవరావు ఎన్నికల అథారిటీగా వ్యవహరించారు. ఈ వాస్తవాల రికార్డులను లోక్‌సత్తా వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మన దేశంలో జగన్ పార్టీ సహా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ సొంత ఎస్టేట్‌లు, ప్రయివేటు ఆస్తులుగా మారాయన్నది వాస్తవం. ఇలాంటి పెత్తందారీ, రాచరిక స్వభావ రాజకీయంలో లోక్‌సత్తా పార్టీకి రహస్య బ్యాలెట్ ద్వారా పార్టీ అధ్యక్షుడు సహా అన్ని పదవులకూ ఎన్నికలు నిర్వహించారు. ఎస్.సి, ఎస్.టి, బీసీ, మహిళలు తగినంత సంఖ్యలో ఎన్నిక కాకపోతే వారికి ప్రాతినిధ్యం కల్పించేందుకు కో ఆప్ట్ పదవుల్ని ఏర్పాటు చేశారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడటం వల్ల సమర్థులు, నిజాయతీపరులైన సామాన్యులు రాజకీయాల్లో నాయకులుగా ఎదగలేకపోతున్నారు. రిజర్వేషన్ సీట్లలో అణగారిన వర్గాలకు టికెట్ల కేటాయించటంలో కూడా తమకు కీలుబొమ్మలుగా ఉండేవారినే పార్టీల అధినేతలు ఎంపిక చేస్తున్నారనేది వాస్తవం. ఈ పరిస్థితిని మార్చాలని ఒక ఉద్యమసంస్థగా వాదించటమేకాక, పార్టీగా ఆచరించి చూపింది లోక్‌సత్తా. అదేవిధంగా ఒక ఉద్యమ సంస్థగా నిజాయతీ రాజకీయానికి నిజాయతీ డబ్బు కావాలని వాదించి అన్ని ప్రధాన పార్టీలనూ ఒప్పించి 2003లో పార్టీల విరాళాల చట్టాన్ని తేవటంలో కీలక పాత్ర వహించారు జేపీ. ఒక పార్టీగా దేశంలోనే తొలిసారిగా పార్టీల జమాఖర్చు వివరాల ఆడిట్ చేసిన స్టేట్‌మెంట్‌ని ఏటా ప్రజల ముందుంచింది లోక్‌సత్తా. ఈ వాస్తవాల్ని తెలుసుకోకుండా ఐలయ్య గారు విమర్శ చేశారు.

**ఐలయ్య: జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలని ఈ మూడు పార్టీల (బీజేపీ, టీడీపీ, జనసేన) కూటమి (ఎన్‌డీయే) చాలనట్లు నాలుగో పార్టీగా అందులో జేపీ చేరాడు. ఇప్పుడు జేపీ లక్ష్యమంతా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం చదువు ఆపి, మళ్లీ తెలుగు మీడియం పెట్టేంత వరకూ పోరాటం చెయ్యడం!**

**వాస్తవం – సమాధానం:** జేపీ ఇంగ్లిష్ మీడియంకు వ్యతిరేకమా ఐలయ్య గారూ. నిజాయతీగా చెప్పండి. మీకు వాస్తవం తెలియదా? కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్‌కి జేపీ వచ్చినప్పుడు అదేసమయంలో మీరు కూడా వచ్చారు. లోక్‌సత్తా ప్రచురణలతో ఉన్న స్టాల్ సమీపంలో మీ సంభాషణను కొందరు పార్టీ మిత్రులు కూడా విన్నారు. సుమారు 20 నిముషాల పాటు మీరు మాట్లాడుకున్నారు. ఇంగ్లిష్ మాధ్యమంలో చదువులకు జేపీ మద్దతివ్వటాన్ని మీరు అభినందించారు కూడా.

పిల్లలకు ప్రాథమిక స్థాయిలో వాళ్లకు తెలిసిన భాషలో (అది మాతృభాష కావచ్చు, కాకపోవచ్చు) చదువు చెప్పాలని, అయిదవ తరగతి నుంచి క్రమంగా ఇంగ్లిష్ మాధ్యమంలో చదువులుండాలని జేపీ అనేక సందర్భాల్లో ప్రకటించారు. ఓ నోబెల్ బహుమతి విజేత వచ్చి చైనా వారి మాండరిన్ భాషలో మనకు ఎంత గొప్పగా పాఠం బోధించినా ఉపయోగం ఉండదని, అందువల్ల పిల్లలకు వారికి తెలిసిన భాషలో పాఠం నేర్పించాలని చెప్పారు.

విద్యపై ఓ సమావేశంలో జేపీ చెప్పిన మాటల్ని చూడండి: సమస్య మాతృభాషా, ఇంగ్లీషా అన్నది కాదు, పిల్లలకు క్లాసులో చెప్పేది అర్థం కావటం అసలు విషయం. వైఎస్ రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొన్ని హైస్కూళ్లను నిర్దిష్ట ప్రాతిపదికల మీద 'సక్సెస్' స్కూళ్లుగా గుర్తించి అందులో ఇంగ్లిష్ మాధ్యమాన్ని కూడా ప్రవేశపెట్టారు. కొందరు తెలివైన పిల్లలు, చురుకైన తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమాన్ని ఎంచుకున్నారు. నేను కొన్ని సక్సెస్ స్కూళ్లను సందర్శించినప్పుడు వారి అభ్యసన ప్రమాణాలు మెరుగ్గా కనిపించాయి. అయిదో తరగతి వరకు మాతృభాష/ స్థానిక భాష మాధ్యమంలో చదువుకోవటం వల్ల అవసరమైన పునాది వారికి ఏర్పడింది. అందువల్లే 6వ తరగతిలో సక్సెస్ స్కూల్‌లో ఇంగ్లిష్ మీడియం చదువులను వారు తేలిగ్గా ఆకళింపు చేసుకున్నారు. ఇది సరైన పద్ధతి. అంతేతప్ప ఓనమాలు దగ్గర్నుంచే ఇంగ్లిష్ మీడియం అంటే

భారతీయ భాషల్లోని పిల్లల విద్యాప్రమాణాలకు నష్టం చేయటమే అవుతుంది. జగన్ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం పేరుతో అట్టహాసం చేసింది తప్ప ఫలితాల్ని పట్టించుకోవటం లేదు. ఉట్టికెగరలేనమ్మ పైకి ఎగురుతానన్నట్లు విన్యాసాలు చేసింది. బోధనలో కొత్త సాంకేతికతల పేరుతో డబ్బు ఖర్చు చేసింది తప్ప, ఆ లక్ష్యాల్ని, వాటి ఫలితాల్ని ప్రజల ముందు పారదర్శకంగా ఉంచే జవాబుదారీతనాన్ని పాటించలేదు.

**ఇంగ్లిష్ తెలియని పిల్లలకి ఇంగ్లిష్‌లో బోధన కూడా మాండరినే కదా! దీనికి పెద్ద తెలివితేటలు అక్కర్లేదు. ఇంగితజ్ఞానం ఉంటే చాలు. అదే విధంగా ఉన్నత విద్యలో స్థానిక భాషల్లో టెక్స్ట్ బుక్స్ రావటంపట్ల కూడా జేపీ నిక్కచ్చిగా తన అభిప్రాయాల్ని చెబుతూ, మొదట్నుంచీ మన దేశంలో భాషల్ని సక్రమంగా పరిపుష్టం చేయక పోవటం వల్ల సాంకేతికాంశాలు షహా పలు రకాల పదాల కొరత ఉందని, అందువల్ల ఇంగ్లిష్‌కు వాటిని తక్షణ ప్రత్యామ్నాయంగా భావించ వద్దని హితవు పలికారు.**

అయిదో తరగతి వరకు అలా వారికి ఇంట్లో, సమాజంలో మాట్లాడే భాషలోనే బోధిస్తే ఆ తర్వాత 6వ నుండి 8వ తరగతి వరకు తెలుగును, ఇంగ్లిష్‌ను కలిపినట్లుగా మిక్స్‌డ్‌గా నేర్పించవచ్చని జేపీ సూచించారు. 9, 10 తరగతులు వచ్చేసరికి వారికి ఇంగ్లిష్ పరిజ్ఞానం అలవడుతుంది కాబట్టి, అక్కడ్నుంచి ఇంగ్లిష్‌లో బోధించవచ్చు. ఇది తప్ప వేరే పరిష్కారం లేదు. మిగతావన్నీ ఆత్మవంచన.

అదేవిధంగా ఇంగ్లిష్ సరిగా రాని టీచర్లు ఇంగ్లిష్ తెలియని పిల్లలకు బోధిస్తున్నారని, దీనివల్ల అటు ఇంగ్లిషు, ఇటు మాతృభాష, చివరికి సబ్జెక్ట్ కూడా పిల్లలకు పట్టుబడటం లేదని జేపీ స్పష్టం చేశారు. ఇంగ్లిష్ తెలియని పిల్లలకి ఇంగ్లిష్‌లో బోధన కూడా మాండరినే కదా! దీనికి పెద్ద తెలివితేటలు అక్కర్లేదు. ఇంగితజ్ఞానం ఉంటే చాలు. అదేవిధంగా ఉన్నత విద్యలో స్థానిక భాషల్లో టెక్స్ట్ బుక్స్ రావటంపట్ల కూడా జేపీ నిక్కచ్చిగా తన అభిప్రాయాల్ని చెబుతూ, మొదట్నుంచీ మన దేశంలో భాషల్ని సక్రమంగా పరిపుష్టం చేయకపోవటం వల్ల సాంకేతికాంశాలు షహా పలు రకాల పదాల కొరత ఉందని, అందువల్ల ఇంగ్లిష్‌కు వాటిని తక్షణ ప్రత్యామ్నాయంగా భావించవద్దని హితవు పలికారు.

**ఐలయ్య: జేపీ మరో లక్ష్యం గ్రామాల్లో స్కూళ్ల నిర్మాణం, సెక్రటేరియట్ నిర్మాణాలను ఆపి అభివృద్ధికి మార్గంగా అమరావతిని సింగపూర్‌లా చూపటం.**

**వాస్తవం – సమాధానం:** స్కూళ్లను నిర్మించాలా, వద్దా, స్కూళ్లను కొనసాగించాలా, వేరే స్కూళ్లతో విలీనం చేయాలా అనేది విద్యార్థుల సంఖ్యను బట్టి ఉంటుంది తప్ప కొత్త స్కూళ్లు వద్దని జేపీ ఎన్నడూ చెప్పలేదు. ఒకరిద్దరు విద్యార్థులున్నచోట నలుగురైదుగురు ఉపాధ్యాయులు, వందల మంది విద్యార్థులున్న చోట ఒకరిద్దరు టీచర్లు ఉండటం వల్ల రాష్ట్రంలో పాఠశాల విద్య ఎంత అస్తవ్యస్తంగా సాగుతోందో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో జేపీ గణాంకాలతో చెప్పినప్పుడు అధికార పక్షం సహా సభ్యులంతా దిగ్భ్రాంతి చెందారు. ఒక ప్రశ్నకు కేటాయించిన సమయం కాస్తా మూడు గంటలకు పైగా చర్చగా మారింది. కాబట్టి స్కూళ్ల నిర్మాణం, టీచర్ల సంఖ్య మన సమస్య అన్నట్లు చిత్రీకరించటం, జేపీ అనని మాటల్ని ఆయనకు ఆపాదించి బురద జల్లటం తగదు.

అదేవిధంగా, అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయాలని మాత్రమే జేపీ చెప్పారు. రాజధానిగా కంటే గ్రీన్‌ఫీల్డ్ సిటీగా ఉంటే ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్‌లాంటి ఒక ఆదాయ వనరు ఉంటుందని సాక్ష్యాధారాలతో చెప్పారు. ఇవాళ హైదరాబాద్ ఆదాయం లేకుంటే తెలంగాణ పరిస్థితి ఏమిటి? హైదరాబాద్ ఆదాయం లేకే గదా ఏపీ అంత దయనీయ స్థితిలోకి వెళ్లింది! రాజధానిపై ఒకసారి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక మళ్లీ వేరే రాజధానులనటం వంటి పనులు తుగ్లక్ తరహా పాలన అని స్పష్టం చేశారు.

ఏపీకి ఇటీవల వచ్చిన 2014-15 రెవెన్యూలోటు రూ.10,461 కోట్లు కూడా జేపీ నేతృత్వంలో ఏర్పాటైన స్వతంత్ర నిపుణుల కమిటీ సిఫార్సు ద్వారానే వచ్చిందన్న విషయం ఐలయ్య గారికి తెలియదేమో. హైదరాబాద్‌లో కూడా ఆదాయం ప్రధానంగా హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచే వస్తుంది. హైటెక్ సిటీ రూపకల్పనలో జేపీ ఓ అధికారిగా కీలక పాత్ర వహించారు. అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేసి ఉంటే, ఏపీకి సైతం పెట్టుబడులు పెరిగి ఆర్థికంగా బలోపేతమై యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున పెరిగేవి గదా! ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వరి, చెరకు వంటి పంటల స్థానంలో రైతులు సొంతంగా చొరవ తీసుకుని పండ్లు, కూరగాయలు వంటి డిమాండ్ ఉన్న ఉత్పత్తులను పండిస్తుండటంతో కొంత ఎక్కువ ఆదాయం వస్తోందిగానీ, రాష్ట్రంలో వ్యవసాయం మీద ఆధారపడినవారి సంఖ్యతో పోలిస్తే ఆ ఆదాయం పరిమితం. తక్కువ ఆదాయం వచ్చే సాగురంగంలో మరీ ఎక్కువమంది ఉపాధి పొందాల్సిన పరిస్థితి ఉంది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉన్నత విద్య కోర్సులు చదువుతున్నవారిలో సైతం అత్యధికులు ఉపాధి కోసం హైదరాబాద్‌కి వెళ్లాల్సి వస్తోంది. వాస్తవాలు ఇలా ఉండగా, ఐలయ్య గారు సింగపూర్ స్లోగన్‌తో విషయాన్ని పక్కదోవ

పట్టించే ప్రయత్నం చేశారు.

**ఐలయ్య: ఇప్పుడు గ్రామీణ బడుల నిర్మాణం, ఇంగ్లిష్ మీడియం చదువు, అమ్మ ఒడి పథకం ఆపి, అమరావతి పట్టణం వచ్చే ఐదేండ్లలో కడితే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధితోపాటు దేశానికే ఒక మోడల్ సిటీ వస్తుందని బహుశా జేపీ గారి నమ్మకం.**

**వాస్తవం – సమాధానం:** అమ్మఒడి పథకాన్ని జేపీ అభినందించారు కూడా. అయితే ఆ డబ్బు చదువుకు ఉపయోగపడకుండా కేవలం ఓట్లు సంపాదించుకోవటానికి అమలు చేసే ఒక తాత్కాలిక పథకంగా తయారవటాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకించారు. పాఠశాల విద్యకు చేస్తున్న ఖర్చు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువే ఉంది. ఇంకా ఎక్కువ డబ్బు ఖర్చు చేయగలిగితే మంచిదే. కానీ డబ్బు ఖర్చు తప్ప విద్యాప్రమాణాలు పెరగకపోతే ఏమిటి ప్రయోజనం?

దేశంలోని పాఠశాల విద్య ప్రమాణాలను అంచనా వేసేందుకు ప్రథమ్ అనే సంస్థ 'అసర్' సర్వేను నిర్వహిస్తున్న సంగతి ఐలయ్య గారికి తెలుసు. మొదటి అసర్ సర్వేను 2005లో అప్పటి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ ఆహ్లువాలియాతో కలిసి జేపీ ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఆవిష్కరించారు. ఏపీలో విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని 'అసర్' తాజా సర్వే కూడా తెలిపింది. 8వ తరగతి విద్యార్థి రెండవ తరగతి పాఠ్యాంశం కూడా చదవలేకపోతున్నారని, రాత్రి తొమ్మిదిన్నరకు పడుకుని తెల్లారి ఐదున్నరకి లేస్తే ఎన్ని గంటలు పడుకున్నావంటే చెప్పలేనివారు, గడియారం చూసి సరిగ్గా సమయం చెప్పలేనివారు 14–18 సంవత్సరాల మధ్య వయసు పిల్లల్లో సగం మంది దాకా ఉన్నారని ఆ సర్వే తెలిపింది.

వార్షిక పరీక్షల్లో మార్కులు బ్రహ్మాండంగా వస్తున్నాయిగానీ, తరగతి స్థాయి విద్యాప్రమాణాలు లేకుండానే 90 శాతంమందికిపైగా పాసవుతున్నారని జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వే కూడా తెలిపింది. తప్పంతా ప్రస్తుత ప్రభుత్వానిదే అని చెప్పటం ఇక్కడి ఉద్దేశం కాదు. అదేవిధంగా విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉండటం ఏపీకి మాత్రమే పరిమితం కాదు. కొన్ని స్కూళ్లలో మినహాయిస్తే దేశమంతా పరిస్థితి అలాగే ఉంది. అమ్మఒడి పథకం అమలు చేస్తున్నాం, విద్యకు ఎంతో ప్రాధాన్యమిచ్చాం అని ప్రచారం చేసుకుంటున్నా, పిల్లల చదువుల్లో వచ్చిన గుణాత్మక మార్పేమీ లేదని వాస్తవాలు వెల్లడిస్తున్నాయి.

'పీసా' సర్వే గురించి కూడా ఐలయ్య గారికి తెలిసే ఉంటుంది. సంపన్న దేశాలు విద్యారంగంలో తమ అభివృద్ధిని పోల్చి చూసుకునేందుకు ఈ సర్వేను ప్రారంభించాయి. మూడేళ్లకోసారి జరిగే ఈ సర్వేలో 2009లో భారత్ పాల్గొంది. పీసా సర్వేలో భారత్ నుంచి మెరుగైన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అయినా కూడా మనకు 74 దేశాల మధ్య సర్వేలో అట్టడుగు నుంచి రెండవ స్థానం, 73వ ర్యాంకు వచ్చింది. ఈ సర్వే గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జేపీ విస్తృతంగా ప్రచారం చేశారు. విద్యావ్యవస్థలో ప్రభుత్వ నేరసమాన నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం కొంతయినా కళ్లు తెరుస్తుందని జేపీ ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం మాత్రం ఇక నుంచి ఈ అంతర్జాతీయ సర్వేలో పాల్గొనబోమని వైదొలిగింది. 2009 నుంచి ఇప్పటి వరకూ పీసా సర్వేలో పాల్గొనలేదు. పదిహేనేళ్ల ఏళ్ల వయసు పిల్లల మధ్య ఈ పీసా సర్వే నిర్వహిస్తారు. ఆ వయసులో వారికి చదువులో ఏమి అర్థమవుతోంది, ఎంత తర్కబద్ధంగా ఆలోచిస్తున్నారు, ఏ రకంగా విశ్లేషిస్తున్నారు, నేర్చుకున్న అంశాలను ఎలా ఉపయోగిస్తున్నారు? అని మూడు సబ్జెక్టుల్లో ఆ సర్వేలో పరీక్షించారు. భాషలో ఒక పేరా చదివితే ఏం గ్రహిస్తున్నారు, ఎంత అర్థమవుతోంది? వంటివి, లెక్కల్లో కాన్సెప్టులు, నిజజీవితంలో ఓ సాధారణ కాన్సెప్ట్‌ను అప్లయ్ చేయటం వంటివి బేరీజు వేశారు. సైన్స్‌లో ఫార్ములాలనేమీ అడగలేదు. తర్కాన్ని, ఒక అప్లికేషన్‌ని పరీక్షించేటప్పుడు సింపుల్ కాలిక్యులేషన్‌ని రూపొందించే సామర్థ్యాన్ని అంచనా వేశారు. 7 లేదా 8వ తరగతి విద్యార్థులు తేలిగ్గానే పాసవగలిగే ప్రశ్నలివి. కానీ మనం అట్టడుగు స్థానాల్లో నిలిచాం. పీసా సర్వే సమయంలో జగన్ అధికారంలో లేరు గదా అనొచ్చు. ఇక్కడ చెప్పదలచుకున్నది, పీసా సర్వే స్థాయి ప్రమాణాలు కూడా అసర్ సర్వేలో ఉండవు. మూడంకెల సంఖ్యను ఒక అంకెతో భాగాహారం చేస్తే లేదా హెచ్చిస్తే ఎంతొస్తుందని అడుగుతారు తప్ప, ఆ భాగాహారం, హెచ్చవేత లేదా ఇంకో తీసివేత ఎందుకు చేయాలి, రోజు వారీ జీవితంలో ఆ అవసరమేంటి అని అడగరు. అలాంటి సర్వేలో కూడా ఏపీలో అమ్మఒడి వల్ల విద్యాప్రమాణాలు మెరుగైన దాఖలాలు లేవు. అందువల్ల ఇదేదో సాక్ష్యాలు, వాస్తవాల ఆధారంగా తప్ప విమర్శ కోసం చేయటం లేదు. అమ్మఒడి పథకాన్ని కాకుండా, ఆ పథకం వల్ల ఫలితాలు లేకపోవటాన్ని వైఫల్యంగా జేపీ విమర్శించారు.

ఏపీలో అమ్మఒడితో కలిపి ఒక్కో పాఠశాల విద్యార్థి మీద ప్రభుత్వం ఏడాదికి రూ.90,000 పైగా ఖర్చు చేస్తోంది. ఒక మెరుగైన, చెప్పుకోదగిన ప్రయివేటు స్కూలు ఫీజు కంటే ఇది ఎక్కువ. అయినా కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువు రావటం లేదు.

జేపీ గ్రామంలో చదువుకున్నారు. పంచాయతీ సమితి

స్కూల్‌లో తెలుగు మీడియంలో చదివారు. ఆ తర్వాత జిల్లా పరిషత్ స్కూల్‌లో చదివారు. ఆ రోజుల్లో మౌలిక వసతులు అధ్వాన్నంగా ఉండేవి. జీతాలు తక్కువ. ఉపాధ్యాయులకు నెలకు రూ.70 ఇచ్చేవాళ్లు. వానాకాలం వస్తే పైకప్పు నుంచి నీరు కారుతుండేది. రోడ్లు బురదమయంగా ఉండేవి. అలాంటి పరిస్థితుల్లో కూడా అప్పటి ఉపాధ్యాయులు, నాయకుల వల్ల జేపీ మంచి విద్య అందుకోగలిగారు. హార్వర్డ్, కేంబ్రిడ్జి లాంటి విశ్వవిద్యాలయాలకెళ్లినా ఎవరి కంటే తక్కువ కాదు అని ఆత్మవిశ్వాసంతో వ్యవహరించగలిగే ప్రపంచస్థాయి సామర్థ్యాన్ని సాధించగలిగారు. భారత్‌లో ఆ సమయంలో చదువుకున్న పదుల వేల మంది తమ అంతర్గత సామర్థ్యాన్ని వికసింపచేసుకోగలిగారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థానాలకు వెళ్లి ఎన్నో రంగాలను ప్రభావితం చేస్తున్నారు. కానీ ఈరోజు అదే స్కూల్‌కో, మరో బడికో వెళ్లి చూస్తే వాటిల్లో చదువుతున్న 80 శాతం మంది పిల్లలకు భవిష్యత్తు కనిపించటం లేదు. ఏమాత్రం పనికొచ్చే చదువు వారికి అందటం లేదు.

ఏపీలో అమ్మఒడి పథకంతోపాటు నాడు-నేడు ద్వారా స్కూళ్లకు వసతులు కల్పించాం, బ్రహ్మాండంగా రంగులేశాం అని చెబుతున్నారు. ఉపాధ్యాయులకు జేపీ చదువుకున్న రోజుల్లో కంటే వెయ్యి రెట్లు దాకా ఎక్కువ జీతం ఇస్తున్నారు. కానీ అసలు ఆ స్కూళ్ల లక్ష్యమైన విద్యార్థికి మంచి ప్రమాణాల విద్య ఏదీ?

తరగతి గది పొడుగెంత, వెడల్పెంత, ఎంతమంది టీచర్లు న్నారు వంటివి విద్యలో సాధారణాంశాలు. వీటన్నిటి నుంచి కావలసింది ఒకే ఒక్క మౌలికాంశం - పిల్లల సామర్థ్యం మెరుగవుతోందా, వారు వికసిస్తున్నారా, తాము నేర్చుకున్న వాటిని నిజజీవితంలో ఉపయోగించగలుగు తున్నారా, తమ అంతర్గత శక్తిని ఆవిష్కరించు కోగలుగుతున్నారా? సమాజానికి ఉపయోగపడుతూ తాము ఉత్పాదకంగా ఎదగలిగే శక్తిని పిల్లలు పెంచుకోగలిగారా, ఆర్థిక వ్యవస్థలో భాగం కాగలుగుతున్నారా? అన్నదే అసలు విషయం.

కాబట్టి అమ్మఒడి రద్దవటం కన్నా, విద్య మీద పెడుతున్న డబ్బు సద్వినియోగమయ్యేలా చేయటం ఇప్పుడు ప్రధానంగా మనం చేయవలసింది.

**ఐలయ్య: ప్రజామేధావికి తెలివి కన్నా, వాగ్ధాటి కన్నా బీద ప్రజల పక్షాన నిలబడే హృదయం ఉండాలి కదా! దేశంలో ప్రయివేట్ విద్య ఎంత ఖర్చుతో కూడుకున్నదో, ఏ భాషలో సాగుతుందో వీరందరికీ తెలవదా? 2024-25 ఎకనామిక్ సంవత్సరానికి ధీరూబాయి అంబానీ కొడుకు, కోడలు నడిపే స్కూలు ఫీజు చూడండి: సంవత్సరానికి ఎల్‌కేజీ విద్యార్థి ఫీజు: 1,70,000. 8-10 తరగతి పిల్లల ఫీజు: 5,90,000. 11-12 తరగతి పిల్లల ఫీజు: 9,65,000. ఇటువంటి స్కూళ్లు దేశంలో చాలా ఉన్నాయి. ఇవన్నీ ఏ మాతృభాషలో నడుస్తున్నాయి? ఇంతింత ఫీజులలో ఇంగ్లిష్ మీడియంలో, విదేశీ సిలబస్‌తో చదివే పిల్లల్ని జగన్ మోడల్ విద్యావిధానం ద్వారా కాక ఎలా ఎదుర్కొంటారు?**

**వాస్తవం - సమాధానం:** జేపీ దేవుడ్ని నమ్మరు, సంశయవాది. కానీ దేవుడే ప్రత్యక్షమై తనను ఒకే ఒక్క వరం కోరుకొమ్మంటే, నేను కోరేది విద్య, విద్య, విద్య. సరైన విద్య ప్రతి బిడ్డకూ అందించాలి అని తరచూ చెబుతుంటారు,

మన దేశ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి బిడ్డకీ ప్రధానంగా పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్య అందించేందుకు జేపీ చెబుతున్న పరిష్కారాల్ని, ఆ పరిష్కారంలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా భాగమవుతున్న తీరుని చూడండి.

భారత్‌లో గత 10-15 సంవత్సరాలలో ప్రభుత్వ స్కూళ్లపై లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కానీ ప్రయివేటు స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. డబ్బున్నవాళ్ల పిల్లలు పూర్వమే ప్రయివేటు స్కూళ్లలో చేరారు. మరి కొత్తగా ప్రయివేటు స్కూళ్లలో చేరిందెవరు? పేదలు. చాలామంది శక్తికి మించి ఖర్చు పెట్టి తమ పిల్లలేమన్నా బాగుపడతారేమోనన్న ఆశతో ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు. ఏపీలో గత నాలుగైదేళ్లలో కూడా ప్రభుత్వ పాఠశాలల నుంచి పిల్లలు పెద్ద సంఖ్యలో ప్రయివేటుకి మారారు. ప్రభుత్వాలు ఏడాదికి రూ.12 లక్షల కోట్ల దాకా ఖర్చు పెడుతున్నాయి. అయినా చదువు రావటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సంక్షోభానికి మూలమేంటో గుర్తించి పరిష్కరించకుండా నినాదాలు, ఆర్భాటపు రాజకీయ ప్రచారాల్లో కొట్టుకుపోతే ఇంకో తరం నష్టపోతుంది.

ప్రస్తుతం భారతదేశంలో మొత్తం ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో సుమారు 26 కోట్ల మంది పిల్లలు చదువు తున్నారు. వీరి విద్యాప్రమాణాలు మెరుగుపడటం మీదే దేశ ఆర్థిక, సామాజిక స్థిరత్వం ఆధారపడి ఉంది.

బిడ్డకి మంచి చదువు వస్తున్నదా, లేదా? అన్నదే విద్యలో ప్రధానాంశం కావాలి. విద్యార్థి కేంద్రంగా ప్రభుత్వ ఆలోచన ఉండాలి. స్కూళ్లలో ప్రమాణాల మీద దృష్టి పెట్టాలి.

ఇదేసమయంలో, పేదల పిల్లలు గతిలేక ప్రయివేటు స్కూళ్లకి వెళుతున్నప్పుడు వారికి ప్రభుత్వ సాయం అందటం అవసరం. ప్రభుత్వమా, ప్రయివేటా అన్నది చూడకూడదు. ఒక్కో బిడ్డ మీద ఏడాదికి రూ.15,000 మేర పరిమితి విధించి, నెలకు రూ.1,000-1500 ఇవ్వొచ్చు. ఓచర్ల రూపంలోనా, మరోటా అన్నది చర్చించుకోవచ్చు. ఇది అదనపు భారం లేకుండానే ప్రభుత్వం చేయవచ్చు. ఇందుకు జేపీ ఒక మార్గం చూపారు. ఉదాహరణకు ఉపాధ్యాయులు

ఏటా 3% మంది రిటైరవుతున్నారు. మన జనాభా పెరుగుదల వేగం తగ్గి నియంత్రణలోకి వస్తూండటం వల్ల క్రమంగా పిల్లల సంఖ్య తగ్గుతుంది. పిల్లల సంఖ్య పెద్దఎత్తున పెరుగుతుండటమనేది పూర్వకాలపు ఆలోచన. ఇప్పటికే మనకు ఒక్కో విద్యార్థికి 17, 18 నిష్పత్తిలో ఉపాధ్యాయులున్నారు. అందువల్ల టీచర్లను కొత్తగా పెట్టుకోకుండా రిటైరైన టీచర్లకు ఏటా ఇచ్చే డబ్బును పేదవిద్యార్థులకు ఇచ్చే ఏర్పాటు చేయవచ్చు. ఇలా ఏడాదికి 5 లక్షల మంది పిల్లలకు ఆర్థిక సాయం అందించవచ్చు. ఇలా చేస్తే ఓ మూడేళ్లలో పేదలందరికీ ఆర్థికసాయాన్ని ప్రభుత్వంపై ఎటువంటి భారం లేకుండా అందించవచ్చు. కాబట్టి ప్రభుత్వమా, ప్రయివేటా అని కాకుండా.. పిల్లలకు మంచి విద్య అందటం, పేద తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా ఉండటం అనేవి గీటురాళ్లు కావాలి. ఇదే ధ్యేయంగా పెట్టుకుంటే విద్యారంగంలో మంచి ఫలితాల్ని సాధించగలం. ఉన్నత విద్యలో ఎంతవరకు చదువుకోవాలని విద్యార్థి అనుకున్నా అంతవరకూ చదువుకునేందుకు పేదరికం అవరోధం కాకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి.

అదేవిధంగా, నేర్చుకున్న విషయాల్ని విద్యార్థి ఒత్తిడి లేకుండా చెప్పగలిగే మూల్యాంకన పద్ధతుల్ని ప్రవేశపెట్టాలి. కాన్సెప్ట్లని, నేర్చుకున్న విషయాల్ని జీవితావసరాలకు ఉపయోగించే శక్తిని, నచ్చినప్పుడు రాసుకునే విధంగా ఉన్న పరీక్షల పద్ధతిలో బేరీజు వేయాలి.

విద్యాప్రమాణాల్ని రాబట్టగలిగే నాణ్యమైన పరీక్షా పత్రాల్ని రూపొందించటం, ఆహ్లాదకరమైన రీతిలో పకడ్బందీగా పరీక్షల్ని నిర్వహించటం చేస్తే చాలు... విద్యారంగంలో సమూల మార్పు దానంతటదే మొదలవుతుంది. ఈ తీరుగా అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని స్వచ్ఛంద సంస్థలు, కొందరు వ్యక్తులు నిర్వహిస్తున్న స్కూళ్లు రుజువు చేస్తున్నాయి. ఫలితాలంటే పరీక్షల్లో వచ్చే మార్కులు కాదు, విద్యార్థి సామర్థ్యాలు గణనీయంగా మెరుగుపడటం.

మన పిల్లలందరికీ అత్యుత్తమ చదువు అందించాలని తల్లిదండ్రులు, టీచర్లు, సమాజంలోని అందరూ అనుకుంటే, క్రియాశీల భాగస్వాములైతే అప్పుడు విద్యారంగం మెరుగవుతుంది, పదేళ్లలో సమూలంగా మారుతుంది. ఎఫ్‌డీఆర్/ లోక్‌సత్తా ఈ దిశగా ఒక బృహత్తర కార్యక్రమానికి చేపట్టింది. పాఠశాల విద్యార్థులకు కీలక సబ్జెక్టులలో కాన్సెప్ట్లు పట్టుబడేందుకు సాంకేతికత సాయంతో కృషి చేస్తోంది. ఇందుకోసం ఈ రంగంలో పనిచేస్తున్న సంస్థలను, ఉపాధ్యాయులను ఒక తాటి మీదకు తీసుకొస్తోంది. పాఠశాలల్లో చదువుతున్న 26 కోట్ల మంది పిల్లల్లో పది శాతం మందికి తొలిదశలో ఈ కాన్సెప్ట్లు చేరినా చాలు. క్రమంగా విస్తరించవచ్చు. ఈ దేశంలో ఓ పెద్ద మార్పుని సాధ్యం చేయవచ్చు.

ప్రజాస్వామ్యంలో బహిరంగ చర్చ, విమర్శలు హేతుబద్ధంగా, వాస్తవాల ఆధారంగా ఉండాలని ఐలయ్య గారికి గుర్తుచేయాల్సి రావటం దురదృష్టకరం. జేపీ కృషిని ఆయన మరింత సమగ్రంగా అధ్యయనం చేసి తన అభిప్రాయాన్ని సరిదిద్దుకుంటారని, అణగారిన వర్గాల అభివృద్ధికి నిజమైన ఎజెండాలో భాగమవుతారని ఆశిద్దాం. ❖

## ఆర్థికవృద్ధి వేగాన్ని పెంచటం, మరింత ఫెడరలిజం, పటిష్ఠ వ్యవస్థలతోనే 2047కి అభివృద్ధి చెందిన భారత్ సాధ్యం

మన దేశం 2029 నాటికి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినప్పటికీ, పేద దేశంగానే ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. ధనిక దేశంగా మారటం అంటే, అభివృద్ధి చెందిన దేశంగా మారాల్సిన అవసరం లేదని, సౌదీ అరేబియాను ఉటంకించారు. 'చాలామంది ఆర్థికవేత్తలు కూడా అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా చాలా తొందరగానే మారుతుందని అంచనా వేశారు. నా దృష్టిలోనూ ఇది కష్టం కాదు. ఎందుకంటే ప్రజలు ఉత్పత్తిని పెంచుతారు. మనది 140 కోట్ల జనాభా ఉన్న దేశం కనుక, ఉత్పాదకత–వినియోగం పెరిగి, ఆర్థిక వ్యవస్థ స్థాయి అంతకంతకూ విస్తరిస్తుంది. అయితే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారినా, పేదరికమూ కొనసాగుతూ ఉంటుంది' అని సుబ్బారావు స్పష్టం చేశారు. ప్రస్తుతం 4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు 332 లక్షల కోట్లు)తో భారత్ అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, కానీ మన తలసరి ఆదాయం 2,600 డాలర్లు (సుమారు రూ.2.16 లక్షలు) మాత్రమేనన్నారు. ఇది ప్రపంచంలో 139వ స్థానం, బ్రిక్స్, జీ–20 దేశాలతో పోల్చి చూసినా ఇది చాలా తక్కువని దువ్వూరి పేర్కొన్నారు. వృద్ధి రేటును మరింత వేగవంతం చేసి, ఆ ప్రయోజనాలను ప్రజలందరికీ అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్నారని, ఇలా మారాలంటే ఆర్థిక వృద్ధి రేటు వేగాన్ని పెంచటంతోపాటు చట్టబద్ధపాలన, బలమైన రాష్ట్రాలు, జవాబుదారీతనం, స్వతంత్రత గల వ్యవస్థలు అవసరం అని సుబ్బారావు పేర్కొన్నారు.

# ఓటు విలువ - ఉచితాలు

- కారుమంచి గణేష్,
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, లోక్‌సత్తా పార్టీ, తెలంగాణ

మన దేశంలో ప్రధాన పార్టీల రాజకీయమంటే ఎన్నికలు, ఎన్నికలంటే ఏదోక రకంగా అధికారంలోకి రావటం లేదా అధికారాన్ని కాపాడుకోవటం, పేదరికాన్ని నిర్మూలించే పేరుతో నిరం తరం కొనసాగించే ఉచితాల్ని పోటాపోటీగా ప్రకటించటం.
అందువల్ల ఎన్నికల సమయాల్లో పౌరులనబడే మనలోని అనేకమంది నిర్భాగ్య ఓటర్లను అమాయకంగా తప్పుదోవ



పట్టించి, ఐదు సంవత్సరాల పాటు అధికారాన్ని చేజిక్కించుకునేందుకు డబ్బు, మద్యం, తాయిలాలు, ఉచితాలు ఎరగా వెదజల్లి ఓటు వేయించుకుంటున్నారు. ఆ తరువాత మనకు కనీస హక్కుగా సకాలంలో అందాల్సిన సేవల్ని, అభివృద్ధి పనుల్ని పొందలేని మన అసమర్ధత, ఉదాసీనత, నిర్లిప్తతకి - అమాయకంగా బలైపోయే ధ్రువపు ఎలుగుబంట్ల జీవితాలకు పెద్ద తేడా లేదు. మీకు తెలుసా, వాటిని చంపటానికి రక్తం పూసిన కత్తులు ఎరగా వాడతారు. ఆ కత్తులపై రక్తాన్ని ఆహారంగా భావించటం వల్ల అవి తమ నాలుక తెగుతున్నా పట్టించుకోవు. క్రమంగా తమ రక్తమే వాటికి ఆహారమవుతుంటుంది. అది గుర్తించలేక తమ రక్తాన్నే తాగటం, చాలా నేలపాలవటంతో అవి జీవచ్ఛవాలై ప్రాణాలొదులుతాయి.
మన రెక్కల కష్టంతో మనకు ఉమ్మడి సేవలే ధ్యేయంగా మనం వ్యక్తిగత ఆదాయాల నుంచి నిజాయతీతో, బాధ్యతతో చెల్లిస్తున్న మన పన్నుల డబ్బులతో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది, ఆదాయ వనరులు, జీతభత్యాలు, హోదాలు పొందుతున్నారు. వీరు నియమితులైననాడు నిజాయతీగా ఉద్యోగ విధులకు, జీతానికి, హోదాకు, అర్హతకి తగిన సేవలను మనందరికీ తప్పనిసరి హక్కుగా అందిస్తామని వాగ్దానం చేస్తారు. కానీ వీరిలో చాలామంది సేవకుల్లా పనిచేయకుండా మన మీద పెత్తనం చేస్తున్నారు. మనం వేసే ఓట్లతో ఎన్నికైన నాయకులు చెలాయిస్తున్న గుత్తాధిపత్య పాలనకు తలొగ్గుతూ వారి ప్రాపకాల కోసం, తద్వారా పొందే పరస్పర లబ్ధి కోసం ప్రజలకు విధిగా అందించాల్సిన సేవల్ని పణంగా పెడుతున్నారు.
సేవలు-అభివృద్ధి పనులలో జవాబుదారీతనం, నాణ్యత లోపించటం, పౌరుల అవసరాలన్నా, సేవలన్నా లెక్కలేనితనంతో కూడిన ఎగతాళిగా విషం కక్కుతున్న ఈవేళ.. అనునిత్యం ఆత్మగౌరవాన్ని చంపుకొని ఈ ప్రభుత్వ వ్యవస్థల అవమానాలను భరిస్తూ, బతుకీడుస్తున్న వైనంపై మనం అంతర్మథనం గావించుకోవాలి.
మనం కల్పించిన ఉద్యోగంలో ఉంటూ సమాజం పట్ల, పన్నులు కట్టి పోషిస్తున్న పౌరుల మీద, కనీస బాధ్యతను విస్మరిస్తున్న దుస్థితిని ప్రశ్నించాలి. మన దైనందిన జీవితాల మనుగడ, ఆ మనుగడలో అంతర్భాగమై మనకు హక్కుగా సకాలంలో అందాల్సిన ప్రభుత్వ సేవలు, పొందగలిగి, పొందవలసిన మార్పు, తద్వారా జరగాల్సిన అభివృద్ధి, ఆ అభివృద్ధి ఫలాలు మనందరికీ సమానంగా హక్కులు వాటంతట అవి అందటానికి మన ఓటును ఉపయో గించుకోవాలి. ఇందుకోసం, మనందరం అహర్నిశలూ చెమటోడ్చి కష్టపడి పోగుచేసిన సొమ్ముల నుంచి అనునిత్యం కడుతున్న వేల, లక్షల కోట్ల రూపాయల పన్నుల డబ్బుపై అయిదు సంవత్సరాల సుదీర్ఘ కాలం కర్రపెత్తనం చేయటానికి ఆయా ఎన్నికల సమయాలలో ఒకరోజు ఆనందం అనిపించే మద్యం, డబ్బు, తాయిలాలను ఎరజూపుతున్న దుర్వ్యవస్థను తిరస్కరించి తిప్పికొట్టాలి. లేకుంటే, మన బతుకులు ధ్రువపు ఎలుగుబంటుల్లాగా మారడం తప్పదు.
కొసమెరుపు: ప్రజాస్వామ్యంలో ఉచితాలు అనేవి ఉండవు. ఎందుకంటే, ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయీ ప్రజలదే. కేవలం సులభంగా అర్థం కావటం కోసమే ఇందులో ఉచితాలు అనే పదం ఉపయోగించాం. మన అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, మనం సేవకులుగా నియమించుకున్న పాలకులు తమ సొంత డబ్బేదో మనకు ఉచితంగా పంచినట్లు చాటుకుంటుంటారు. అందువల్ల ఉచితాలు అని కాకుండా జేపీ చెప్పినట్లు, తాత్కాలిక పథకాలు అనే పదం ఉపయోగిద్దాం. ఎన్నికల్లో ప్రలోభాలు, అసంబద్ధ హామీలు, విభజనలతో గెలిచి, అధికారంలోకి వచ్చాక సంక్షేమం పేరుతో తాత్కాలిక పథకాలనే పరిపాలనగా మార్చేసి అభివృద్ధిని పట్టించుకోని పార్టీలను ఓడిద్దాం, ప్రజలమైన మన చుట్టూ తిరిగే, సంక్షేమంతోపాటు మన ఆర్థిక భవిష్యత్తును కాపాడే పాలననందించే పార్టీలకు ఓటేద్దాం. ❖

# తాత్కాలిక సంక్షేమ పథకాలు ఓట్లు సంపాదించే మార్గాలు కాకూడదు


ప్రభుత్వాలు సంక్షేమం పేరుతో అమలు చేస్తున్న తాత్కాలిక పథకాలు ఓట్లు సంపాదించే మార్గాలు కాకూడదని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రాజనీతి శాస్త్ర విశ్రాంత ఆచార్యులు చిన్నయసూరి పేర్కొన్నారు. గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల తీరుతెన్నులు' అంశంపై నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడుతూ, మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శమన్న అభిప్రాయం ఒకవంక ఉండగా, ఇంకోవంక మన ఎన్నికల్లో విలువలు పతనావస్థకు చేరాయని చిన్నయసూరి అన్నారు. రాజకీయ నాయకులు అవినీతి, ధనార్జన, స్వప్రయోజనాలకే అధికారం చేపడుతున్నారని.. ఇది ప్రజాస్వామ్య పతనానికి సంకేతమన్నారు. చిన్నయసూరి పేర్కొన్న అంశాలు:

**ప్రజలు వాస్తవాలను అంచనా వేసుకోవాలి**

ప్రతి ఓటరు వివరాలు నేతల వద్ద ఉండటం వల్ల ప్రస్తుత ఎన్నికల్లో అక్రమాలకు అవకాశమేర్పడుతోంది. ఫలితంగా ఓటర్లు ప్రలోభాలు, గందరగోళాలకు లోనవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సమాచార విస్తృతి పెరుగుతున్న పరిస్థితుల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. భిన్నాభిప్రాయాలున్న వారు సమష్టిగా ఒక నిర్ణయాన్ని అంగీకరించే అద్భుతమైన ప్రక్రియ ఎన్నికలు. ఓటేసే ప్రతి ఒక్కరూ సమానమే. ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను ప్రజలు ఏర్పాటు చేసుకోవచ్చు, పనితీరు నచ్చకపోతే తిరస్కరించనూవచ్చు. నిర్ణీత కాలానికి స్వేచ్ఛగా, ధర్మబద్ధంగా జరిగే ఎన్నికల్లో ప్రజలు ఏ ప్రభుత్వాన్ని ఎంచుకోవాలో నిర్ణయాన్ని చేసే ప్రక్రియ సజావుగా సాగడం, ప్రతి వ్యక్తి నిర్ణయాన్ని గౌరవించటం జరిగినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ప్రజలు వాస్తవాలను అంచనా వేసుకుని విచక్షణతో ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి.

**భయపెట్టి మద్దతు కోరటం ప్రజాస్వామ్యానికి ప్రమాదం**

ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగటంతోపాటు ప్రజల్లో రాజకీయ పరిజ్ఞానం పెరుగుతోంది. ఇదే సమయంలో రాజకీయ అవినీతి, నిరంకుశ నాయకత్వం, సహజ వనరుల దోపిడీ పెరగడం దురదృష్టకరం. ప్రపంచంలో పలుచోట్ల నిర్బంధ ఓటింగ్‌లో పాల్గొనడంతోపాటు స్వచ్ఛందంగా



పాల్గొనే విధానమూ అమలులో ఉంది. మన దేశంలో కులం, మతం, ప్రాంతాలు, నాయకుల ప్రాతిపదికతోపాటు పార్టీలపై అభిమానం, సిద్ధాంతాలు, భావజాలం చూసి ఓటు వేస్తున్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ దుష్ట సంస్కృతి, పెత్తందారులు, మాఫియా నేతలు భయపెట్టి మద్దతు కోరటం ప్రజాస్వామ్యానికి ప్రమాదం.

**పార్టీల మధ్య మౌలిక విధానాల్లో తేడా కొరవడుతోంది**

దేశంలో పార్టీల మధ్య సైద్ధాంతిక భావజాల అంతరాలు తగ్గిపోవటం వల్ల మౌలికమైన విధానాల్లో తేడా ఉండటం లేదు. ఈ పరిస్థితుల్లో ఓటర్లు సున్నితమైన విశ్లేషణ చేసి ఒకరి కంటే మరొకరు మెరుగ్గా ఉన్నారన్న అంశాలను గుర్తించి ఓటుహక్కును వినియోగించుకోవాలి. పార్టీల్లో వ్యక్తుల ప్రాధాన్యత పెరిగింది. ఈవేళ పార్టీ అంటే ఒక నాయకుడే కనిపిస్తున్నాడు. ఎన్నికల్లో గెలిచిన నాయకులు ప్రజాసమస్యలను పట్టించుకోకుండా స్వప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్నారు. పార్టీలను సొంత ఆస్తులుగా వారసులకు ఇస్తున్నారు.

రాజకీయాల్లో గుత్తాధిపత్యం వల్ల ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్యం పతనమవుతోంది. మెరుగైన ప్రజాస్వామ్యం వైపు పయనానికి ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే నాయకులను ఎన్నుకోవాలి.

జనచైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి, ఏఎన్‌యూ పూర్వ రిజిస్ట్రార్ రంగయ్య, ఏపీ ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి నేత మల్లికార్జునరావు తదితరులు మాట్లాడారు. ❖

# ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామిక పార్టీలు


- రైసా సయాల్

రాజకీయ పార్టీలంటే రకరకాల వ్యక్తుల సమాహారం. ఉన్న వ్యవస్థను ప్రభావితం చేయటం ద్వారా అధికారంలో ఉన్నవారి నిర్ణయాల్ని మార్చేందుకు ప్రయత్నించే పౌరులు, సంస్థలకు భిన్నంగా, అధికారాన్ని పొందటం, ప్రభుత్వ నిర్వహణపై పూర్తి నియంత్రణ సాధించటమే రాజకీయ పార్టీల లక్ష్యం. ఈ లక్షణమే రాజకీయ పార్టీలను ప్రత్యేకమైనవిగా, రాజ్య వ్యవస్థ మనుగడలో కీలకమైనవిగా నిలబెడుతుంది. ఒక దేశంలోపల రాజకీయాలను ప్రభావితం చేసే ప్రధాన శక్తులుగా నిలబెడుతుంది. కొత్త నాయకత్వం, ప్రత్యామ్నాయ విధానాలు, సైద్ధాంతిక మూలాలు ఇవన్నీ రాజకీయ పార్టీల నుంచే మొగ్గ తొడుగుతాయి. పటిష్ఠ, ఆరోగ్యకర ప్రజాస్వామ్యానికి దోహదం చేస్తాయి. అయితే, అప్రజాస్వామిక పార్టీలు ప్రజాస్వామ్యాన్ని నడపగలవా?

భారత రాజకీయ పార్టీలలో కిరీటం ఎవడి నెత్తిన ఉంటే అతనే రాజు. రాజకీయ పార్టీలలో నాయకత్వం చాలా సందర్భాల్లో సభ్యుల మద్దతు లేదా అంతర్గత ప్రజాస్వామ్యం ద్వారా ఎన్నికవదు. ఆశ్రిత పక్షపాతం, వారసత్వం, ఇష్టమొచ్చినవాళ్లని నామినేట్ చేయటం ద్వారా పదవులు భర్తీ చేస్తారు. పార్టీ యంత్రాంగ నిర్వహణ, వనరులు, అభ్యర్థి ఎంపిక, ఏ రకమైన నిర్ణయాధికారమైనా అంతా పైనున్న అగ్రనాయకుల చేతుల్లో లేదా పార్టీలోని కొందరు సంపన్న వ్యక్తుల చేతుల్లో ఉంటుంది. అధికారమంతా పైస్థాయిలోనే తిరుగుతుండటం వల్ల పార్టీలో దిగువ స్థాయి నుంచి ఎదగటానికి ఏ రకంగా అవకాశాలు లేకుండా అడ్డుగోడలు ఏర్పడతాయి. ప్రతిభ, సామర్థ్యం, కొత్త ఆలోచనలుంటే సాధారణ సభ్యుడైనా ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశాలుండే ఇతర సంస్థలకు భిన్నంగా, మన రాజకీయ పార్టీలు రాచరికంలోలా నాయకత్వాన్ని అణగదొక్కుతుంటాయి. సమర్థులైన వ్యక్తులు చురుగ్గా వ్యవహరిస్తూ కొత్త ఆలోచనలతో నాయకులుగా ఎదిగే అవకాశాల్ని నిరోధిస్తుంటాయి. అభ్యర్థుల ఎంపికకు ప్రోత్సాహకాలు తరచూ ప్రజాస్వామ్య వ్యతిరేక దిశలో ఉంటాయి. అభ్యర్థిత్వానికి నిధులు, పార్టీకి విరాళాలు ఇచ్చేందుకు అవసరమైన డబ్బుందా లేదా వారసత్వం, బంధుత్వం ఇలాంటి ప్రాతిపదికలతో ఎంపిక చేస్తుంటారు.

భారత్‌లో ప్రధాన ఎన్నికల పార్టీల అభ్యర్థుల్లో సుమారు 34% మంది రాజకీయాల్లోకి కేవలం కుటుంబ నేపథ్యాన్ని ఉపయోగించుకుని ప్రవేశించారు. వ్యవస్థలో వారసత్వ రాజకీయాలు పాతుకుపోయేలా చేశారు. అటువంటి వ్యవస్థ, రాజకీయాల్లోకి వచ్చేవారిలో ఉండాల్సిన ఒక ప్రధాన అర్హతను విస్మరిస్తోంది; ప్రజా హితం పట్ల బలమైన తపన.

ప్రజాహిత లక్ష్యం కొరవడటం వల్ల రాజకీయాల్లో వికృత




సంస్కృతికి ప్రోత్సాహం ఇంకా పెరుగుతోంది. ఎలాగోలా అధికారాన్ని చేజిక్కించుకునే ధోరణులు పెచ్చరిల్లుతున్నాయి. అధికారం కోసం ప్రత్యర్థి పార్టీల్లోకి తరచుగా ఫిరాయించటం ఓ ఉదాహరణ. దీనివల్ల మన ఎన్నికల రాజకీయాలు ప్రహసనం స్థాయికి దిగజారాయి. రాజకీయ పారీల్లో సైద్ధాంతిక సారూప్యతల రీత్యా పనిచేసేవారే కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసేవారున్నా, ఉన్నకొద్దీ వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఎక్కువవుతోంది. పార్టీ ఎజెండా నిర్ణయించేటప్పుడు, విధానాలు రూపొందించేటప్పుడు, పొత్తులు ఏర్పరచుకునేటప్పుడు, టికెట్ల పంపిణీలో పార్టీ సాధారణ సభ్యులతో చర్చించటం అరుదై పోయింది. రాజకీయాల్లో కొత్త రక్తాన్ని ఎక్కించటానికి అవరోధాల వల్ల పార్టీల్లో పునరుజ్జీవనం సాధ్యం కావటం లేదు. ప్రతిభాసామర్థ్యాలున్న యువత తరచూ తిరస్కరణకు గురవుతున్నారు. ఒకసారి ఎన్నికైన నాయకత్వానికి తన సభ్యులు, ఓటు వేసే ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేకుంటే జవాబుదారీతనం కొరవడి, నాయకత్వం స్వార్థ పూరితమవుతుంది. ఈ రకమైన ధోరణులకు అవకాశమిచ్చే ఏ వ్యవస్థా ఆరోగ్యకర ప్రజాస్వామ్యాన్ని పెంపొందించలేదు.

పాశ్చాత్య దేశాల్లో పరిస్థితులు వేరుగా ఉంటాయి. పరిణతి చెందిన అన్ని ప్రజాస్వామ్య దేశాలూ పార్టీల్లో పటిష్ఠ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటిస్తాయి. తమ నాయకత్వాన్ని బహిరంగంగా, ఏకాభిప్రాయంతో ఎన్నుకుంటాయి. ఉదాహరణకు, అమెరికాలోని జాతీయ పార్టీ నాయకత్వానికి

ప్రభుత్వ వ్యవహారాల్లో ఏ రకమైన పాత్రా ఉండదు. ఏ రకంగానూ పాలనా వ్యవహారాల్ని నియంత్రించటం సాధ్యం కాదు. పార్టీ స్థానిక విభాగాలపై కూడా అగ్ర నాయకత్వానికి ఏరకమైన నియంత్రణా ఉండదు. నిజానికి, అధ్యక్ష అభ్యర్థిని నామినేట్ చేయటంలో స్థానిక పార్టీ సభ్యులు, ప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తారు. పార్టీని విస్తృతస్థాయిలో వికేంద్రీకరిస్తారు. ప్రతిభ, ఆలోచనలు, వ్యక్తిత్వం ఆధారంగా ప్రజాస్వామిక ఆమోదంతో ఎన్నుకుంటారు కాబట్టి పార్టీ నుంచి ఎదిగే నాయకత్వాన్ని కూడా వడపోత గావిస్తారు. జర్మనీలో పార్టీలు తమ అంతర్గత వ్యవహారాలలో ప్రజాస్వామిక పద్ధతుల్ని విధిగా పాటించేలా చట్టం ఉంది. అటువంటి ప్రజాస్వామ్యాలో, రాజకీయ పార్టీల్లో ప్రవేశానికి అవరోధాలు, నచ్చనివారిపై వేటు వేయటం వంటివి వినిపించవు. పార్టీ నాయకత్వం తన అభిప్రాయాల్ని అప్రజాస్వామికంగా రుద్దటం అరుదుగా మాత్రమే కనిపిస్తుంది. ఒకవేళ అలాంటి ప్రయత్నం చేస్తే తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుంది. ఈ ఏర్పాటు వల్ల పార్టీల్లోపల మూడు ప్రధాన లక్షణాలు సమకూరతాయి: సమ్మిళితత్వం, వికేంద్రీకరణ, వ్యవస్థీకరణ.

భారత్‌లో అటువంటి పరిస్థితి లేదు. పార్టీలో ఏ స్థాయి ప్రతినిధయినా తన పదవిని 'హై కమాండ్' చలవగా చెబుతాడు. అన్ని పదవుల్నీ, పార్టీ ప్రాంతీయ, స్థానిక యూనిట్ల పదవుల్ని కూడా పార్టీ నేతలే నామినేట్ చేస్తారు. అగ్రనేతలు మితిమీరి అధికారాన్ని వినియోగిస్తుంటారు. ఒక ప్రాంతీయ నాయకుడికి ప్రజాదరణ లభిస్తే, లేదా ధనస్వామ్య అగ్రనాయకత్వ ఆలోచనకు అనుగుణంగా వ్యవహరించకపోతే, ఆ నాయకుడు/ నాయకురాలిని కింది స్థాయిలోకి నెట్టేస్తారు లేదా పార్టీ నుంచే బహిష్కరిస్తారు.

అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడటం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలు విస్తృతంగా ఉంటాయి. హైకమాండ్ నాయకత్వం వల్ల పార్టీ ప్రతినిధుల మీద పెత్తనంతోపాటు, ఉన్నతస్థాయి నాయకత్వం పనిచేసే పద్ధతి, నాయకత్వాన్ని ప్రదర్శించే తీరు కూడా మారుతుంది. జనాకర్షణ గల నాయకులు అంతా తామే అయి వ్యవస్థల్ని నామమాత్రం చేసినప్పుడు రాజకీయం మౌలిక లక్ష్యాన్ని కోల్పోతుంది. పార్టీలో వ్యక్తి ఆరాధన పెరిగి నాయకుడే పార్టీ అనే పరిస్థితిని ఏర్పడుతుంది. దీంతో సైద్ధాంతికత, విధానాల పట్ల కాకుండా వ్యక్తులకు విధేయులవుతారు. వ్యక్తుల చుట్టూ తిరిగే పార్టీకి ఆదరణ ఆ వేదిక, భావజాలాన్ని బట్టి కాక, నాయకుడి ఆకర్షణ, వ్యక్తిగతాన్ని బట్టి ఉంటుంది. ఈ నాయకుడు పార్టీకి, దేశానికి విలువైన వ్యక్తిగా ప్రచారమవుతాడు. అగ్ర నాయకత్వంలో చిన్నపాటి మార్పు కూడా అరుదవుతుంది. అటువంటి నాయకులు సొంత నియమావళి రూపొందించుకుంటారు, తమ అధికారాన్ని ప్రశ్నించకుండా వ్యవస్థల్ని ఉన్నకొద్దీ నియంత్రిస్తుంటారు. వారి రాజకీయ నిర్ణయాలు భావోద్వేగాలతో, తాత్కాలిక ధోరణులతో ఉంటుంది. ఎటువంటి అంతర్గత ప్రతిపక్షం లేకపోవటం వల్ల, లోతైన చర్చ, విశ్లేషణ లేకుండా తక్షణ నిర్ణయాలు తీసుకుంటారు. అయితే, అటువంటి పార్టీలకు ఎదురయ్యే అతి పెద్ద సంక్షోభం ఆ నాయకత్వాన్ని కోల్పోవటం వల్ల తలెత్తే పరిణామాలు. ఆ స్థానాన్ని వారసత్వంగా భర్తీ చేయటం అరుదు కాబట్టి, ఒకసారి ఆ నాయకుడు పార్టీని వీడితే, గందరగోళం, ఘర్షణ, ప్రజాదరణ కోల్పోవటం వంటివి జరుగుతాయి. అటువంటి నేతల ఉత్థానపతనాలకు చరిత్రే సాక్షి. టర్కీ నేత ఎర్డోగాన్ నిత్య ఉదాహరణ.

మన రాజకీయం, ప్రజాస్వామ్యం నిజమైన పరిణతిని సాధించాలంటే, పార్టీలు తమ పనితీరులో ప్రజాస్వామ్యయుతంగా ఉండాలి. ఒక పార్టీలో దిగువ స్థాయి నుంచి సమర్థులు, నిజాయతీపరులు ఎదిగేందుకు అవకాశం కల్పించటం వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి. ఒకటి, దీనివల్ల అభ్యర్థుల ఎంపిక అవకాశాలు పెరుగుతాయి. కొత్త, సమర్థ నాయకత్వం ఎదిగే అవకాశాలు లభిస్తాయి. రెండోది, అటువంటి పార్టీ, స్థానిక పార్టీ నాయకులు ఎదగటానికి అవకాశమిస్తుంది కాబట్టి, స్థానిక కార్యకర్తలతో, అట్టడుగు స్థాయి వాస్తవాలతో, ఓటర్ల మధ్య సంభాషణ, చర్చలు పెరిగి ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో మార్పు వస్తుంది. మూడోది, డబ్బు, కండబలం, లేదా కుటుంబ బాంధవ్యాలు రాజకీయాల్లోకి ప్రవేశాన్ని శాసించవు కాబట్టి, జనహితం, నైపుణ్యం, ప్రజాదరణ ద్వారా ఎదుగుతారు కాబట్టి, రాజకీయాల్లో ప్రవేశానికి వ్యక్తులకు ప్రోత్సాహకాలు మారతాయి. చట్టం లేదా వ్యవస్థీకృతం చేయటం ద్వారా భారతదేశ పార్టీలలో అటువంటి పద్ధతుల్ని చాలా సులభంగా పాదుకొల్పవచ్చు.

జర్మనీ తరహాలో, రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని విధిగా అమలు చేసేలా రాజ్యాంగ చట్టం తీసుకురావచ్చు. దీంతోపాటు, పార్టీల లోపల ప్రాథమిక ఎన్నికల్ని, అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పర్యవేక్షించే బాధ్యతను ఎన్నికల సంఘానికి అప్పగించవచ్చు. మంచి పార్టీ రాజకీయాలు మంచి దేశ రాజకీయాలకు గ్యారంటీ ఇస్తుంది. అప్రజాస్వామిక రాజకీయ పార్టీ ప్రజాస్వామ్య సమాజాన్ని నిర్మించలేదు, కొనసాగించలేదు, బలోపేతం చెయ్యలేదు. మెరుగైన భారత ప్రజాస్వామ్యానికి మెరుగైన పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం తప్పనిసరి. ❖

# దేశం ఆర్థికంగా ఎదగాలి, అందుకు మనమేం చేయాలి?

శ్రీరామ్ ఎస్.

ఒక దేశం ఆర్థికంగా ఎదగాలంటే ప్రజలు తమ ఆదాయాలు పెరగటానికి కావాల్సిన ఉద్యోగ, వ్యాపారాలు చేస్తూ ఆర్థిక భద్రతను ఏర్పరచుకోవాలి. ఉపాధి, వ్యాపారాలు ఏ రంగంలో ఎక్కువగా చేస్తే ఒక దేశం ఆర్థికంగా ఎదగగలదో తెలుసా?

**తృతీయ శ్రేణిలో!**

కొంచెం వివరిస్తాను. ఆర్థిక రంగం ప్రథమ, ద్వితీయ, ఇంకా తృతీయ శ్రేణిగా విభజించబడింది.

ప్రథమ శ్రేణి: వ్యవసాయం, గనులు, అడవి నుంచి కలప, పశు పెంపకం, మత్స్య పెంపకం ఇలాంటి భూ ఆధారిత పనులు ప్రథమ శ్రేణిలోకి వస్తాయి.

**ద్వితీయ శ్రేణి:** అన్ని రకాల తయారీ పరిశ్రమలు ఈ శ్రేణిలో ఉంటాయి. ప్రథమ శ్రేణి రంగంలో నుండి వచ్చే ముడి పదార్థాలతో వస్తువుల తయారీ ఈ రంగంలో ప్రధానమైన భాగం.

**తృతీయ శ్రేణి:** సేవారంగం వ్యాపారాలు దీనిలోకి వస్తాయి. ఆర్థిక రంగ సేవలు, వినూత్నమైన కొత్త సేవలు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా ఈ శ్రేణిలో భాగమే.

దేశానికి లేదా వ్యక్తికి తృతీయ శ్రేణిలో ఆదాయం ఎక్కువ ఉంటుంది. భారతదేశంలో 47% మంది వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. అయితే వ్యవసాయం మీద వచ్చేది దేశ ఆదాయంలో15% మాత్రమే. అంటే ఉండవలసిన దానికంటే మూడు రెట్లు ఎక్కువమంది వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు.

ఒక వ్యక్తి ప్రథమ శ్రేణి నుండి ద్వితీయ శ్రేణికి, ఇంకా తృతీయ శ్రేణి నుండి తృతీయ శ్రేణికి మారాలంటే చదువు, ఇంకా నైపుణ్యం పెంపొందించుకోవాలి. నైపుణ్యం పెంపొందించుకోవాలంటే దాని కోసం కొంత సమయం కొన్ని రోజులు లేదా నెలల పాటు వెచ్చించవలసి ఉంటుంది.

అలా సమయం వెచ్చించాలంటే అటువైపుగా ఆసక్తి ఉండాలి. ఎక్కడ నైపుణ్యం పెంపొందించుకోవచ్చో తెలుసుకోవాలి. నైపుణ్యం పెంపొందించుకొనే విషయంలో పేదవారికి ఒకరకమైన ఇబ్బందులు, మధ్యతరగతివారికి వేరే ఇబ్బందులు. పేదవారు రోజు గడవడానికి ఇబ్బంది పడుతున్నప్పుడు పురోగతి గురించి ఆలోచించడం కష్టమైన విషయమే. దీనికి తోడు ఈ పేదవారిలో అనారోగ్యం పాలవడం వల్ల, ఇంకా ఆస్పత్రికి అయ్యే ఖర్చుల వల్ల మన దేశంలో ప్రతి సంవత్సరం 5.5 కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారు.

**ఇలా జరగకుండా ఉండాలంటే ప్రభుత్వం ఏం చేయాలి?**

1) ఆరోగ్య వ్యవస్థ మీద మన దేశ ఖర్చు బాగా తక్కువగా, జీడీపీలో 1.3% మాత్రమే ఉంది. అంచెలంచెలుగా ఆ ఖర్చుని 3% దాకా పెంచాలి. ప్రాథమిక ఆరోగ్య సేవలు మెరుగుపరచడం మీద ధ్యాస పెట్టాలి. ఇంకా ప్రభుత్వం కల్పిస్తున్న ఆరోగ్య బీమా ద్వారా వస్తున్న డబ్బులు కాక ప్రైవేటు ఆస్పత్రులు అదనంగా వసూలు చేసే పద్ధతిని అరికట్టాలి.

2) వ్యవసాయం మీద మాత్రమే ఆధారపడేవారు వేరే వృత్తుల్లోకి వెళ్లటానికి కావలసిన నైపుణ్యం పెంపొందించుకోవటానికి కావలసిన శిక్షణను ప్రభుత్వం పెద్దఎత్తున చేపట్టాలి.




ప్రభుత్వం ఈ బాధ్యతలు నెరవేర్చేలా మనం గట్టి ప్రయత్నం చేయాలి.

**ఇక మధ్యతరగతి**..... ఆర్థిక పురోగతి కోసం చేయవలసిన నైపుణ్యం పెంచుకోవడం, బాగా గిరాకీ ఉన్న సేవలు లేదా వస్తువుల రంగంలోకి వెళ్లడం, తర్వాత తరానికి ఉన్నతమైన విద్య ఇవ్వడం వంటివి బాగానే చేస్తున్నారు. ఇవి సరిగ్గా అందరూ చెయ్యటం వల్ల నెలసరి ఆదాయం పెరుగుతుంది, ఆదా లేదా ఇన్వెస్ట్ చేసే శక్తి కూడా పెరుగుతుంది.

ఇంకా ఏమి చేయాలి? సరిపడా ఆరోగ్య బీమా, తగినంత జీవిత బీమా తీసుకోవాలి. సాంప్రదాయమైన ఇన్వెస్ట్‌మెంట్స్ అయిన ఎఫ్.డి, బంగారం, భూమితోపాటు మ్యుచువల్ ఫండ్స్, స్టాక్స్‌లో కూడా ఇన్వెస్ట్ చేయాలి.

**నేను ఈ విషయంలో దేశం కోసం ఏమి చేయవచ్చు?**

మీరు మీ రంగంలో గానీ వేరే రంగంలో గానీ ఎలా ఎక్కువ సంపాదించవచ్చో ఆలోచించండి. ప్రథమ శ్రేణిలో ఉంటే ద్వితీయ శ్రేణికి, ద్వితీయ శ్రేణిలో ఉంటే తృతీయ శ్రేణికి ఎలా వెళ్లాలో ఆలోచించండి. మనం బాగా సంపాదిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడినట్టే. దీని గురించి అవగాహన లేని వారికి వాళ్ల జీవితంలో ఆర్థికంగా ఎక్కువ సంపాదించడం ఎలాగో చెప్పండి. వాళ్ళు ఎక్కువ ఎలా సంపాదించాలో మార్గం చూపించండి.

ఇంకా పదిమంది పేదవారికి లేదా మీ దగ్గర పనిచేస్తున్నవాళ్లకి ఆరోగ్య బీమా గురించి అవగాహన కల్పించండి. ప్రభుత్వం ఇస్తున్న బీమాలో గాని, ప్రైవేటు రంగ బీమాలో కానీ నమోదు చేయించండి. అలాగే జీవిత బీమా కూడా...

మనతోపాటు చుట్టూ ఉన్న పదిమంది ఎదుగుదలకి తోడ్పడటమే దేశసేవ. ❖

# ఆరోగ్యం - పాఠశాల విద్య

- ప్రొఫెసర్ కె.శ్రీనాథరెడ్డి,
వైద్య రంగ నిపుణులు

ఆరోగ్యమే మహాభాగ్యం. అది జీవితాంతం మనిషికి తోడుగా ఉంటుంది. వ్యక్తి అభివృద్ధిలో ఇదే కీలకాంశంగా నిలుస్తుంది. మంచి అలవాట్లే మన ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఆరోగ్య సంరక్షణపై సరైన అవగాహనకు బీజం పాఠశాల దశలోనే పడాలి. పాలకులు దీనిపై దృష్టి సారించాలి.



మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నా, పనీపాటలు చేసుకోవాలన్నా, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలన్నా, కుటుంబంతో బంధుమిత్రులతో ఉల్లాసంగా గడపాలన్నా ఆరోగ్యంగా ఉండటం తప్పనిసరి. తీర్థయాత్రలు, విహారాలు జరపాలన్నా ఆరోగ్యవంతులకే సాధ్యం. విద్యార్జనతో సరైన ఉపాధి పొంది ఆదాయం ఆర్జించడానికి, క్రీడల్లో, కళల్లో రాణించడానికి ఆరోగ్యమే మూలం. ఈ సంగతి గ్రహించకుండా దురలవాట్లు చేసుకుంటే ఆరోగ్యం దెబ్బతినిపోతుంది. ఆరోగ్యవంతమైన జీవనవిధానమంటే ఏమిటో చాలామందికి తెలియదు. ఒకవేళ తెలిసినా చాలామంది అశ్రద్ధ చేస్తుంటారు. వ్యాధులు, అకాల మరణాలకు దారితీసే సామాజిక, ఆర్థిక, పర్యావరణ పరిస్థితుల గురించీ అందరికీ సరైన అవగాహన ఉండదు. ఫలితంగా వారు స్వీయ ఆరోగ్యాన్ని, కుటుంబ, సమాజ శ్రేయస్సునూ అలక్ష్యం చేస్తుంటారు. వ్యక్తిగత, సామాజిక వికాసానికి విద్యే కీలకమని ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ఉద్ఘాటిస్తోంది. 2015 నాటి ఇంజాన్ ప్రకటన విద్యావికాసం అత్యంత ఆవశ్యమని ప్రకటించింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో నాణ్యమైన విద్యకు నాలుగో స్థానం దక్కింది. విద్య సముపార్జనకు అనారోగ్యం ఆటంకం కలిగిస్తుంది. విద్య, ఆరోగ్యాల మధ్యనున్న అవినాభావ సంబంధాన్ని గుర్తించి తదనుగుణమైన విధానాలను అవలంబించడం తప్పనిసరి. పాఠశాలలో విద్యాభ్యాస కాలం బాలబాలికలకు ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పడానికి చాలా అనువైనది.

## పెద్దల్లో మార్పు

వ్యక్తిగత శుభ్రత, పారిశుద్ధ్యం, పోషకాహారం, వ్యాయామం, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాల్సిన అవసరం, మానసిక ఒత్తిడిని జయించడం, తోటివారితో సామరస్యంగా స్నేహంగా మెలగడం పాఠశాలే నేర్పిస్తుంది. ఘర్షణ వాతావరణాన్ని నివారించడం, లింగ భేదాలకు తావివ్వకపోవడం తదితరా లనూ నేర్చుకునే అవకాశాల్ని విద్యాలయమే కల్పిస్తుంది. రహదారి భద్రత, ప్రాథమిక చికిత్స తదితరాల్లో మెలకువలనూ పాఠశాలల్లోనే బోధించాలి. పాఠశాల ప్రాంగణాల్లో పచ్చదనం, తరగతి గదులలో ధారాళంగా గాలి, వెలుతురు, ఆట మైదానాలు విద్యార్థి వికాసానికి తోడ్పడతాయి. దివ్యాంగులైన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. యోగా, ధ్యానాల అభ్యాసానికి ఏర్పాట్లు చేయాలి. బాలల్లో దృష్టి, శ్రవణ లోపాలను ముందే గుర్తించడానికి పాఠశాలల్లో తరచూ పరీక్షలు చేసి ఉపశమన చర్యలు తీసుకోవాలి. తద్వారా విద్యార్జనకు శారీరక లోపాలు అడ్డురాకుండా జాగ్రత్త పడాలి. మానసిక, శారీరక సమస్యలను అధిగమించడానికి తోటి విద్యార్థులు సహాయపడే వాతావరణాన్ని సృష్టించాలి.

**ప్రాథమిక విద్యతో మొదలుపెట్టి ఉన్నతస్థాయి వరకు విద్యార్థులు జీవన నైపుణ్యాలను నేర్చుకొనే వాతావరణాన్ని విద్యాలయాల్లో కల్పించాలి. పాఠ్యాంశాలు, పాఠ్యేతర కార్యక్రమాలు, బృంద చర్చలు, భాగస్వామ్యాల ద్వారా విద్యార్థులు మంచి జీవితానికి పునాదులు వేసుకో గలుగుతారు. స్వయంగా విషయ పరిజ్ఞానం సాధించేలా వారిని సన్నద్ధుల్ని చేయాలి. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ఎందుకు అనుసరించాలో వారికి తెలియజెప్పి తమంతట తాము మంచి అలవాట్లు అలవరచుకునేలా తీర్చిదిద్దాలి. ఎలాంటి పనులు చేయాలనేది మాత్రమే కాకుండా ఎందుకు చేయాలో కూడా పిల్లలకు అర్థమయ్యేలా నూరిపోయాలి.**

ఈ విధంగా వారిలో పాదుకునే సహానుభూతి రేపు పెరిగి పెద్దయ్యాక చక్కని సామాజిక సంబంధాలు నెరపడానికి, సామాజిక సామరస్యం నెలకొనడానికి తోడ్పడుతుంది. పాఠశాలల్లో ఆరోగ్యవంతమైన జీవనశైలి గురించి నేర్చుకున్న విద్యార్థులు తమ కుటుంబంలోని పెద్దలకూ దానిపై అవగాహన కల్పించగలుగుతారు. వారూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించేలా ప్రేరణ ఇవ్వగలుగుతారు. దీనికి సంబంధించిన సంభాషణా నైపుణ్యాన్ని పిల్లలకు పాఠశాలల్లోనే అలవరచాలి. ఉదాహరణకు ధూమ, మద్యపానాల వల్ల కలిగే అనర్థాలను తమ పిల్లల ద్వారానే పెద్దలు గ్రహిస్తే, వారి ప్రవర్తనలో తప్పక మార్పు వస్తుంది. దురలవాట్లను వదిలించుకుని తగిన వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకొనేలా తల్లిదండ్రులను పురిగొల్పడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించగలుగుతారు.

ప్రాథమిక విద్యతో మొదలుపెట్టి ఉన్నతస్థాయి వరకు విద్యార్థులు జీవన నైపుణ్యాలను నేర్చుకొనే వాతావరణాన్ని విద్యాలయాల్లో కల్పించాలి. పాఠ్యాంశాలు, పాఠ్యేతర కార్యక్రమాలు, బృంద చర్చలు, భాగస్వామ్యాల ద్వారా విద్యార్థులు మంచి జీవితానికి పునాదులు వేసుకో గలుగుతారు. స్వయంగా విషయ పరిజ్ఞానం సాధించేలా వారిని సన్నద్ధుల్ని చేయాలి. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ఎందుకు అనుసరించాలో వారికి తెలియజెప్పి తమంతటతాము మంచి అలవాట్లు అలవరచుకునేలా తీర్చిదిద్దాలి. ఎలాంటి పనులు చేయాలనేది మాత్రమే కాకుండా ఎందుకు చేయాలో కూడా పిల్లలకు అర్థమయ్యేలా నూరిపోయాలి. ఇది ఇంట్లో కన్నా బడిలోనే సుసాధ్యమవుతుంది. తల్లిదండ్రులకన్నా ఉపాధ్యాయులకే ఇలాంటి విషయాల్లో ఎక్కువ పరిజ్ఞానం ఉంటుంది. తోటివారిని చూసీ నేర్చుకునే వెసులుబాటు ఉంటుంది. లింగ దుర్విచక్షణకు తావివ్వకూడదని, లింగపరమైన సమానత్వం ఆధునిక సమాజానికి ఆవశ్యకమని విద్యార్థులకు బోధించాలి.

**క్రియాశీల పాత్ర పోషించేలా...**

ప్రభుత్వం విద్యావైద్యాలకు సమధిక నిధుల కేటాయింపు చక్కటి ఫలితాలనిస్తుంది. ఇతర రంగాల్లో ప్రభుత్వం చేపట్టే విధానాలు, కార్యక్రమాలూ ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఈతరంవారి ఆరోగ్య సంరక్షణకు తోడ్పడే విధానాలను పాఠశాల స్థాయితో మొదలుపెట్టి భవిష్యత్తులోనూ కొనసాగించేలా విధానకర్తలు చొరవ చూపాలి. పొగాకు నియంత్రణకు, వాయుకాలుష్య కట్టడికి, పాఠశాల ప్రాంగణాల్లో ధూమపాన నిషేధానికి విద్యార్థులు తరచూ ఉద్యమ ప్రాతిపదికపై కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. పాఠశాల వంటగదుల కోసం కూరగాయల తోటలు సాగుచేయడం, చెట్లను పెంచి పర్యావరణాన్ని సంరక్షించడమూ ఈ కోవలోకే వస్తాయి. వాతావరణ మార్పులు ఈతరం మీదనే కాకుండా రేపటి తరాలపైనా విషమ ప్రభావం చూపనున్నాయి. వాయు, జల, భూ కాలుష్యాలు ఆహార, ఆరోగ్య భద్రతకు ముప్పు తెస్తున్నాయి. పర్యావరణ నష్టం జనసమూహాల మధ్య పరిమిత వనరుల కోసం ఘర్షణలను పెంచుతోంది. వ్యక్తులు, సమాజాల మానసిక, శారీరక ఆరోగ్యాలను దెబ్బతీస్తోంది. కాబట్టి రేపటి పౌరులైన విద్యార్థులు వాతావరణ మార్పుల నిరోధంలో ఇప్పటి నుంచే క్రియాశీల పాత్ర పోషించేలా విద్యాలయాలు చొరవ తీసుకోవాలి. మానవ శరీరంపై ఆహార విహారాలు, పర్యావరణం చూపే ప్రభావం గురించి విద్యార్థులకు క్షుణ్నంగా బోధించాలి. తద్వారా వారు వివేకవంతమైన నిర్ణయాలు తీసుకుని ఆచరించేలా సంసిద్ధుల్ని చేయాలి.

## పిల్లల క్షేమం కోసం


పాఠశాలల్లో సుశిక్షిత నర్సులతో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరం. జ్వరాలు, మూర్ఛ, రుతుక్రమ సమస్యలకు సకాలంలో సలహాలు, చికిత్స ఇచ్చి ఉపశమనం కలిగించవచ్చు. జువెనైల్ డయాబెటిస్ ఉన్న పిల్లల్లో చక్కెర స్థాయి తగ్గిపోతే తక్షణమే నివారణ చర్యలు తీసుకోవడం వీలవుతుంది. ఇలాంటి ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు అవకాశంలేని చోట్ల ఉపాధ్యాయులకే ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వాలి. తద్వారా చిన్నపాటి ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం, అత్యవసర కేసుల్లో వేగంగా స్పందించడం సులువవుతుంది.

**(కర్టెసీ: ఈనాడు)**

# సర్ ఆర్థర్ కాటన్ నుంచి జేపీ దాకా

- సంతోషిణి

ప్రజాధనాన్ని ఎలా సద్వినియోగం చేయాలి? అంశం ఒక ఎజెండాగా బహిరంగ చర్చాంశం కావటం బహుశా 2024 ఎన్నికల్లోనే జరుగుతోందేమో. దేశానికి ఆర్థికాభివృద్ధి అవసరం అని 1991 ప్రాంతంలోనే గుర్తించాంగానీ, ఆ అభివృద్ధిని కొనసాగించే విషయంలో, అందుకు అవసరమైన ఆర్థిక క్రమశిక్షణ విషయంలో ఇంకా మనదేశంలో ఏకాభిప్రాయం రాకపోవటం వల్ల ప్రజాధనం సద్వినియోగానికి, సంక్షేమం పేరుతో తాత్కాలిక పథకాలకు పందేరం కావటానికి మధ్య తేడాను మనం ఇంకా స్పష్టంగా గుర్తించలేకపోతున్నాం. ఈ తేడాను 1970లలోనే గుర్తించటం వల్ల చైనా ఎంత లాభపడిందో, విస్మరించటం వల్ల భారత్ ఎంత నష్టపోయిందో వివరిస్తూ, వచ్చే పాతికేళ్లపాటు ఉన్న ఓ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవటం ద్వారా భారత్ ఆర్థిక శక్తిగా ఎదగటాన్ని కీలక ఎజెండాగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రస్తుత ఎన్నికల్లో ప్రజల ముందుకు తీసుకొచ్చారు. మనం ఈ నేపథ్యం నుండి పోలవరం, కాళేశ్వరం మొదలైన ప్రాజెక్టుల్లో అవినీతి, దుబారా, జాప్యం, సంక్షేమమే పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం అనే రాజకీయ ధోరణుల్ని చూడాలి. పార్టీలు, నేతల మధ్య విమర్శల రాజకీయ డ్రామాలో చిక్కుకోకుండా, ఆయా అంశాల్లోని వాస్తవాల్ని స్పష్టంగా తెలుసుకుని దీర్ఘకాల భవిష్యత్తు కోసం ఓటును వినియోగించుకోవాలి. ఈ క్రమంలో సర్ ఆర్థర్ కాటన్ కృషి సైతం మనకు ఎంతో ఉపయోగపడుతుంది.



ఒక ఇంజినీర్‌గా, ప్రజాసేవకుడిగా, నిరంతర అధ్యయనం, స్థానిక అవసరాలను స్పష్టంగా గుర్తించటం, సాంకేతిక నైపుణ్యాల్ని అందిపుచ్చుకోవటం, పరిష్కారాల్లో కొత్తపుంతలు తొక్కటం వంటి పద్ధతుల ద్వారా ఆర్థర్ కాటన్ భారత్‌లో కరవును పారదోలేందుకు, వ్యవసాయాభివృద్ధికి సాగునీటి రంగంలో ప్రామాణిక కృషి చేశారు.

ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ ఖ్యాతిని అందుకోవటానికి మూలమైన గోదావరి డెల్టా గురించి ఈవేళ్టి తరం ఊహించటం కూడా కష్టమైన పరిస్థితులు ఆర్థర్ కాటన్ కాలంలో ఉండేవి. ఆయన ఇంజినీర్‌గా భారత్‌కి వచ్చే సమయానికి డెల్టా తీవ్రమైన కరవులు, వరదల మధ్య డెల్టా ప్రాంత జనాభా క్షీణిస్తుండేది. 1831లో రోజులతరబడి భారీ వర్షాలు కురిశాయి. తరువాతి సంవత్సరాలలో తుపాను, ఆ తర్వాత కరవు. దీనికితోడు, ఇంగ్లండ్‌లోని పరిశ్రమల నుంచి ఉత్పత్తి అయ్యే పత్తి దుస్తుల వల్ల గోదావరి చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థానికంగా చేతివృత్తులవారు తయారుచేసిన వస్త్రానికి డిమాండ్ తగ్గింది. రెవెన్యూ వ్యవస్థ కుప్పకూలి ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయింది. తక్షణ చర్యలు తీసుకోకపోతే అటు ప్రజల జీవనం, ఇటు ప్రభుత్వ ఆదాయం రెంటికీ తీవ్రనష్టం వాటిల్లుతుందని కాటన్ నివేదిక ఇచ్చి ఆనకట్ట నిర్మాణానికి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒప్పించారు. నిధులు, మానవ వనరులు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రతిష్ఠాత్మకంగా ఆనకట్ట నిర్మాణాన్ని ప్రారంభించారు. నిర్మాణానికి కాటన్ అనుసరించిన విధానం వినూత్నమైనది. స్థానికంగా లభించే సామాగ్రిని సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగించారు. ప్రపంచంలోని పురాతన నీటి మళ్లింపు నిర్మాణాలలో ఒకటిగా పరిగణించబడే గాంధీ ఆనకట్టను (2వ శతాబ్దం) పటిష్ఠం చేసే సందర్భంలో చోళులు నిర్మించిన పద్ధతిని చూసి దానిని కాటన్ అనుకరించారు. స్థానిక కమ్యూనిటీలతో కలసిమెలసి, వారి నైపుణ్యాన్ని గుర్తించి, నీటిపారుదల ప్రాజెక్టు అమలులో వారిని భాగస్వామ్యం చేశారు. 1845లో ప్రారంభించి 1852లో ధవళేశ్వరం ఆనకట్టను పూర్తి చేశారు. ఇది ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా చరిత్రలో నిలిచిపోయింది. అంతకంటే గొప్ప విషయం, బ్రిటిష్‌వారిని రాజకీయంగానే కాకుండా, సామాజికంగా కూడా అప్రాచ్యులంటూ వ్యతిరేకించే వర్గాల ప్రజానీకం సైతం ఆర్థర్ కాటన్‌ని తమ కుటుంబ సభ్యుడిగా భావించేలా, 270 కిలోమీటర్ల కాల్వలతో కలిపి 3.65 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకువచ్చి 10 లక్షల ఎకరాలకు పైగా సాగునీరును ఈ బ్యారేజీ అందించింది. ఒకప్పటి కరవు, వరదల ప్రాంతాన్ని సంపన్న వ్యవసాయ కేంద్రంగా మార్చింది. కృష్ణా వరకు విస్తరించి ఉన్న గోదావరి మీదుగా కాలువలు వేయడం వలన, స్థానిక సగటు ఆదాయం 250% పెరిగింది. నీటి సమృద్ధి కారణంగా పంటలు మరియు ఆహార విధానం మొక్కజొన్న ఆధారితం నుండి వరి ఆధారితంగా మారింది. బ్రిటిష్ ఇండియాలో ప్రభుత్వోద్యోగిగా కాటన్ కృషి వల్ల తమిళనాడు ప్రాంతం కూడా లబ్ధిపొందినా, తెలుగువారికి ఆ అదృష్టం ఎక్కువగా దక్కింది. నదులను అనుసంధానం చేయడం ద్వారా ఎక్కడ వీలుంటే అక్కడ భారతదేశమంతా నీటి సౌకర్యం కల్పించాలని కాటన్ గొప్ప ఆలోచన చేశారు.

భారతదేశం రుతుపవన ఆధారిత దేశం. జీవనదుల మీద ఆనకట్టలు అవసరం. అయితే ఆ ప్రాజెక్టులు ప్రజలకు లాభం చేకూర్చేలా ఉండాలి. అంటే, వ్యవసాయం కోసం ఓ ప్రాజెక్టు



కడితే, దాని వల్ల సాగులోకి వచ్చే భూముల ఆదాయం ఆ ఆనకట్టకయ్యే ఖర్చు ఎక్కువ ఉండాలి. ఆదాయం కంటే పెట్టుబడి అనేకరెట్లు ఎక్కువైతే, ఆ ప్రాజెక్టు రైతులకు, రాష్ట్రానికి, చివరకు దేశానికి పెనుభారమవుతుంది. కాళేశ్వరం విషయంలో జరిగిందదే. అదేవిధంగా, ఒక ప్రాజెక్టు లాభసాటైనా నిర్మాణం సంవత్సరాలు, దశాబ్దాల తరబడి కొనసాగటం వల్ల ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. సకాలంలో పూర్తి చేసే నైపుణ్యాన్ని, పాలనా సామర్థ్యాన్ని, సంకల్పాన్ని ప్రదర్శించకుంటే వచ్చే నష్టానికి పోలవరం స్పష్టమైన ఉదాహరణ. పెట్టుబడికి అనేక రెట్లు దీర్ఘకాల లాభం వచ్చేలా, నిర్దేశించిన వ్యవధిలోనే ప్రాజెక్టు పూర్తయ్యేలా గోదావరిపై ధవళేశ్వరం వద్ద ఆర్థర్ కాటన్ ఆనకట్ట నిర్మించారు.

సాగునీటి ప్రాజెక్టుల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం సాధించటం, ప్రభుత్వ ధనాన్ని పవిత్రంగా భావించి సద్వినియోగం చేయటంలో సర్ ఆర్థర్ కాటన్‌ని చూస్తే మనకు స్వతంత్ర భారతదేశంలో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కృషి గుర్తుకొస్తుంది.

ఆర్థర్ కాటన్ తరహాలో జేపీ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో నీటిపారుదల వ్యవస్థను పటిష్ఠం చేశారు. ఆయన ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా పనిచేసే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రాంతి పథం పథకాన్ని ప్రకటించింది. మిగతా జిల్లాల్లో ఇదో మొక్కుబడి పథకంగా కొనసాగగా, జేపీ వినూత్నంగా ఆలోచించి ప్రకాశంలో సాగునీటి వసతికి శాశ్వత ఏర్పాటు చేసే అవకాశంగా మలిచారు. ఆర్థర్ కాటన్ కంటే అదనంగా ప్రజాస్వామ్యంలోని శక్తిని ఇక్కడ కీలక వనరుగా జేపీ వినియోగించారు. తమ ప్రాజెక్టుల నిర్మాణాన్ని తామే పర్యవేక్షించుకునేలా స్థానిక ప్రజలకు అధికారం ఇచ్చారు. బ్యాంకుల నుంచో, మరొకరి నుంచో వారికి అవరోధాలు లేకుండా చూడటం మేరకే జేపీ పరిమితమయ్యారు. వెనకబడిన ప్రాంతం వాళ్లనే ముద్రను సవాలు చేసేలా, అవకాశమిస్తే ప్రపంచంలోని ఏ ప్రాంత ప్రజలకూ తాము తక్కువ కాదని నిరూపించేలా ప్రకాశం జిల్లా రైతులు స్పందించారు. ప్రజల చేతికి అధికారమిస్తే ఏ రీతిలో అద్భుతాలు సాధ్యమో నిరూపించారు. ప్రజలే ప్రభువులని ప్రజాస్వామ్య మౌలిక సూత్రాన్ని చాటిచెప్పారు. ఎలాంటి అదనపు గ్రాంట్లు లేదా వనరులు లేకుండా మొత్తం 453 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మరియు 2800 బోర్‌వెల్‌లు రెండేళ్ల స్వల్ప వ్యవధిలో పూర్తి చేశారు. ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు, ఎకరాకు కేవలం 2000 రూపాయలలో పూర్తి చేశారు. ఈ క్రమంలో రైతులు తాము తీసుకున్న ప్రతి రూపాయినీ తిరిగి చెల్లించారు, నిర్ణీత సమయం కంటే ముందే చెల్లించారు.

స్వతంత్రానికి ముందు ఆర్థర్ కాటన్, స్వతంత్ర భారతంలో డాక్టర్ జేపీ ఇద్దరూ రైతులకు, దేశానికి లాభసాటి ఫలితాలు అందేలా తక్కువ ఖర్చుతో ప్రాజెక్టులను నిర్మించారు. నిర్ణీత వ్యవధిలో పూర్తి చేశారు. ఈ ప్రమాణాలను అరుదుగా, కొందరు అధికారులు, నేతలు మాత్రమే పాటించే విలువలకు పరిమితం చేయకూడదు. ప్రజాజీవితంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుసరించేలా వీటిని వ్యవస్థీకృతం చేయాలి. ప్రాజెక్టుల్లో ఇప్పటివరకూ జరిగిన పొరపాట్లను సరిదిద్దుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టుని పునస్సమీక్షించి మరింత నష్టం లేకుండా ఎలా వినియోగించుకోవాలో హేతుబద్ధంగా నిర్ణయించాలి. అలవిమాలిన నిర్లక్ష్యం కారణంగా వాయిదా పడుతూ వస్తున్న పోలవరం నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలి.

అదేవిధంగా ప్రజాసేవకులుగా పాలకులు, ప్రభుత్వోద్యోగులు ప్రజాధనంలో ప్రతి రూపాయి సద్వినియోగం చేస్తే అద్భుతాలు ఎలా సాధ్యమో సర్ ఆర్థర్ కాటన్, జేపీ ఆచరణలో చూపారు. ఎలాగోలా అధికారంలోకి రావటం కోసం ప్రజలకు సంక్షేమం పేరుతో తాత్కాలిక పథకాల్ని ఎడాపెడా ప్రకటిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నవారికి ఇకనైనా మనం బుద్ధి చెప్పాలి. సొంత వార్షిక ఆదాయం నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలి తప్ప అప్పు చేసి సంక్షేమ పథకాలు లేకుండా, అప్పు తెచ్చిన డబ్బు కేవలం ఆస్తుల నిర్మాణానికి వినియోగించేలా చట్టపరంగా నిబంధన ఏర్పాటు చేయాలి. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించాలి. అదేవిధంగా భవిష్యత్ తరాల కోసం ఆస్తుల నిర్మాణంలో కూడా కాళేశ్వరం తరహాలో దుర్వినియోగం కాకుండా అప్పు తెచ్చిన ప్రతి రూపాయి ఫలితమిచ్చేలా పద్ధతుల్ని, నిబంధనల్ని పాటించాలి. ఈ ఆర్థిక క్రమశిక్షణ, భవిష్యత్తు పరిరక్షణ మేరకైనా జాగ్రత్తగా ఆలోచించి 2024లో మనం ఓటు హక్కును వినియోగించుకోవాలి. క్రమంగానైనా, జేపీ ప్రకాశం జిల్లాలో చేసిన రీతిలో ప్రజల చేతికి అధికారమిచ్చి వారి సాధికారతను పెంచేలా, ప్రజలే ప్రభువులు అని నిరూపించేలా ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేసే సంస్కరణలను కూడా సాధించుకుందాం. ❖











# ‘భారత విదేశాంగ విధానం - విభేదాల నుంచి విశ్వాసానికి’

భారత విదేశాంగ విధానం - విభేదాల నుంచి విశ్వాసానికి’ అంశంపై ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, యూనియన్ మంత్రులు జైశంకర్, కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, ఫోరం అధ్యక్షుడు రామచంద్రరావు, పలువురు రాజకీయ, పౌర సమాజ నేతలు పాల్గొన్నారు.

(ఈ కార్యక్రమంలో జేపీ ప్రసంగం కోసం చూడండి

https://www.youtube.com/@JPLoksattaOfficial)

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th May, 2024 Posting Date 15 &16th of every month

# DEFINING ELECTIONS

## మీ ఆదాయాలు, అవకాశాలు, పిల్లల భవిష్యత్తు కోసం ఓటు వేయండి



మహాత్మాగాంధీ చెప్పారు 'A reformer must have infinite patience'. సమాజంలో సంస్కరణలు కోరేవాడికి అపారమైన ఓర్పు ఉండాలి. కానీ ఈలోగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రజల భవిష్యత్తును కాపాడాలంటే ఆర్థికాభివృద్ధి ఒక్కటే మన ముందున్న మార్గం

సంక్షేమం అవసరం. కానీ సంక్షేమమే పరిపాలన అనుకుంటే, రాష్ట్ర, దేశ భవిష్యత్తు అధోగతే. అందుకే, సంక్షేమంతోపాటు ఆర్థికాభివృద్ధిని పెంచే, పెట్టుబడులను ప్రోత్సహించే, ఉపాధి అవకాశాల్ని కల్పించే బీజేపీ, తెలుగుదేశం, జనసేన NDA కూటమికి ౨౦౨౪ ఎన్నికల్లో మద్దతు ప్రకటించాం

దేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న నిర్ణయాత్మక ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి

కులాలు, పార్టీలు, నేతల కోసం కాకుండా, మీ ఆదాయాలు, అవకాశాలు, పిల్లల భవిష్యత్తు కోసం ఓటు వేయండి

వచ్చే ౨౦ - ౨౫ ఏళ్లపాటు భారతదేశానికున్న ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని అందుకునేలా ఓటు వేయండి

**డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్,** ప్రజాస్వామ్య పీఠం (FDR ), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**